అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 25-3-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 86 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | W O W | 12 + 16పేజీలు + ...పతి వెల: ...00

24 గంటల కరెంట్ ముంచుతోంది

- నిజామాబాద్ జిల్లాలో 40 శాతం వరకు ఒట్టిపోయిన బోర్లు
- ఎండిపోతున్న పొలాలు..సబ్సిడీ గొర్రెల మేతకోసం విక్రయం
- పంట నష్టం అంచనా ఊసే ఎత్తని సర్కారు

అడుగంటుతున్న భూగర్భజలాలు



డిచ్‌పల్లి మండలంలోని చంద్రాయన్‌పల్లిలో వరిని మేస్తున్న గొర్రెలు



డిచ్‌పల్లి మండలంలోని తిర్మన్‌పల్లిలో...

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

'రైతులకు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం' అని సర్కారు గొప్పలకు పోతున్నా...అదే 24 గంటల కరెంటు అన్నదాతలను నిండా ముంచుతున్నది. నిరంతరాయంగా బోర్లు నడుస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఒక్క నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో 40 శాతం వరకు బోర్లు ఒట్టిపోయాయి. దీంతో కంకులు పోసే దశలో వరిపైరు ఎండిపోతున్నాయి. కడుపుకట్టుకుని పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. దిక్కులేని పరిస్థితుల్లో ఎకరా వరి పంటను రూ.1500 చొప్పున జీవాల మేత కోసం రైతులు అమ్ముకుంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో రబీ సీజన్‌లో లక్షా 96 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. లక్షా 46వేల బోర్లతో సాగు చేస్తున్నారు. అందులో నిజామాబాద్ జిల్లాలోని మోపాల్, ఇందల్‌వాయి, డిచ్‌పల్లి, సిరికొండ, వేల్పూర్, జాక్రన్‌పల్లి, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్, భీంగల్ మండలాల్లో బోర్ల కింద సాగవుతున్నది. ఈ మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో ఇప్పటికే 30 శాతం వరకు ఎండిపోయింది. మరోవారం రోజుల్లో సగానికి పైగా పంట దెబ్బతినే ప్రమాదముంది. ఏకధాటి కరెంటు సరఫరా వల్ల రోజురోజుకూ భూగర్భజలాలు అడుగంటిపోతుండటం, ఎండతీవ్రత పెరుగుతుండటమే అందుకు కారణం. ఇప్పటికే 40శాతం వరకు బోరుబావులు అడుగంటిపోయాయి. మిగతా బోర్లు కూడా పూర్తిస్థాయి నీటి సరఫరా చేయని పరిస్థితి.

కామారెడ్డిలోనూ అంతే..


కామారెడ్డి జిల్లాలో 36,552 ఎకరాల్లో వరిసాగు చేశారు. లక్షా 10వేల వరకు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. అందులో సగం బోర్లు ఇప్పటికే ఒట్టిపోయాయి. కామారెడ్డి ప్రాంతం పూర్తిగా మెట్ట ప్రాంతం కావడంతో భూగర్భజలాలు ...9లో

వర్సిటీల్లో జాతి వ్యతిరేకులంటూ..

వాళ్ల గొంతు నొక్కొద్దు : రఘురామ్ రాజన్



ముంబయి : చర్చలు జరిగే విశ్వవిద్యాలయాలు 'భద్రత కలిగించే ప్రదేశాలు'గా ఉండాలని, 'జాతి వ్యతిరేకి'గా ముద్ర వేసి ఎవరి నోళ్లను మూయించకూడదని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్ అన్నారు. వర్సిటీల్లో ప్రతీ ఆలోచనా ప్రవాహాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. 'ఆలోచనలు రేకెత్తించే, చర్చలు జరిగే వర్సిటీలను గౌరవించడాన్ని మనం నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. భిన్నాభిప్రాయాలను చెప్పే వారి గొంతు నొక్కరాదు. అలా మాట్లాడొద్దు.. ఇలా మాట్లాడొద్దు అని చెప్పే హక్కు, భిన్నాభిప్రాయాలను వ్యక్తపరిచే వారిని జాతి వ్యతిరేకులుగా ముద్ర వేసే హక్కు ఎవరికీ లేదు' అని అన్నారు. 'సమాజాన్ని ముందుకు నడిపించగలిగే అభిప్రాయాలను వారూ వ్యక్తం చేయవచ్చు... అందుకే వారు స్వేచ్ఛను ఉపయోగించుకునేలా సహజమైన చర్చలు జరిగే సురక్షిత స్థలాలను మనం సృష్టించాలి' అని రాజన్ చెప్పారు. విజ్ఞాన శాస్త్రంతో పాటు కళలు, మానవీయ శాస్త్రాలకు సంబంధించి ముంబయిలోని క్రియా విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రఘురామ్ రాజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ..'తమ తమ అభిప్రాయాలను వ్యక్తీకరించగలిగే ఈ ప్రక్రియ మంచిది. కాలక్రమేణా ఈ ఆలోచనలు ప్రధాన స్రవంతిగా మారతాయని నేను భావిస్తున్నాను, ఉదాహరణకు మహిళల హక్కులు 19వ శతాబ్దంలో చర్చించబడ్డాయి, ఆ తర్వాత వాటిని మనం అంగీకరించడానికి ముందుకు వచ్చాం' అని రాజన్ అన్నారు.



మహా రైతుల మార్చ్ స్ఫూర్తిదాయకం

CPI(M) 22nd CONGRESS HYDERABAD 18-22, April 2018



జెండాఊపి బస్సు జాతాను ప్రారంభిస్తున్న బి.వి. రాఘవులు

- బీజేపీ అధికారంలోకి వచ్చాక పెరిగిన మత కల్లోలాలు : బివి.రాఘవులు
- రాజ్యాంగాన్ని కాషాయీకరణ చేసే కుట్ర : తమ్మినేని
- రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో మహాసభ బస్సుయాత్ర ప్రారంభం

వివరాలు 9లో

రామగుండం కార్పొరేషన్‌లో గొడవ

- సొంత మేయర్‌పైనే టీఆర్ఎస్ కార్పొరేటర్ల తిరుగుబాటు
- ప్రతిపక్షంతో గొంతు కలిపిన ఎమ్మెల్యే అనుయాయులు
- బడ్జెట్ ప్రవేశపెట్టకుండా అడ్డగింత
- ఇరు గ్రూపుల ప్లకార్డుల ప్రదర్శనతో ఉద్రిక్తత
- కౌన్సిల్ వాయిదా వేసి వెళ్లిపోయిన మేయర్
- ఆ తర్వాతా కార్పొరేటర్ల ఆందోళన

వివరాలు 9లో

ఎస్ఐ అదృశ్యం ?

- నాలుగు రోజులుగా విధులకు దూరం
- గోప్యంగా ఉంచిన పోలీసులు

వివరాలు 6లో

ప్రశంసలు తప్ప ... పైసా సాయం లేదు

- కేంద్రంపై మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- సిర్పూర్ మిల్లు తెరిపిస్తున్నాం
- అంబేద్కర్ జయంతిన దళిత పారిశ్రామికవేత్తలకు రాయితీలు

వివరాలు 10లో



వెల్‌నెస్ సెంటర్లు కొనసాగుతాయి

వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాలు యథావిధిగా నడుస్తాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీలో వెల్‌నెస్ సెంటర్లను కలపడం లేదని వివరణ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ, వెల్‌నెస్ సెంటర్స్ ప్రజారోగ్యంలో రెండు వేర్వేరు ...9లో

కొక్కొరోకో..



ఎకరా భూమివ్వలేదు..మడికి నీళ్లివ్వలేదు.. మద్దతు ధరలేదు.. దళారుల బాధలు పోలేదు. రుణాలు రాలేదు..అయినా ఆత్మహత్యలు ఎట్లాతగ్గాయటరా..ఇ చిత్రం కాకపోతే..!!

ఉద్యోగ భద్రతకు తూట్లు

పరిశ్రమల యాజమాన్యానికి అనుకూలంగా నిబంధనల్లో మార్పు

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్రం
- యజమానికి ఇష్టముంటేనే ఉద్యోగం లేదంటే..ఊడుతుంది



న్యూఢిల్లీ : వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుడికి ఇకపై ఉద్యోగ భద్రత హుళక్కే. కంపెనీ యాజమాన్యం కార్మికుడ్ని విధుల నుంచి ఎప్పుడంటే అప్పుడు తీసేసే...ప్రమాదం ఏర్పడింది. 3నెలలు, 6నెలలు..కాల వ్యవధితో కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని నియమించుకునే హక్కు యాజమాన్యాలకు కల్పిస్తూ కేంద్రంలోని మోడీ సర్కార్ నిర్ణయం తీసుకుంది. తద్వారా కార్మికుడి ఉద్యోగ భద్రతకు మోడీ సర్కార్ తూట్లు పెట్టింది. దీనికి సంబంధించి కేంద్రం తాజాగా 'గెజిట్ నోటిఫికేషన్' జారీ చేసింది. దీని ప్రకారం,'పారిశ్రామిక నిబంధనల'కు సంబంధించి మార్పులు చేశారు. యజమాని ఇష్టముంటే కార్మికుడి ఉద్యోగం ఉంటుంది. లేదంటే ఊడుతుంది. యాజమాన్యానికి అనుకూలమైన నిబంధనల మార్పు చేశామని గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్రం తెలిపింది.

ఈ నిబంధనల మార్పు వల్ల, దేశవ్యాప్తంగా అనేక పరిశ్రమల్లో యాజమాన్యాలకి విశృంఖలమైన స్వేచ్ఛ దక్కింది. కార్మికుడ్ని ఉద్యోగంలో కొనసాగించటం యాజమాన్యం ఇష్టప్రకారంపై ఉంటుంది. కార్మిక సంఘాలు దేన్నైతే వ్యతిరేకిస్తున్నాయో, దానినే మోడీ సర్కార్ అమల్లోకి తేవటం సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తోంది. ఇంతకు ముందు వాజ్‌పేయీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2003లో ఇలాగే 'పరిశ్రమ నిబంధన'ల్లో మార్పులు చేసి, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా ...9లో

మరో 'ఆధార్' డేటా లీకేజీ వెలుగులోకి..?

న్యూఢిల్లీ : ఆధార్ డేటా గోప్యతపై మరో డొల్లతనం బయటపడింది. ఆధార్ డేటా ఎవరైనా పొందేందుకు అవకాశముందని కొంతకాలంగా వార్తలొస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరో ఆధార్ డేటా లీకేజీ వ్యవహారం శనివారం వెలుగులోకొచ్చింది. ఓ ప్రభుత్వ యుటిలిటీ కంపెనీ సిస్టం నుంచి ఆధార్ కార్డు వినియోగదారుల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాల వివరాలు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా ఉందంటూ ఢిల్లీకి చెందిన సెక్యూరిటీ రీసెర్చర్ ఒకరు గుర్తించడం చర్చాంశనీయమైంది. ఈ లీకేజీ కారణంగా ఆధార్ నెంబరును కలిగి ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రభావం ఉంటోందని ఆయన తెలిపారు. ఆధార్ డేటా లీకేజీ వివాదం కొంతకాలంగా నడుస్తోన్నప్పటికీ కేంద్రం ఇప్పటికీ దీనికి ఓ పరిష్కారాన్ని కనుక్కోలేకపోవడం గమనార్హం.

'నోట్లరద్దు, జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం'

న్యూఢిల్లీ: మోడీ ప్రభుత్వం చేపట్టిన నోట్లరద్దు, వస్తుసేవల పన్ను(జీఎస్టీ)తో భారత ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టమని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ అన్నారు. శనివారం మైసూర్‌లోని మహారాణి ఆర్ట్స్ కాలేజీ ఫర్ ఉమెన్స్ కళాశాల విద్యార్థులతో సమావేశమైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. నోట్లరద్దు నిర్ణయం, జీఎస్టీ అమలు వల్ల ఎంతో మంది నిరుద్యోగులుగా మారిపోయారని అన్నారు. నోట్లరద్దు చేపట్టిన విధానమే పెద్ద సమస్య అని చెప్పారు. ఆర్‌బీఐ గవర్నర్, ప్రధాన ఆర్థిక సలహాదారు, ఆర్థిక మంత్రి వంటి వారికి కూడా దాని గురించి తెలియదని, నోట్లరద్దు గురించి చిదంబరాన్ని అడిగితే దాన్ని ఒక అవివేకమైన చర్యతో పోల్చారని రాహుల్ తెలిపారు. అలాగే రాహుల్ మరోసారి కేంద్రప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. "నీరవ్ మోడీ బ్యాంకుల నుంచి రూ. 22,000కోట్లు అప్పు తీసుకున్నాడు. మేము మీకు అంత మొత్తం ఇస్తే మీ లాంటి యువత ఎన్ని వ్యాపారాలు పెట్టుకోవచ్చో ఊహించగలరా?" అని విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతున్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగాలు సృష్టించలేకపోయిందని మోడీ సర్కారును విమర్శించారు.

లాలూకు మరో 14 ఏండ్ల జైలు

రాంచి: నాలుగో పశుదాణా కుంభకోణం కేసులో రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) నేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు 14 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టు శనివారం కీలక తీర్పు వెలువరించింది. ఈ స్కాంలో నమోదైన రెండు కేసులకు గానూ ఏడేండ్ల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.60 లక్షల(రూ.30 లక్షల చొప్పున) జరిమానా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే.. అదనంగా మరో రెండేండ్లు జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీబీఐ తరపు న్యాయవాది తెలిపారు. 1990లో దుమ్కా ట్రెజరీ నుంచి రూ.3.13 కోట్లు అక్రమంగా విత్‌డ్రా చేసిన వ్యవహారంలో లాలూపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 467, 468, 471, 477, 120బీ కింద ఒక కేసు, అవినీతి నిరోధక చట్టం కింద మరొకటి నమోదయ్యాయి. ఈ రెండు కేసుల్లో లాలూతో పాటు మరో 18 మంది ని దోషులుగా తేలుస్తూ సీబీఐ కోర్టు ఈనెల 19న తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఇదే కేసులో బీహార్ మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా, మరో 12 మందిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. లాలూతో పాటు దోషులుగా తేలిన 18 మందిలో పశు సంవర్థక శాఖ మాజీ రీజినల్ డైరెక్టర్ ఒపి దివాకర్‌కు 14 ఏండ్లు, అదే శాఖలోని 9 మంది అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారి ఫూల్‌చంద్ సింగ్‌కు ఏడేండ్ల చొప్పున జైలు శిక్ష పడింది.

ఐఎస్‌కు రిక్రూటర్ కేసులో యాస్మిన్ జాహిద్‌కు 7ఏండ్ల జైలు

కొచ్చి: ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌లోకి 15మందిని రిక్రూట్ చేసిన కేసులో యాస్మిన్ మహ్మద్ జాహిద్‌కు ఏడేండ్ల కఠిన కారాగార శిక్ష పడింది. కొచ్చిలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థాన జడ్జి ఎస్ సంతోష్ కుమార్ ఈ మేరకు తీర్పునిచ్చారు.

మానవ అక్రమ రవాణా అతిపెద్ద విషాదం

- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా

న్యూఢిల్లీ: దేశంలో మానవ అక్రమ రవాణా అతి పెద్ద విషాదమని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా అన్నారు. 'మానవ అక్రమ రవాణా' అనే అంశంపై ఢిల్లీలో శనివారం జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ దందాలో ప్రమేయమున్న వారు.. మనుషులను వస్తువులుగా భావిస్తున్నారని చెప్పారు. ఇంతకుముందు బానిసత్వం రూపంలో మానవ అక్రమ రవాణా ఉంటే ఇప్పుడు మరో విధంగా చెలామణిలో ఉందన్నారు. మానవ అక్రమ రవాణా ఒక పరిశ్రమగా అవతరించిందని, చాపకింద నీరులా విస్తరిస్తున్నదని చెప్పారు. ఇది ప్రస్తుత, భవిష్యత్ తరాలకు అతి పెద్ద ప్రమాదమని తెలిపారు. మానవ అక్రమ రవాణాను నిలువరించేందుకు యువత తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు.

చంద్రయాన్-2 అక్టోబర్‌కు వాయిదా

చెన్నై: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వచ్చే నెలలో ప్రయోగించాల్సిన రెండవ మూన్ మిషన్... చంద్రయాన్-2ను అక్టోబర్‌కు వాయిదా వేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో నిపుణులు ఈ మిషన్‌కు సంబంధించి మరికొన్ని పరీక్షలు సూచించిన కారణంగా ఈ ప్రాజెక్టును అక్టోబర్‌కు మార్చినట్టుగా ఇస్రో ఛైర్మెన్ కె శివన్ తెలిపారు. చంద్రయన్-2 ఒక ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌లతో కూడుకున్న పూర్తి స్వదేశీ మిషన్. ఇది దాదాపు 3,290 కిలోల బరువును కల్గి ఉండి చంద్రుడి చుట్టూ తిరుగుతుంది. ఇస్రో ఈ మిషన్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. శ్రీహరికోట సతీష్ ధావన్ కేంద్రం నుంచి జీఎస్ఎల్‌వీ ఎంకె2 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను ప్రయోగించనున్నారు. 2008లో ప్రయోగించిన చంద్రయాన్-1 విజయవంతమైన నేపథ్యంలో చంద్రయాన్-2 ప్రయోగానికి ఇస్రో సిద్ధమవుతోంది.

బీహార్‌లో 17,685 మందికి ఒక డాక్టరే..

- అసెంబ్లీలో బీహార్ ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడి

పాట్నా: బీహార్‌లో 17,685 మందికి ఒక డాక్టర్ మాత్రమే ఉన్నారని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి మంగళ్ పాండే అసెంబ్లీలో చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రీయ జనతా దళ్ నేత అఖ్తారుల్ ఇస్లాం షాహీన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతి వెయ్యి మందికి ఒక డాక్టర్ ఉండాలని సూచించిన ప్రామాణికత మేరకు డాక్టర్ల- జనాభా నిష్పత్తి గురించి తెలపాలని పాండేను షాహీన్ కోరారు. దేశంలో డాక్టరు, జనాభా సగటు నిష్పత్తి 1:11,097గా ఉంటే బీహార్‌లో 1: 17,685గా ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మెడికల్ కాలేజీల్లో ఉన్న వారితో కలిపి మొత్తం 6,830 మంది డాక్టర్లు ఉన్నారని వెల్లడించారు. దేశంలో అధికారికంగా 10 లక్షల మంది డాక్టర్లు ఉండగా బీహార్‌లో 40,043మంది మాత్రమే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పాండే చెప్పారు. 2016లో బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్‌సీ) ద్వారా 1,805 మంది జనరల్ ప్రాక్టీస్ డాక్టర్లు, 665 స్పెషలిస్టు డాక్టర్ పోస్టులను భర్తీ చేసినట్టుగా వివరించారు. బీహార్‌లో మెడికల్ ప్రాక్టీషనర్ల కొరత ఉన్న కారణంగా స్టేట్ హెల్త్ సొసైటీ పాట్నా వారు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా స్పెషలిస్టు డాక్టర్లు, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ద్వారా జనరల్ డాక్టర్లను నియమించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

భారతీయులను బలిగొన్న డ్రైవర్లకు జైలుశిక్ష

- తీర్పు వెల్లడించిన యూకే కోర్టు

లండన్: గతేడాది బ్రిటన్‌లో ఎనిమిది మంది భారతీయులను బలిగొన్న రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరు ట్రక్కు డ్రైవర్లకు యునైటెడ్ కింగ్‌డం(యూకే) కోర్టు జైలుశిక్షను విధించింది. పోలాండ్ దేశానికి చెందిన రిషార్డ్ మసెరాక్(31)కు 14 ఏండ్ల జైలు శిక్షను ప్రకటించింది. ఆయన డ్రైవింగ్ లైసెన్సును 17 ఏండ్లపాటు నిషేధించింది. మరో డ్రైవర్ డేవిడ్ వాగ్‌స్టాఫ్(54)కు 40 నెలల జైలు శిక్షను ఖరారు చేసిన కోర్టు..మూడేండ్ల పాటు డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసింది. గతేడాది బ్రిటన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం.. మినీ బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది కేరళ రాష్ట్ర వాసుల మరణానికి దారి తీసింది. ఈ ఘటనకు దోషులైన ఇద్దరు డ్రైవర్‌ల నిర్లక్ష్యమే కారణమని అయెస్బరీ క్రౌన్ కోర్టు జడ్జి ఫ్రాన్సిస్ షెరిడాన్ అభిప్రాయపడ్డారు. 26 ఏండ్లలో పెద్ద దుర్ఘటన అని ఆయన అన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుతో

నీరుగారుతున్న ఎస్సీ, ఎస్టీ చట్టం

కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలి

సీఐటీయూ జనరల్ కౌన్సిల్ డిమాండ్




కోజికోడ్ : ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ (ఎస్సీ, ఎస్టీ) యాక్ట్ అమలుపై సుప్రీంకోర్టు బెంచ్ ఇచ్చిన తీర్పు.. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేదిగా వున్నదని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కేరళలోని కోజికోడ్‌లో జరుగుతున్న సీఐటీయూ ఆలిండియా జనరల్ కౌన్సిల్ సమావేశం తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రస్తుత సమాజంలో వున్న కులవివక్ష, వేధింపులు, దళితులపై జరుగుతున్న దాడులను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని సమావేశం అభిప్రాయపడింది. ముందస్తు బెయిల్‌పై వున్న నిబంధనలను సరళతరం చేయడంతోపాటు, ప్రభుత్వ సర్వీసులో వున్నవారిని విచారణ చేయాలంటే పై అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలనడం దారుణమని తెలిపింది. కులవివక్షకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోకపోతే... బాధితులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వున్నదనీ తీర్మానం పేర్కొన్నది. ప్రయివేటు ఉద్యోగి అయితే సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు నుంచి అనుమతి తీసుకోవడమంటే దోషులకు రక్షణ లభించినట్టే అవుతుంది. కేసు విచారణ సందర్భంలో కేంద్ర ప్రభుత్వ కౌన్సిల్ సభ్యులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేయలేదనీ, ఇప్పటికైనా జరుగనున్న నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలనీ, తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని సమావేశం డిమాండ్ చేసింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులపై పోలీసుల నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా చేసిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది.

అన్నిరంగాల్లో విస్తృత పోరాటాలు నిర్వహిస్తున్నాం : తెలంగాణా నుంచి చర్చల్లో పద్మశ్రీ

స్వతంత్ర కార్యాచరణ, ఐక్య కార్యాచరణను మిళితం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న పోరాటాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, స్కీం వర్కర్స్ సమ్మె, మున్సిపల్, విద్యుత్ రంగాలు, సింగరేణి తదితర అన్ని రంగాలలో ఐక్య కార్యాచరణగా ఏర్పడి పోరాడుతున్నామని తెలంగాణ రాష్ట్రం నుంచి చర్చల్లో పాల్గొన్న పద్మశ్రీ చెప్పారు. కొన్ని సమస్యలు మాత్రమే పరిష్కారమైనా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అర్థం చేసుకుంటున్నారని, విధానాన్ని అర్థం చేసుకుంటున్నారని, జనరల్ కౌన్సిల్ చేసే నిర్ణయాలను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామని ఆమె అన్నారు. చేస్తున్న ఉద్యమాలకు, వసూలవుతున్న సభ్యత్వం మధ్య వ్యత్యాసముందని, దానిని అధిగమించేందుకు కృషి చేస్తామనీ, కార్యకర్తల అభివృద్ధికీ, ట్రేడ్ యూనియన్ క్లాసుల నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని ఆమె తెలిపారు.





ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టం

దుర్వినియోగమవుతోందా..?



దాడులు ఎందుకు పెరుగుతున్నాయి..?

- ఐదేండ్లలో ఎస్సీలపై 40 శాతం, ఎస్టీలపై 118 శాతం దాడులు పెరిగాయి..
- క్రైమ్ రికార్డ్స్ చూడమంటున్న దళిత, ఆదివాసీ సంఘాలు

నవతెలంగాణ, జనరల్‌డెస్క్

ఎస్సీ, ఎస్టీలపై వేధింపులను నిరోధించే చట్టం అమలులోకి వచ్చి 23 ఏండ్లు గడిచిన తర్వాత అది దుర్వినియోగం కాకుండా అందులోని కొన్ని నిబంధనలు తొలగిస్తున్నామంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల దళిత,ఆదివాసీ సంఘాలు, సామాజికవేత్తల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. చట్టాన్ని నీరు గార్చేలా తీర్పు ఉన్నదని వారు విమర్శించారు. దళిత, ఆదివాసీలపై వేధింపులను నిరోధించడం కోసం ఉద్దేశించిన ఈ చట్టం 1995 నుంచి అమలవుతోంది. ఈ నెల 20న న్యాయమూర్తులు యుయు లలిత్, ఏకె గోయెల్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం తన తీర్పు ద్వారా చట్టంలోని రెండు నిబంధనలను రద్దు చేసింది.

ఈ చట్టం కింద నిందితులను ముందస్తు బెయిల్‌కు అవకాశం లేకుండా అరెస్ట్ చేసే అవకాశముండగా, ఆ నిబంధనను సుప్రీంకోర్టు రద్దు చేసింది. అధికారులను ఈ చట్టం కింద అరెస్ట్ చేయాలంటే ఉన్నతాధికారి నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని సుప్రీంకోర్టు తెలిపింది. అమాయకులైన పౌరులు, ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చేసేందుకు ఈ చట్టాన్ని కొందరు ఉపయోగించారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తప్పుడు అభియోగాల వల్ల కుల విద్వేషం మరింత పెరుగుతుందని, కులవాదాన్ని శాశ్వతం చేస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ చట్టం కింద ఫిర్యాదు అందిన వారంలోగా దర్యాప్తు జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రాథమిక దర్యాప్తులో తప్పుడు కేసుగా అనుమానం ఉంటే నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఏ కులానికి చెందినా, ఏ మతానికి చెందినా పౌరులెవరూ వేధింపులకు గురి కాకుండా రాజ్యాంగం హామీ ఇస్తుందంటూ ప్రాథమిక హక్కుల్లోని ఓ అంశాన్ని తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

అయితే, కొన్ని సంవత్సరాలుగా ఎస్సీ,ఎస్టీలపై వేధింపులు, దాడులు పెరుగుతున్నాయని దళిత,ఆదివాసీ సంఘాలు చెబుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలను అందుకు ఉదహరించాయి. 2009 నుంచి 2014 వరకు రికార్డులను పరిశీలిస్తే దేశంలోని ఎస్సీలపై దాడులు 40 శాతం, ఎస్టీలపై 118 శాతం పెరిగాయని ఆ సంఘాలు తెలిపాయి. నేరాలకు సంబంధించి మిగతా వాటితో పోలిస్తే ఈ చట్టం కింద శిక్షలు పడుతున్నది కూడా తక్కువేనని ఆ సంఘాలు తెలిపాయి. 2007 నుంచి 2016 వరకు డేటాను పరిశీలించగా... అన్ని నేరాలకు సగటున శిక్షలు పడింది 42.5 శాతం కేసుల్లో కాగా, ఎస్సీలపై దాడుల కేసుల్లో 28.8 శాతం, ఎస్టీలపై దాడుల కేసుల్లో 25.2 శాతం కేసుల్లో మాత్రమేనని సంఘాలు తెలిపాయి.

రికార్డ్స్ ప్రకారం 2016లో ఎస్సీలపై వేధింపులు, దాడుల సంఘటనలు 40,801 నమోదు కాగా, ఎస్టీలపై వేధింపులు, దాడుల సంఘటనలు 6,568 నమోదయ్యాయి. గతంలోని పెండింగ్ కేసులతో కలిపి ఎస్సీలపై దాడులకు సంబంధించి 2016లో 1,44,979 కేసుల్లో విచారణ జరగగా, 14,615 కేసుల్లో విచారణ పూర్తయింది. 3,753 కేసుల్లో దోషులకు శిక్షలు పడ్డాయి. 2016లో శిక్షలు పడిన కేసులు 25.7 శాతం. పెండింగ్‌తో కలిపి ఎస్టీలపై దాడులకు సంబంధించి 2016లో 23,408 కేసుల్లో విచారణ జరగగా, 2,895 కేసుల్లో విచారణ పూర్తయింది. 602 కేసుల్లో దోషులకు శిక్షలు పడ్డాయి. 2016లో శిక్షలు పడిన కేసులు 20.8 శాతం.

ఇస్లాంలో అంతర్భాగం కాదంటే..

- మసీదులకు రక్షణ ఉండదు : సుప్రీంకోర్టులో న్యాయవాది

న్యూఢిల్లీ: ఇస్లాంలో మసీదు అంతర్భాగం కాదని చెబితే దేశంలోని ఏ మసీదూ సురక్షితంగా ఉండబోదని ఓ పిటిషనర్ తరపు న్యాయవాది రాజీవ్ ధావన్ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలోని రామజన్మభూమి- బాబ్రీ మసీదు స్థల వివాదం కేసులో సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరగగా, మహ్మద్ సిద్దిఖీ అనే పిటిషనర్ తరపున ధావన్ వాదన వినిపించారు. దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం భూసేకరణ చేసేవరకూ ముస్లింల ప్రార్థన కోసం స్థలం కేటాయించాలని కోర్టుకు ధావన్ విజ్ఞప్తి చేశారు.

ఇస్లాం మతంలో ప్రార్థనలు చేయడానికి మసీదు తప్పనిసరని లేదని, బహిరంగ ప్రదేశాల్లోనూ నమాజ్ చేసుకునే వీలున్నదని అయోధ్య భూవివాదంపై 1994లో విచారణ సందర్భంగా ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేస్తూ ధావన్ ఆందోళన వ్యక్తం చేశారు. ధావన్ వాదన విన్న ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ కేసు విచారణను రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించే విషయంపై ముందుగా నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని అభిప్రాయపడింది. 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

భారీగా ఇంటెలిజెన్స్ అధికారుల బదిలీలు

- 500 మంది స్థానచలనానికి కేంద్రం నిర్ణయం..
- కర్నాటక, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనేనా?

న్యూఢిల్లీ : మోడీ సర్కారు ఇంటెలిజెన్స్ విభాగంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే శాఖలో పని చేస్తున్న దాదాపు 500 మంది ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. త్వరలో కర్నాటక అసెంబ్లీ, వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలోనే కేంద్రం ఈ చర్యలు తీసుకుంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. మూడు కేటగిరీలుగా తీసుకొని బదిలీలు చేపడుతున్నారు. మొదటి కేటగిరీలో ఒకే ప్రాంతంలో 20 ఏండ్లు పని చేసిన అధికారులున్నారు. రెండో కేటగిరీలో ఒకే ప్రాంతంలో 15 ఏండ్లు పని చేసిన వారుండగా.. మూడో దానిలో పోలీస్ సర్వీస్ నుంచి ఇంటెలిజెన్స్ విభాగంలోకొచ్చి.. ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులున్నారు. బదిలీ అయిన వారిలో చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, భువనేశ్వర్, భోపాల్, చండీగఢ్, ఢిల్లీ, గువహతి, రాష్ట్రాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులున్నారు. బెంగళూరు ఇంటెలిజెన్స్ విభాగంలో పని చేస్తున్న అధికారులందర్నీ తమిళనాడుకు బదిలీ చేయడం గమనార్హం. చెన్నై విభాగంలో పని చేస్తున్న వారు బెంగళూరుకు బదిలీ అయ్యారు. మరోవైపు ఇంత భారీ మొత్తంలో బదిలీలు ఉంటాయని ఊహించలేదని ఆ విభాగంలోని పలువురు అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్ సంస్మరణ సభ జరపాలన్నందుకు..

విద్యార్థినిపై కళాశాల యాజమాన్యం వేటు

- రాతపూర్వకంగా క్షమాపణ లేఖ ఇవ్వాలని ఆదేశం



భోపాల్ : అస్మాఖాన్ (20)... మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ఎంవీఎం కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నది. ఆమెను కళాశాల యాజమాన్యం ఏడాదిపాటు సస్పెండ్ చేసింది. అస్మాఖాన్‌పై యాజమాన్యానికి ఎందుకు కోపం వచ్చింది? యాజమాన్యం దృష్టిలో ఆమె చేసిన తప్పేంటి? వరాలిలా..

స్వాతంత్ర్యపోరాట విప్లవయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసిన రోజైన మార్చి 23న సంస్మరణ సభ నిర్వహించేందుకు ఆ కళాశాల విద్యార్థి సంఘమైన భగత్ క్రాంతి దళ్ (బీకేడీ)కు యాజమాన్యం అనుమతి నిరాకరించింది. దేశం కోసం ప్రాణాలర్పించిన వారి సంస్మరణ సభకు కళాశాల యాజమాన్యం అనుమతివ్వకపోవడంపై బీకేడీ సభ్యురాలైన అస్మాఖాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేసింది. గతంలో కళాశాల విద్యార్థి సంఘానికి జరిగిన ఎన్నికల్లో నాలుగు పోస్టుల్లో.. మూడుస్థానాల్లో ఏబీవీపీని ఓడించి బీకేడీ ఘన విజయం సాధించింది. ఓటమిపాలైనప్పటి నుంచి కళాశాలల్లో ఏబీవీపీ ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టిస్తూనే ఉన్నది. ఇక విద్యార్థిని పెట్టిన పోస్టు విషయానికి వస్తే... యాజమాన్యాన్ని విమర్శిస్తూ తాను పెట్టిన పోస్టుకు ప్రతికూల ఫలితం వస్తుందనే భయంతో దానిని వెంటనే తొలగించింది. అయితే... ఆమె పెట్టిన పోస్టు స్క్రీన్‌షాట్ తీసి ఒకరు దానిని సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. అస్మా మార్చి 21న పోస్టు పెట్టగా... 22న కళాశాల అధికారుల నుంచి ఒక లెటర్ రానే వచ్చింది. 'కళాశాల ప్రొఫెసర్లందరినీ విమర్శిస్తూ మీరు సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. అందుకే మిమ్మల్ని ఏడాదిపాటు కళాశాల నుంచి సస్పెండ్ చేస్తున్నాం' అన్నది ఆ లేఖ సారాంశం.

'కళాశాల యాజమాన్యం ఉద్దేశపూర్వకంగానే తనపై వేటు వేసింది. రాజకీయంగా, సామాజికంగా తాను క్రియాశీలకంగా పనిచేస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాదు, ముందస్తుగా ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, నా అభిప్రాయాలను తెలుసుకోకుండానే కళాశాల యాజమాన్యం నన్ను ఎలా సస్పెండ్ చేయగలదు?' అని అస్మాఖాన్ ప్రశ్నిస్తున్నారు. 'ఆమె చేసింది తప్పు. దానికి ఆమె క్షమాపణ చెప్పాలి' అని కాలేజ్ ప్రిన్సిపాల్ నీరజ్ అగ్నిహోత్రి అన్నారు.

నేను ఏ తప్పూ చేయలేదు : అస్మాఖాన్

'నేను ఏ తప్పూ చేయలేదు. వారికి క్షమాపణ చెప్పాను. రాజ్యాంగం నాకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇచ్చింది. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఆ వీరులకు నివాళి సభ నిర్వహించాలని కోరడంలో తప్పేముంది' అని అస్మాఖాన్ అన్నారు. 'షహీద్ దివస్ కార్యక్రమ నిర్వహణకు ఎంవీఎం కళాశాల యంత్రాంగం నుంచి బీకేడీ అనుమతి కోరుతూ లేఖ ఇచ్చింది. ఆ వెంటనే ఏబీవీపీ అదే ప్రాంతం, అదే సమయానికి సభ నిర్వహిస్తా మంటూ లేఖ ఇచ్చింది. దీంతో సభ నిర్వహించేందుకు తాము ఎవరికీ అనుమతివ్వలేదు. విషయం తెలుసుకున్న బీకేడీ క్యాంపస్‌లోనే మరో ప్రాంతంలో సభ నిర్వహించుకునేందుకు అనుమతి కోరినప్పటికీ ఎవరినీ అనుమతించలేదు' అని ఎంవీఎం ప్రిన్సిపాల్ అగ్నిహోత్రి తెలిపారు.

'2011 నుంచి కళాశాల ఆడిటోరియంలో తాము మార్చి 23న సభ నిర్వహిస్తున్నాం. ఏబీవీపీ ఒత్తిడి మేరకు యాజమాన్యం ఈ ఏడాది సభ నిర్వహించుకునేందుకు అనుమతివ్వలేదు' అని అస్మాఖాన్ ఆరోపించారు.

బీకేడీ సభ్యుల ఆందోళన

షహీద్ భగత్‌సింగ్ సభ నిర్వహణకు అనుమతి నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ బీకేడీ సభ్యులు ఈ నెల 19 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. అదే రోజు అస్మాఖాన్ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. నిరాహారదీక్ష ప్రారంభించిన 40 గంటల తర్వాత సిటీ పోలీసులు అర్ధరాత్రి దీక్షా శిబిరంపై దాడి చేసి...విద్యార్థులను అక్కడి నుంచి ఈడ్చిపారేశారు.

హోలీ ఉత్సవాలనూ అడ్డుకున్న కళాశాల యాజమాన్యం

హోలీ ఉత్సవాల సందర్భంగా కూడా కళాశాల యాజమాన్యం ఇదేవిధంగా వ్యవహరించినట్టు తెలుస్తున్నది. బీకేడీ విద్యార్థులు అనుమతి కోరగా... కళాశాల ఆడిటోరియంలో ఒక మతానికి సంబంధించిన ఉత్సవాలను అనుమతించబోమని చెప్పారు. ఈ నెల 7న అదే ఉత్సవాలను నిర్వహించేందుకు ఏబీవీపీకి మాత్రం అనుమతివ్వడం గమనార్హం. దీనిపై అగ్నిహోత్రిని ప్రశ్నించగా... 'హోలీ రోజు నేను సెలవులో ఉన్నాను. అప్పుడు ఏం జరిగిందో నాకుతెలియదు' అని సమాధానమిచ్చారు.

తన తండ్రి మహమ్మద్ మహ్‌ఫూజ్, తల్లి షంషాద్‌తో కలసి అస్మాఖాన్ ప్రిన్సిపాల్‌ను కలువగా... సస్పెన్షన్ వేటుపై పునఃపరిశీలించేది లేదనీ, రాతపూర్వకంగా క్షమాపణ లేఖ ఇవ్వాలని అస్మాఖాన్‌ను ప్రిన్సిపాల్ ఆదేశించారు. 'క్షమాపణ లేఖ ఇచ్చినట్లయితే.. నన్ను నేరస్తురాలిగా ముద్రవేస్తారు.. నా కెరీర్ అసంపూర్ణంగా ముగిసినట్టే' అని అస్మా స్పష్టంచేశారు. న్యాయబద్ధంగా తాను పోరాటం చేస్తానని ఆమె తెలిపారు.

పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ముందు జర్నలిస్టుల ధర్నా

దాడికి పాల్పడ్డ అధికారుల పై చర్యలకు డిమాండ్



న్యూఢిల్లీ: జేఎన్‌యూ విద్యార్థులు, ఉపాధ్యాయుల పార్లమెంట్ మార్చ్‌లో ఇద్దరు మహిళా జర్నలిస్టుల పై పోలీసుల అనుచిత ప్రవర్తనను వ్యతిరేకిస్తూ ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ముందు జర్నలిస్టులు శనివారం ధర్నా నిర్వహించారు. వివిధ మీడియా సంస్థలకు చెందిన పలువురు జర్నలిస్టులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. మహిళా జర్నలిస్టుల పై దాడి, వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. పార్లమెంట్ మార్చ్ ఆందోళనను కవర్ చేస్తున్న తమను పోలీసులు బెదిరిస్తూ అకారణంగా దాడికి పాల్పడ్డారని బాధిత మహిళా జర్నలిస్టులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. తాము జర్నలిస్టులమని తెలిసినప్పటికీ పోలీసులు కావాలనే తమతో అనుచితంగా ప్రవర్తించారని బాధిత మహిళా జర్నలిస్టులు తెలిపారు. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్, ప్రెస్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఇన్ ఇండియాలు ఉమ్మడి ప్రకటనను విడుదల చేశాయి. తమ వినతులను ఆలకించాలని ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు డిమాండ్ చేశారు. బయటకు వచ్చిన పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. నిరసనకు చిహ్నంగా జర్నలిస్టులంతా తమ కెమెరాలను మైదానంలో ఉంచారు. మహిళా జర్నలిస్టుల పై జరిగిన పోలీసులు జరిపిన దాడి భయాన్ని కలిగించేలా ఉందని, శాంతి భద్రతలు కాపాడవలసిన పోలీసులలో క్రమశిక్షణ లోపించడమే ఇలాంటి ఘటనలకు కారణమని ఒక జర్నలిస్టు అభిప్రాయపడ్డారు.

క్షమాపణలు తెలిపిన ఢిల్లీ పోలీసులు

జర్నలిస్టులు చేపట్టిన ఆందోళనకు ఢిల్లీ పోలీసులు దిగివచ్చారు. ఇద్దరు మహిళా జర్నలిస్టుల పై జరిగిన దాడి ఆరోపణల పై వారు తీవ్ర క్షమాపణలు కోరారు.

కొంత మంది విద్యార్థులు బారీకేడ్లను తోసుకుంటూ రావడంతోనే వాటర్ కేనన్లను నిరసనకారుల పై ప్రయోగించామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంలోనే మహిళా జర్నలిస్టు ఫిర్యాదు చేసిందని, తదుపరి చర్యలు తీసుకోవడానికి విజిలెన్స్ బ్రాంచ్ విచారణ జరుపుతుందని వివరించారు.

విచారణకు ఆదేశించిన జాతీయ మహిళా కమిషన్

నిరసన తెలుపుతున్న జేఎన్‌యూ విద్యార్థులు, ఇద్దరు మహిళా జర్నలిస్టుల పై పోలీసుల లాఠీఛార్జ్, అనుచిత ప్రవర్తన పై విచారణకు జాతీయ మహిళా కమిషన్ శనివారం ఆదేశించింది. ' ఈ ఘటన పై విచారణ జరపడానికి ఒక ప్రత్యేక బృందాన్ని నియమించాం. విచారణలో భాగంగా ఢిల్లీ పోలీసు అధికారులను బృందం కలుస్తుంది. సోమవారం తదుపరి చర్యలను కొనసాగిస్తాం' అని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ స్పష్టం చేశారు. కాగా, పోలీసులు జరిపిన దాడి అకారణమని ఆందోళన చేస్తున్న విద్యార్థులు అన్నారు.

కేసీఆర్ ఫ్రంట్ మీద ఎలాంటి ఆశలు, అంచనాల్లేవు..

రాజకీయ విన్యాసాలు చేస్తున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు...

- రోజురోజుకీ బలోపేతమవుతున్న బీఎల్ఎఫ్
- పడిపోతున్న మోడీ గ్రాఫ్ : సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- అఖిల భారత మహాసభల సీడీ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతున్న ఫ్రంట్‌పై తమకెలాంటి ఆశలు, అంచనాల్లేవని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వ్యాఖ్యానించారు. ఇలాంటి రాజకీయాంశాలతోపాటు ఆర్థిక విధానాల్లోనూ ఆయన మాటల్లో డొల్లతనం స్పష్టంగా కనబడుతున్నదని విమర్శించారు. తమ రాజకీయ అవసరాలు, ప్రయోజనాల కోసం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, కేసీఆర్.. పలు విన్యాసాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అంతేతప్ప వారి విధానాల్లో ఎలాంటి మార్పులూ లేవని చెప్పారు. సీపీఐ (ఎం) అఖిల భారత మహాసభలు ఏప్రిల్ 18 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహాసభల ప్రచార నిమిత్తం రూపొందించిన పాటల సీడీని శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, జి.నాగయ్య, డిజి నర్సింహారావు, నంద్యాల నర్సింహారెడ్డితో కలిసి తమ్మినేని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎంబి భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోడీ గ్రాఫ్ నానాటికీ పడిపోతున్నదని తెలిపారు. దీంతో తొలిసారిగా 22 రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకుని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న బీజేపీ.. పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయిందని అన్నారు. మోడీ నాలుగేండ్ల పాలనలో పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ధరల పెరుగుదల, మతోన్మాద చర్యలు, దళితులు, మైనారిటీలపై వివక్ష, అణచివేత తదితర ఘటనలతో ప్రజలు విసిగి పోయారని చెప్పారు. మరోవైపు ఎన్డీయేలో మొన్నటి వరకూ భాగస్వామిగా ఉన్న టీడీపీలాంటి ప్రధాన పార్టీ బయటికొచ్చేసిందని తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో పార్లమెంటులో బీజేపీకి మెజారిటీ సభ్యులున్నప్పటికీ.. అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవటానికి సైతం ఆ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో రాష్ట్రాల హక్కుల గురించి మాట్లాడుతున్న కేసీఆర్.. తెలంగాణాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల అధికారాలన్నింటినీ లాగేసుకుని.. వాటిని తన గుప్పెట్లో పెట్టుకున్నారని విమర్శించారు. కేవలం నలుగురు వ్యక్తులే రాష్ట్రాన్ని శాసిస్తున్నారని తెలిపారు. అందువల్ల మహాసభల ప్రచారం ఆసాంతం బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్ వైఖరులను ఎండగడతామని తమ్మినేని తెలిపారు.

సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి నినాదం ప్రాతిపదికన తాము ఏర్పాటు చేసిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) నానాటికీ బలోపేతమవుతున్నదని తమ్మినేని ఈ సందర్భంగా చెప్పారు. ఈ నేపథ్యంలో మహాసభల ప్రచారం కోసం ఏర్పాటు చేసిన బస్సు జాతాలు, నిర్వహించబోయే సెమినార్లు, సదస్సులు, ఇంటింటి ప్రచారాల్లో సీపీఐ (ఎం) వైఖరితోపాటు బీఎల్ఎఫ్ విధానాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. కార్పొరేట్ దోపిడీపై పోరాటం, అగ్రవర్ణాల ఆధిపత్యానికి అడ్డుకోవటం తదితరాంశాలను జనంలోకి తీసుకెళతామని చెప్పారు. రాబోయే కాలంలో బీఎల్ఎఫ్‌ను ఆదరించి, ఆశీర్వదించాలని తమ్మినేని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సుప్రీం కోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్...

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు తాజాగా వెలువరించిన తీర్పు దురదృష్టకరమని తమ్మినేని వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించి నిందితులకు యాంటీ స్పెక్టరీ బెయిల్ వచ్చే విధంగా తీర్పులో పేర్కొన్నారని వివరించారు. అందువల్ల ఈ అంశంపై తమ పార్టీ తరపున సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇందుకనుగుణంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలని కోరారు.

జేఎన్‌యూ ఘటనలపై ఖండన

డిజి మాట్లాడుతూ.. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థులపై పోలీసులు అత్యంత పాశవికంగా లాఠీచార్జీ చేయటం శోచనీయమని అన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-చిలప్‌చెడ్

పంటల సాగుతో పెట్టుబడులు కూడా ఎల్లక, అప్పుల బాధ తాళలేక రైతు ప్రాణం తీసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండల పరిధిలోని రాందాస్‌గూడ గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిచ్చకుంట్ల నర్సింలు(48)కు రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి, బోరు ఉంది. రెండెకరాల్లో వరి, అద్దెకరంలో జొన్న సాగు చేశాడు. ఇటీవల బోరులో నీరు తగ్గింది. దాంతో వరి పైరు ఎండిపోసాగింది. కుమార్తె పెండ్లికి, సాగు కోసం తెచ్చిన అప్పు రూ. మూడు లక్షల వరకు ఉన్నాయి. రోజురోజుకూ అప్పులిచ్చిన వారి ఒత్తిడి పెరగసాగింది. ఇదే విషయమై కుటుంబ సభ్యులతో నిత్యం చర్చించే వాడు. ఈక్రమంలో శనివారం ఉదయం బావి వద్దకు పోయి చెట్టుకు ఉరే సుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీ సులకు సమాచారమందించారు. రైతుకు తల్లి, భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

చేనేత రుణ మాఫీ జీవోలో మార్పు

- 2010 నుంచి రుణాలు తీసుకున్న కార్మికులకు వర్తింపు
- 'నవతెలంగాణ' కథనానికి స్పందన



నవతెలంగాణ - కరీంనగర్ టౌన్

చేనేత రుణ మాఫీ జీవోపై సర్కారులో కదలిక వచ్చింది. 2010 నుంచి రుణాలు తీసుకున్న కార్మికులకు వర్తించేలా ప్రస్తుత జీవోలో నిబంధనలను ప్రభుత్వం మార్చింది. 'చేనేత రుణ మాఫీ 500 మందికే' శీర్షికన ఈనెల 12న 'నవతెలంగాణ' మెయిన్ పేజీలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. 2014 జనవరి నుంచి 2017 మార్చి చివరి వరకు రుణాలు తీసుకున్న చేనేత కార్మికులకు మాత్రమే వర్తించే విధంగా జీవో నెంబర్ 26లో ఆదేశాలు జారీ చేసిం ది. ఈనేపథ్యంలో అతి తక్కువ మంది కార్మికులకే వర్తిస్తుందని 'నవతెలంగాణ' కథనంలో పేర్కొంది. దీనిపై స్పందించిన ప్రభుత్వం పాత జీవోను మార్చినట్టు ప్రకటించింది. కొత్తగా జీవో నెం.46ను విడుదల చేసింది. 2010 జనవరి నుంచి 2017 మార్చి వరకు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ చేస్తున్నట్టు స్పష్టం చేసింది. దీనిపై చేనేత కార్మికులు 'నవతెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ ఎఫెక్ట్

నాప్‌కిన్స్‌పై 28 శాతం జీఎస్టీ సిగ్గుచేటు

- ఎఫ్ఆర్‌డీఐతో సామాన్యుల డిపాజిట్లకు భద్రత కరువు : ప్రొఫెసర్ కె.నాగేశ్వర్
- కార్మికులు సంఘటితమై ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి : ఎస్.వీరయ్య



నవతెలంగాణ-జగిత్యాల

కేంద్ర ప్రభుత్వం నాప్‌కిన్స్‌పై 28 శాతం జీఎస్టీ విధించటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ విమర్శించారు. జగిత్యాలలోని కామ్రేడ్ మహ్మద్ అమీన్ ప్రాంగణం(శివసాయి హోటల్)లో మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని మాజీ ఎమ్మెల్సీ కె.నాగేశ్వర్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య శనివారం ప్రారంభించారు. అంతకు ముందు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మురళి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధుల సభనుద్దేశించి నాగేశ్వర్ మాట్లాడుతూ..నీరవ్ పటేల్ పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 14,000 వేల కోట్ల రూపాయల కుచ్చుటోపి పెట్టి విదేశాలకు పారిపోయిన మరునాడే దావోస్‌లో జరిగిన సమావేశంలో ప్రధాని మోడీతో కలిసి ఆయన ప్రత్యక్షమవటం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎఫ్ఆర్ డీఐ బిల్లు వలన సామాన్యుల డిపాజిట్లకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్మికరంగం బాధ్యతా యుతంగా ఉండి దేశంలో ప్రత్యా మ్నాయ రాజకీ యాలవైపు ఆలోచన చేయాలని కోరారు. ఎస్. వీరయ్య మాట్లాడుతూ... కార్మిక సంఘాలన్నీ సంఘటితంగా ఉంటేనే ప్రజాస్వామ్యా న్ని కాపాడ వచ్చని అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు రాజకీయ రంగంలో అడుగుపెట్టాలన్నారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆర్.విశ్వనాథం మాట్లాడుతూ... తమ పోరాటాల వల్ల 358 రకాల మందులు ధరలు, స్టంట్స్, మానవ శరీరంలో అమర్చే పరికరాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. టీఎంఎస్ఆర్‌యూ ప్రధాన కార్యదర్శి ఐ.రాజుభట్, డాక్టర్ సి.పద్మిని కుమార్, జగిత్యాల జిల్లా సీపీఐ (ఎం) నాయకులు తిరుపతి నాయక్, కె. సునిల్ కుమార్, ఎఫ్‌యంఆర్ఏఐ వర్కింగ్ కమిటీ మెంబర్, కార్యనిర్వాహక కార్యదర్శి పిన్నంశెట్టి రాము, కోశాధికారి కస్తూరి రమణ, రాష్ట్ర నాయకులు ముకుంద్ కులకర్ణి, జి.విద్యాసాగర్, పీఏఎస్ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు భద్రత కరువు

సుద్దాలలో విద్యార్థిసంఘాల భారీ ర్యాలీ





నవతెలంగాణ-కోనరావుపేట

మహనీయుల విగ్రహాలకు రాష్ట్రంలో భద్రత కరువైందని సామాజిక ఉద్యమవేత్త, ప్రొఫెసర్ ఉ.సాంబశివరావు వాపోయారు. సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, బహుజన ప్రజాస్వామ్యవాదులు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ధ్వంసమైన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం జరిగిన సభలో సామాజిక ఉద్యమవేత్త, ప్రొఫెసర్ సాంబశివరావు మాట్లాడారు. విగ్రహాలపై దాడులు చేయడం ఆధిపత్యవాదుల చర్యలో భాగమన్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహం ధ్వంసం వెనుక ఉన్న దుండగులను గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం దళిత ప్రతిఘటన వేదిక నాయకురాలు, ప్రొఫెసర్ సూరపెల్లి సుజాత మాట్లాడుతూ దేశంలో మహిళాభ్యున్నతి కోసం ఎన్నో సేవలందించిన సావిత్రిబాయి పూలే విగ్రహం ధ్వంసం చేయడం సిగ్గు చేటన్నారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సుద్దాల ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేశ్, బీఎస్ఎఫ్ నాయకులు మహేష్, ఓయూజేఏసీ నాయకులు భాస్కర్, టీమాస్ గిరిజన శక్తి, కేబీపీఎస్, జేఎన్‌టీయూ విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావ సభ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వేచ్ఛ, సమానత్వం, శాంతి, సార్వభౌమాధికారాల కోసం పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ నెల 27న హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో సంఘీభావ సభ నిర్వహించనున్నట్టు తెలంగాణ రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తెలిపింది. శనివారం మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ 27న నిర్వహించే సభలో పాలస్తీనా సమాజంలో అతిపెద్దయిన పాలస్తీనియన్ల బాయ్‌కాట్, డైవెస్టిమెంటు, శాంక్షన్ నేషనల్ కమిటీ కోఆర్డినేటరు మహమూద్ నవాజా, సెక్రటేరియట్ సభ్యురాలైన మారెన్‌మన్సోవనిలు పాల్గొంటారని చెప్పారు. అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయిల్ దురహంకార ప్రభుత్వం 70 ఏండ్లుగా పాలస్తీనా ప్రజలపై దురాక్రమణ కొనసాగిస్తుందన్నారు. 1948లోనే 75శాతం భూమిని ఆక్రమించుకొని పాలస్తీయన్లను తరిమికొట్టిందని చెప్పారు. తూర్పు జెరూసలం, వెస్ట్ బ్యాంకు, గాజా ప్రాంతాల్లో చట్ట విరుద్ధంగా నివాసాలు, నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. పాలస్తీనా ప్రజల మాతృభూమి 87 శాతం ఇజ్రాయిల్ దురాక్రమణలో ఉందన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మాట్లాడుతూ పాలస్తీనా రైతులను తమ భూముల్లో వ్యవసాయం చేసుకోనివ్వకుండా బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. ఎదురు తిరిగిన రైతులను కాల్చి చంపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమారు 3వేల మంది చిన్నారులను అత్యంత పాశవికంగా చంపేశారని చెప్పారు. 12 వేల మంది మైనర్లను అరెస్టు చేయడం బాధాకరమని తెలిపారు. ఏఐకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి కె. రంగయ్య మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పాలస్తీనియన్లు తమ భూభాగంలోనే మైనార్టీలుగా గడపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్కడ ఐక్య రాజ్యసమితి తీర్మాణాలు, అంతర్జాతీయ చట్టాలు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం, అంతర్జాతీయ కోర్టు తీర్పులను కూడా ఉల్లంఘించడం జరగుతుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, గోవిందు, బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా ఆహార కమిషన్ ఏర్పాటు

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసేందుకే : మంత్రి ఈటల



మాట్లాడుతున్న మంత్రి ఈటల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహారభద్రత చట్టానికి సంబంధించి సంక్షేమ పథకాల సరఫరాలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకే రాష్ట్ర ఆహార కమిషన్‌ను ఏర్పాటు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. ఆదర్శనగర్‌లోని హెర్మిటేజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కమిషన్ నూతన కార్యాలయాన్ని ఛైర్మన్ తిరుమల రెడ్డి, ఆ శాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మీ పథకం, ప్రభుత్వ విద్యా సంస్థల్లో 9, 10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతోపాటు అన్ని రేషన్ షాపులకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తున్నదని తెలిపారు. బియ్యం చేరవేయడంలో అవకతవకలు, లబ్ధిదారులకు అందకపోవడంగా వంటి ఇతరత్ర సంఘటనలు జరిగినప్పుడు బాధితులు కమిషన్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. గర్భిణిలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తు న్నామని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 గుడ్లు కేంద్రాల ఇచ్చేవారని ప్రస్తుతం 30 గుడ్లు ఇస్తున్నా మని చెప్పారు. అదేవిధంగా 7నెలల నుంచి 3 ఏండ్ల లోపు చిన్నారులకు 8 నుంచి 16 గుడ్లు, 3-6లోపు చిన్నారులకు 15 నుంచి 30 గుడ్లు అందిస్తున్నామని వివరించారు. కాంట్రాక్టర్లు సరిగ్గా సరఫరా చేయకపోయినా.. గుడ్లు చిన్నగా ఉండటం ఫిర్యాదు అందితే కమిషన్ చర్యలు చేపడుతుంద న్నారు. అలాగే, మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యం ద్వారా విద్యార్థులకు అన్నం వడిస్తున్నామని దొడ్డు అన్నం అయితే కమిషన్ రంగంలోకి దిగుతుం దన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథ కాలు పక్కదారి పట్టకుండా కమిషన్ శక్తియు క్తులతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని మంత్రి ఈటెల ఆకాంక్షించారు.

టోల్ ఫ్రీ, విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేస్తాం

ఆహార కమిషన్ కార్యాలయంలో త్వరలో టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామని కమిషన్ ఛైర్మెన్ తిరుమల రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మం డల, జిల్లా కమిటీలతోపాటు విజిలెన్స్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కమిషన్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్ర మాలు చేపడతామని అన్నారు. రేషన్ షాపుల వద్ద రిజిష్టర్ బాక్సులు, గోడపత్రికలు ముద్రిస్తామ న్నారు. ప్రజలకు సక్రమంగా సేవలు అందేవిదం గా కృషి చేస్తామని వివరించారు.

- ఛైర్మెన్ తిరుమలరెడ్డి

ఫలాలు లబ్దిదారులకు చేరవేసేందుకే

సంక్షేమ పథకాలను దళారుల నుండి కాపాడి ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం ఆహార కమిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వా నికి వినియోగదారులకు మధ్య కమిషన్ వారధిగా పనిచేయాలని.. ఆకలి చావులు, అందరికి ఆహారం, పౌష్టికాహారం అందించేలా కమిషన్ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

- సివి ఆనంద్

సంపాదకీయం

స్నేహలత

ఏటి మిలమిలలోన
తోట నవనవలోన
వెలుగు నీడల పొత్తు
మా స్నేహం
తెరలెత్తి పూల పడవ
పరుగెత్తుతూ వుంటే
నా మది పరమశమవుతూ ...

అలా రెండు హృదయాలు ఉప్పొంగితే విరిసేది స్నేహం. రెండు మేఘమాలికలు కలిస్తే విరిజల్లు. స్నేహితుల హృదయాంతరాలలో సంతోషాల జల. ఈ నింగీ నేలా వానా సేలయేరూ మట్టీ మొక్కా వరుసలోనిదే స్నేహం కూడా. జీవితమొక సుదూర ప్రయాణం. మధ్యలో ఉన్నవన్నీ మజిలీలే... కానీ, మృదువైన రెండక్షరాల 'నెయ్యం' శతకోటి వసంతాల మేలు కలయిక. కోటి గొంతులు కలిసి పాట పాడే తీరు... నిండైన వెన్నెల. మంచి స్నేహితులను కలిగి ఉండటమంటే అందాల చందమామ అరచేతికి చిక్కినట్టే. స్నేహం నిండుకుండలాంటిది. అహా... నిండుకుండ ఒక్కటే కాదు...! నిండు హృదయం కూడా... అందుకే ఆ స్నేహం తొణకదు. స్నేహమనేది సాయంకాలం నీడవంటిది. జీవితపు సూర్యుడు అస్తమిస్తున్నపుడు అది బలాన్ని చేకూర్చుతుంది. అందుకని స్నేహబంధాన్ని మెలమెల్లగానే బలపడనీయాలి. ఆ తర్వాత మాత్రం దానిని మరింత బలీయంగా సుదృఢంగా కొనసాగించాలి సుమా...!

ప్రతి గొప్ప జీవితం వెనుక మలుపు తిప్పిన ఎన్నో విలువలు ఉంటాయి. మన వెంటే వుండే మిత్రులు... మన మంచితనాన్నీ, మన ఆశయాల్నీ పరోక్షంలో మెచ్చుకోవడం... ఓ మన్నన..! కష్టాల్లో... ఆనందాల్లో పాలుపంచుకోవడం.. నిజమైన మిత్రబంధం.. ఈ బంధం శాశ్వతం... అపురూపం..!

స్నేహితుల్ని కలిసిన ప్రతిసారీ వారి హృదయాలు మరోసారి జీవం పోసుకుంటాయి. ఈ క్రమంలో నిశ్చింతగా వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయి. మన బాల్యాన్ని గుర్తు చేసుకోవడం అంటే, మనసులో శరీరంలో సహజత్వాన్ని నింపుకోవడం... ఈ దోస్తానా సాగినకొద్దీ కొత్తకుండలో నీరులా మధురపానంలా ఉంటుంది. అందుకని మిత్రుల ఆత్మీయతను గట్టిగా మనసుకు హత్తుకొని భద్రపరుచుకోవాలంటారు 'షేక్స్‌పియర్.' మంచి మైత్రీబంధంలోని మాధుర్యం అటువంటిదే. కమ్మని మీగడ పెరుగులా.. మెత్తని వెన్నలా.. అలా..అలా... అదేమిటో చెప్పలేని అనుభూతి మన అంతరంగంలో గూడుకట్టుకొని ఉండిపోతుంది. ఎన్నటికీ తరగని ఓ పెన్నిధిలా పెనవేసుకొని వుంటుంది. ఆ మనసుల్ని మీటితే పలు రాగభావాల విపంచీ..




ఏవో కొన్ని కొలమానాలు పెట్టుకుంటే స్నేహం కుదరదు. ప్రతి ఒక్కరికీ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండాలి. అటువంటి స్వేచ్ఛ ఒక్క స్నేహితుల మధ్యే ఉంటుంది. మిత్రుల వల్లే ఆ మనిషి తన మనసులోని భావాలను స్వచ్ఛంగా వెల్లడించగలడు. కల్లాకపటం లేని ఆ వాతావరణం దోస్తుల వల్లే అబ్బుతుంది. అందుకనే యిద్దరు స్నేహితుల ఆలింగనం ఓ ఆలంబన. ఓ వెన్నుదన్ను. కష్టాల్లో కుంగిపోతున్న స్నేహమయి వెన్ను నిమిరితే ఏ ఔషధం అక్కరలేదు. ప్రపంచంలోని ఏ గొప్ప వస్తువులు కూడా మంచి స్నేహితులతో సరితూగవు. అందుకే 'విశ్వాసం లేకుండా స్నేహం ఉండదు...' అంటారు గౌతమబుద్ధుడు. కన్నవారితో, జీవిత బంధం పెనవేసుకున్నవారితో.. అక్కాచెల్లెళ్లతో, అన్నదమ్ములతో చెప్పుకోలేని విషయాలను సహచరులతో కలబోసుకోవడం ఉంది చూడండీ... అదే స్నేహానికున్న విశిష్టత. నవ్యత. వినమ్రత. ఆర్ద్రత. కష్టసుఖాల్లో... మంచీచెడులో అండగా ఉండేవారూ నిస్వార్థంగా స్నేహహస్తం అందించేవారే నిజమైన స్నేహితులు.

మిత్రులను తూచడానికి మన కష్టాలే త్రాసు. సుఖాల్లో ఉన్నప్పుడు అందరూ ఆప్తులే... కష్టాల్లో ఉంటే కనపడే వారు చాలా అరుదు. కానీ, కష్టాల్లో, నష్టాల్లో, బాధల్లో, ఓ హృదయం చిక్కుకుపోయినప్పుడు వెన్నంటే ఉండి... 'నాలో ఏముంది మిత్రమా...! అని నన్నడిగావు కదూ... గుప్పెడంత గుండెలో విశ్వమంత ప్రేమా..!' అని వెన్ను నిమిరేవారే ఆత్మీయులు. నిజమైన స్నేహితులు. ప్రతిఫలాన్ని ఆశించని ఆ బంధం అలా చిగురేసి... మొగ్గేసి... స్నేహలతలా అల్లుకుపోతుంది. జీవితాంతం నీడనిస్తుంది. ఇలా ఇరు హృదయాలను స్నేహబంధం పెనవేసి తరతరాలకు మధురిమల్ని పంచుతుంది. అది ఎంతటి అనిర్వచనీయమో ఆ స్నేహమాలికలో అమరిన మిత్రబృందానికే అవగతమవుతుంది. అసలు స్నేహాలకు వయస్సుతో కూడా నిమిత్తం ఉండదు. ఓ పదహారేండ్ల బాలికతో ముప్పయేండ్లామెకు స్నేహం కుదిరింది. తల్లి చనిపోవడంతో ఆ బాలిక ఒంటరి అయింది. కానీ, ఈ పడుచామె ఆ అమ్మాయి ఎక్కడికి వెళితే అక్కడకు అంటిపెట్టుకునే వుండేది. ఆ యువతి పెండ్లి సమయంలో కాబోయే భర్తకు 'నా నెచ్చెలి చాలా అమాయకురాలు. తెల్లనివన్నీ పాలూ... నల్లనివన్నీ నీళ్లూ అనుకుంటుంది... నీవే కంటికి రెప్పలా కాపాడాలీ బాబూ...!' అని ఓ లేఖ రాస్తుంది. 'స్నేహితురాలి రూపంలో నా తల్లే వచ్చి నా దగ్గరుండి అన్నీ తానై చూసుకుంటోందీ..' అని పెండ్లికూతురు సంతోషిస్తుంది. జీవితాంతం కృతజ్ఞురాల్ని... మిమ్మల్ని నా గుండెల్లో నింపుకుంటా... అని విన్నవిస్తుంది.

మనసు చెదిరినపుడు... దిక్కు తోచక కోరినపుడు స్నేహ హస్తం అందించేవారే మంచి మిత్రులు. ఇంట్లోవారితో చెప్పుకోలేని బాధలు కావచ్చు... సమస్యలు కావచ్చు... ఎలాంటి సంకోచం లేకుండా స్నేహితులకు చెప్పుకుని సేద తీరుతాం... గాయపడిన హృదయాలకు మంచిమిత్రుల సలహాలూ సంప్రదింపులూ నవనీతమే. అందుకే జీవనయానంలో స్నేహం ఓ శ్వాస... ప్రతి గొప్ప జీవితం వెనుక మలుపు తిప్పిన ఎన్నో విలువలు ఉంటాయి. మన వెంటే వుండే మిత్రులు... మన మంచితనాన్నీ, మన ఆశయాల్నీ పరోక్షంలో మెచ్చుకోవడం... ఓ మన్నన..! కష్టాల్లో... ఆనందాల్లో పాలుపంచుకోవడం.. నిజమైన మిత్రబంధం.. ఈ బంధం శాశ్వతం... అపురూపం..!

యువతపై ఫేస్‌బుక్ మానసిక నియంత్రణ



వి శ్రీనివాసరావు

యువతీయువకులందరికీ సుపరిచితమైన పేరు ఫేస్‌బుక్. క్రమంగా ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగమైపోతున్నది. ఆఖరికి రాజకీయ నాయకులు, సినిమా నటులు సైతం తమ అభిప్రాయాలు వెల్లడించడానికి దీనిని వేదికగా వాడుకుంటున్నారు. ఇలా ప్రతిరోజూ కోట్లాదిమంది ఒకరితో ఒకరు కనెక్ట్ అయి ఉంటున్నారు. వీరి భావాలు, అభిప్రాయాలు పదిమందికీ వేగంగా చేరుతుంటాయి. ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచారం కూడా ఇందులో ఉంటుంది. వారి వయసు, ప్రాంతం, లింగం, వృత్తి, వగైరా సమాచారం ఆధారంగా వారి భావాలను, అభిప్రాయాలను ఫేస్‌బుక్ విశ్లేషిస్తుంది. ఫేస్‌బుక్‌లో షేర్, వ్యాఖ్యానం, లైక్ అనే మూడు కాలమ్స్ ఉంటాయి. మనం ఒకదానిని లైక్ చేస్తున్నామంటే మన ఇష్టాయిష్టాలేమిటో మిగతావారికి అర్థమవుతుంది. మనం

మన ప్రజల వ్యక్తిగత సామర్థ్యం, బలహీనతలు అర్థం చేసుకుని దెబ్బతీయడానికి ఏ శత్రుదేశమైనా ప్రయత్నించవచ్చు. దీనిని అరికట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇది చేతకానితనం కాదు, కావాలనే విదేశీ కంపెనీలకు ఊడిగం చేసే పని. విదేశీ కంపెనీల్లో పనిచేస్తున్న ప్రముఖ ఇంజనీర్లు, వ్యూహకర్తలు భారతీయులే. విదేశీ కంపెనీల మీద ఆధారపడే బదులు మన వాళ్ల శక్తి సామార్థ్యాలను ఉపయోగించుకుని సొంతంగా మన కాళ్లపై మనమే అభివృద్ధి కావచ్చు.

చేసే వ్యాఖ్యానాలను బట్టి మన అభిప్రాయాలు వెల్లడవుతాయి. మన వ్యాఖ్యానాల మీద ఇతరులు ప్రతివ్యాఖ్యానాలు చేస్తుంటారు. ఇతరుల వ్యాఖ్యల మీద మనం కూడా అభిప్రాయాలు చెప్పొచ్చు.


మనతో కనెక్ట్ అయి ఉన్నవారితో వేరొకవైపు వారితో ఇంకొకరు కనెక్ట్ అయి ఉంటారు. ఇలా మనతో నిమిత్తం లేకుండానే అనేకమంది అంతర్గతంగా కనెక్ట్ అయి ఉంటారు. మన మిత్రుల అభిప్రాయాల మీద వారి మిత్రులు చేసే వ్యాఖ్యానాలు కూడా మనకు తెలుస్తుంటాయి. అలాగే మన వ్యక్తిగత జీవితంలో జరిగే అనేక కార్యకలాపాల మీద ఫొటోలు, వీడియోలు పెడుతుంటాము. ఉదాహరణకు పుట్టినరోజు, రిటైర్‌మెంట్ రోజు, పెండ్లిరోజు ఇలా ఏదో ఒక ఈవెంట్ మీద అప్‌లోడ్ చేస్తుంటాము. ఇవన్నీ మనకు, మన స్నేహితులకు మాత్రమే తెలుసునని, ఆ పరిధి దాటి బయటకుపోదని అనుకుంటుంటాము. కానీ మన వ్యక్తిగత సమాచారం సహా అభిప్రాయాలు, సన్నివేశాలతో ఆ కంపెనీ వ్యాపారం చేస్తుందంటే మనం నమ్మలేం. ఈ కారణంగానే జూకర్‌బర్గ్ అతి తక్కువ కాలంలో ప్రపంచంలో అత్యంత సంపన్నులైన ఐదుగురిలో ఒకడిగా ఎదగగలిగాడు. ఫేస్‌బుక్‌లో వచ్చే వ్యాపార ప్రకటనలు, మన సమాచారం వారి సంపాదనకు కారణం.

ప్రతి ఒక్కరి వ్యక్తిగత అభిరుచులను బట్టి మనకు వ్యాపార ప్రకటనలు వస్తుంటాయి. మనం ఇతరులతో జరిపే సంప్రదింపులు, లైక్‌లను బట్టి మనం దేనిని ఇష్టపడుతున్నామో వారి కంప్యూటర్ రికార్డు చేస్తుంది. దీనినే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ) అంటారు. దీని ఆధారంగా మనకు ఇష్టమైన వస్తువుల ప్రకటనలు వస్తుంటాయి. ఒకరి పేజీలో వచ్చే ప్రకటనలు మరొకరి పేజీలో రావు. మన అభిరుచులు మారితే అడ్వర్‌టైజ్‌మెంట్స్ మారుతాయి. ఉదాహరణకు పలానా సినిమా మనకు ఇష్టమంటే అలాంటి సినిమా ప్రకటనలన్నీ మనకు వస్తుంటాయి. అంతే కాదు ఆ సినిమా భావాలు, సన్నివేశాల ఆధారంగా మన మానసిక స్థితిని కూడా వారు అంచనా వేస్తారు. విడివిడి డేటానంతా ఒకచోట చేర్చి ప్రాసెస్ చేయడాన్నే బిగ్‌డేటా అంటారు. ఈ రోజు సాఫ్ట్‌వేర్ వ్యాపారంలో బిగ్‌డేటా అతిపెద్ద సరుకు. చాలామంది కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు మార్కెట్‌లో బిగ్‌డేటాకు ఉన్న ప్రాధాన్యతను బట్టి ఆ కోర్సు నేర్చుకుని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలాంటి బిగ్‌డేటాపై ఆధిపత్యమే ఫేస్‌బుక్ వ్యాపార రహస్యం. ఫేస్‌బుక్ దాని మరో వ్యాపార సంస్థ వాట్సప్, గూగుల్, యాహు, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు ఈ వ్యాపార రంగంలో పోటీ పడుతుంటాయి. ఇలా ప్రజాభిప్రాయాన్ని మలిచే టెక్నాలజీని సైకోగ్రాఫిక్స్ అంటారు. మనల్ని ఆకర్షించడానికి అనేక రకాల సేవలు ఉచితంగా అందిస్తుంటాయి. ఇప్పుడీ రంగంలోకి జియో కొత్తగా ప్రవేశించింది. ఇలా బిగ్‌డేటా బడాకార్పోరేట్ సంస్థల రాజకీయ, వ్యాపార సాధనంగా మారింది. తద్వారా సామాజిక ఆధిపత్యానికి దారి తీస్తోంది.

2013లో కేంబ్రిడ్జ్ అనెలిటికా అనే కంపెనీ కోగన్ అనే రీసర్చ్ స్కాలర్‌తో కలసి ఫేస్‌బుక్‌తో ఒప్పందం చేసుకొని డేటాపై ఆధిపత్యం సంపాదించింది. 2015లోనే ఇది బయటపడ్డా ఫేస్‌బుక్ ఎలాంటి రక్షణ చర్యలూ తీసుకోకుండా ఇప్పుడు వివాదం అవడంతో క్షమాపణ చెపుతోంది. యాప్ ద్వారా ఫేస్‌బుక్‌లో క్విజ్ పోటీ పెడతారు. వారిచ్చే సమాధానాలను బట్టి భావాలు అంచనా వేస్తారు. దీనిని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు అమ్ముకుని సొమ్ము చేసుకుంది. ఈ సమాచారం ఆధారంగానే ట్రంప్ ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహించి విజయం సాధించాడు. ప్రజల మానసిక స్థితిని బట్టి 115 రకాల అబద్దపు వార్తలను సృష్టించి కోట్లాదిమంది ఓటర్ల భావాలను ప్రభావితం చేయగలిగాడు. దాని మీదనే ఇప్పుడు అక్కడ విచారణ సాగుతున్నది. 2014 ఎన్నికల్లో ఇలాంటి సమాచారం ఆధారంగానే మోడీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ తమ కంపెనీకి క్లయింట్‌లని కేంబ్రిడ్జ్ అనెలిటికా కంపెనీ పేర్కొంది. దీని మాతృసంస్థ స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ లేబరీటరీస్‌తో మన దేశానికి చెందిన ఓవలెనో బిజినెస్ ఇంటెలిజెన్స్ (ఓ.బి.ఐ) సంస్థ ఒప్పందం చేసుకుంది. దీని ద్వారా ఈ పార్టీలు సమాచారం కొనుక్కున్నట్టుగా ఇప్పుడు బయటపడుతున్నది.

2014 ఎన్నికల్లో సోషల్ మీడియాపై బీజేపీ వేలకోట్లు వెచ్చించింది. వేలమంది సాంకేతిక నిపుణులను వినియోగించింది. వాలంటీర్లను రిక్రూట్ చేసుకుని వారు చేసే లైక్‌లు, షేర్‌లు ఆధారంగా డబ్బులు ఇచ్చేవారు. 2012 నుంచి గుజరాత్ మోడల్‌ను వీరు ప్రచారం చేయడం మొదలు పెట్టారు. యువతలో వున్న అసంతృప్తిని సోషల్ మీడియా ద్వారా అంచనా కట్టి వారి మానసిక స్థితిని బట్టి వీరు ప్రచారం నిర్వహించారు. మోడీ ప్రధాని అయితేనే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ఒక తటస్థ వ్యక్తి చెబుతున్నట్టుగా ప్రచారం చేసేవారు. దీనికి అనేకమంది ప్రభావితం అయ్యేవారు. ఎవరు ఎలాంటి సమస్యకు స్పందిస్తారో బిగ్‌డేటా ద్వారా వారు తెలుసుకుంటారు. వారితో ఆ అంశాలమీదనే చర్చలు చేస్తారు. తద్వారా మోడీ మేనియాను ఒక ట్రెండ్‌గా సృష్టించగలిగారు. చదువుకున్న యువతలో ఈ భావాలు వేలంవెర్రిగా వ్యాపించాయి. ఈ అనుభవాలను చూసాకే కాంగ్రెస్ కూడా ఆ కంపెనీతో జత కట్టింది. ఇప్పుడు ఈ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నాయి.

బీజేపీ దేశభక్తిగల పార్టీ అని, ఇతరులంతా దేశద్రోహులని నిరంతరం ఆడిపోసుకుంటోంది. ఈ



ఉదంతంతో బీజేపీ దేశభక్తి ఏమిటో ప్రజలకు వెల్లడైంది. భారతదేశ ప్రజల వ్యక్తిగత సమాచారం, భావాలు ఒక విదేశీ కంపెనీ సేకరించి అమ్ముకుంటుంటే దానిని నివారించాల్సిన పార్టీ గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా ఒప్పందం చేసుకుని సమాచారాన్ని వాడుకోవడం ఏ తరహా దేశభక్తి కిందకు వస్తుందో బీజేపీవారు చెప్పాలి. మోడీ ప్రత్యక్షంగా ఫేస్‌బుక్ యజమానిని కలవడమే కాకుండా ఫేస్‌బుక్, పేటీఎం లాంటి కంపెనీలకు తన ఫొటోవేసుకుని ఎడ్వర్‌టైజ్‌మెంట్ చేసుకునే అవకాశం కూడా కల్పించాడు. డిజిటల్ ఇండియా పేరుతో ఇలాంటి కంపెనీలకు భారతదేశంలో అవకాశం కల్పించాడు. బీజేపీ గాడ్‌ఫాదర్ ఆర్ఎస్ఎస్ ఈ విషయంలో నోరు మెదపడం లేదు. విదేశీ కంపెనీలు భారతదేశంలో ఇష్టానుసారం చెలరేగిపోవడానికి బీజేపీ ప్రభుత్వమే అవకాశం కల్పించింది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధార్‌పేరుతో 120కోట్లమంది ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి పెట్టింది. ఈ సమాచారాన్ని జియోసహా అనేక ప్రయివేటు కంపెనీలు ఉపయోగించుకుంటున్నాయి. కొంతమంది ఆధార్ సమాచారాన్ని హ్యాక్‌చేసి బహిరంగ మార్కెట్‌లో కూడా అమ్ముకున్నారు. ఇప్పుడు ఫేస్‌బుక్ ద్వారా బయటపడిన ఉదంతంలో బీజేపీ నేరుగా భాగస్వామి. ఇలాంటి పార్టీలు భారతదేశాన్ని భద్రంగా ఉంచగలుగుతాయా?

మనదేశంలోని ఇంటర్నెట్ వ్యవస్థ అనేక భద్రతాలోపాలను ఎదుర్కొంటున్నది. పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరిచే చట్టం కూడా ఏదీలేదు. ప్రయివేటు కంపెనీలు తమ వ్యాపార లాభాల కోసం పౌరుల సమాచారాన్ని ఇష్టానుసారం వాడుకుంటున్నాయి. చట్టరీత్యా వారికి ఆ హక్కు లేదు. అనుమతి లేకుండా ఎవరూ వ్యక్తిగత సమాచారాన్ని వాడుకోకూడదని సుప్రీం కోర్టు స్పష్టంగా తీర్పునిచ్చింది. అయినా ఇది ఆగలేదు. ప్రభుత్వం దీనిని అనుమతిస్తూనే వుంది. ఇది వ్యక్తుల భద్రతకే కాదు దేశభద్రతకు ప్రమాదం. ముఖ్యంగా ఎన్నికల కమిషన్ కూడా డేటా నిర్వహణకు గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. మెసేజ్‌లు పంపడానికి ఫేస్‌బుక్‌తో అంగీకారానికొచ్చింది. అసలే ఈ విషయాలపై ప్రజలకు అనేక అనుమానాలున్నాయి. ఈ స్థితిలో ఇలాంటి ఒప్పందాలు ప్రజల తీర్పును వమ్ము చేయడానికి దారి తీసే ప్రమాదం ఉంది. మన ఆర్థిక వ్యవస్థతో పాటు ప్రజాస్వామ్యం కూడా విదేశీపరం అయితే ఇంకేముంది?

మన ప్రజల వ్యక్తిగత సామర్థ్యం, బలహీనతలు అర్థం చేసుకుని దెబ్బతీయడానికి ఏ శత్రుదేశమైనా ప్రయత్నించవచ్చు. దీనిని అరికట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇది చేతకానితనం కాదు, కావాలనే విదేశీ కంపెనీలకు ఊడిగం చేసే పని. విదేశీ కంపెనీల్లో పనిచేస్తున్న ప్రముఖ ఇంజనీర్లు, వ్యూహకర్తలు భారతీయులే. విదేశీ కంపెనీల మీద ఆధారపడే బదులు మన వాళ్ల శక్తి సామార్థ్యాలను ఉపయోగించుకుని సొంతంగా మన కాళ్లపై మనమే అభివృద్ధి కావచ్చు. దీనికి బదులుగా మోడీ, చంద్రబాబు విదేశాల చుట్టూ తిరిగి అయినవారికి, కానివారికి ప్రణామాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సమాచారశాఖ మంత్రి, చంద్రబాబు తనయుడు లోకేష్ ఒక రెండు ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తెమ్మని ప్రతిపక్షాలకు సవాలు విసిరాడు. తాము ఆ పని చేస్తున్నందుకు పొంగిపోతున్నాడు. మేక్ ఇన్ ఇండియా నినాదం ఇస్తూ ఈ మాట అనడానికి వారికి సిగ్గుగా అనిపించడంలేదు. వారు తీసుకొచ్చే విదేశీ కంపెనీలను నడిపేదంతా భారతీయులే. వారుతెచ్చే పెట్టుబడంతా భారతదేశం నుంచి బయటకు పోయిన నల్లడబ్బే. మోడీ వాగ్దానం చేసినట్టు ఈ బ్లాక్ మనీనంతా దేశానికి తెస్తే మనమే ఎన్నో కంపెనీలను పెట్టుకోవచ్చు. మన మానవ సంపదను మనం కాపాడుకుంటే ఎంతో సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. దానికి బదులుగా ప్రతిదానికీ విదేశీ కంపెనీలపై ఆధారపడితే మన దేశమే దొల్లవుతుంది. ఫేస్‌బుక్ ఉదంతం దీనినే నిరూపిస్తుంది. ఇప్పటికైనా మోడీ, చంద్రబాబు విదేశీగానం మాని, స్వదేశీ అభివృద్ధిపై దృష్టిపెట్టాలి. మన పౌరుల సమాచార భద్రతకు గ్యారంటీ కల్పించే చట్టం తేవాలి. లేకుంటే చరిత్ర వీరిని క్షమించదు. ■

రిపోర్టర్స్ డైరీ

రేవంతన్న ఇదేందన్నా...

కొడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి ఏదో రకంగా ప్రచారంలో ఉంటారు. పార్టీ ఫిరాయించిన ఆయన ఉన్నట్టుండి అసెంబ్లీకి వచ్చారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేస్తారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన ఓటు వేయలేదు. టీడీపీ నుంచి గెలిచిన ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదు. రాజీనామాను చంద్రబాబుకు పంపించినట్టు మీడియాకు చెప్పారు. కానీ శాసనసభ స్పీకర్‌కు ఇవ్వలేదు. సుద్దులు, నీతులు చెప్పే రేవంత్‌రెడ్డికి రాజీనామాను స్పీకర్‌కు ఇవ్వాలని తెలియదనుకోలేం. సైకిల్ గుర్తుపై గెలిచినందుకు కృతజ్ఞతగా చంద్రబాబుకు లేఖ ఇచ్చారు. అదే చేత్తో స్పీకర్ ఇస్తే ఒడిసిపోయేది. చంద్రబాబునాయుడే తెలంగాణ స్పీకర్‌కు పంపిస్తారని ఆయన ఆశ. చంద్రబాబు పంపడు. ఇయన రాజీనామా చేయడు. పైగా రాజీనామా చేసినట్టు బిల్డప్. రాజ్యసభ అభ్యర్థిగా బలరామ్‌నాయక్‌కు ఓటేస్తే... టీడీపీ విప్ ధిక్కరణ కింద ఆయనపై అనర్హత వేటు వేస్తారన్న భయం వెంటాడుతున్నది. అందుకే శాసనసభకు వచ్చినా కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయలేదు. కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఎమ్మెల్యేలు సాహసించి విప్ ధిక్కరించి టీఆర్ఎస్ అభ్యర్థులకు ఓట్లేశారు. మరి రేవంత్‌రెడ్డి ఎందుకు ఓటేయలేదు. అనర్హత వేటు పడుతుందని భయమో, ఉప ఎన్నికలు వస్తే గెలుస్తానో లేదోననే ఆందోళనో తెలియదు...ఓటుకు దూరంగా ఉన్నారు.

-గుడిగ రఘు

ఇనుప గుగ్గిళ్లు..

సినీ తారలు.. గుక్క తిప్పుకోకుండా వదిలే డైలాగులు.. బాడీని స్ప్రింగులా చేసే బ్రేక్ డాన్సులు.. వెరసి తమ అందం, అభినయంతో అభిమానుల్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతారు. అయితే తెరపై వారి వాక్చాతుర్యాన్ని చూసి.. నిజ జీవితంలో కూడా అలాగే డైలాగుల్ని దంచేస్తారనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే (సారూ.. ఒక్కసారి తొడగొడితే దెబ్బకి వంద రైళ్లు ఆగిపోతాయి లెండి.. అంత పవర్‌ఫుల్...) విలేకరులతో మాట్లాడిన ఓ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. దాన్ని చూసిన వారికి సినీస్టార్ల 'మాటల మాధుర్యం'పై మస్తు క్లారిటీ వచ్చింది. సదరు ఎమ్మెల్యే జర్నలిస్టులతో మాట్లాడిన మాటలేంటంటే... 'అది ప్రత్యేక హోదా..! మరి చూసుకుంటే.. అది అలా.. దానికి.. నిజంగా.. ఒకటి కొత్త రాష్ట్రం.. దానికి.. వచ్చే లాభం.. అంటే.. లాభమా.. నష్టమా.. బేరీజు వేసుకుని.. మరి.. అంటే.. సీఎంగారూ.. మరి నిర్ణయం.. అది చేస్తారు...' అంటూ ఒక కిలో ఇనుప గుగ్గిళ్లను విలేకరుల మీదికి వదిలారు. దీంతో కండ్లు బైర్లు కమ్మిన పాత్రికేయ మిత్రులు అక్కణ్నుంచి పరుగో.. పరుగు... దటీజ్ మన నటసింహం...

-బి.వి.యన్.పద్మరాజు

ఫెడరల్ ఫ్రంట్‌కు వాత

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అన్న సామెత అందరికీ ఎరుకేకదా...! ఫెడరల్ ఫ్రంట్ పేర సీఎం కేసీఆర్ చేసిన హడావిడి కోల్‌కత తతంగం అంతా ఆ కోవలోకే వస్తుందని రాజకీయ విశ్లేషకులు గుసగుసలు పోతున్నారు. కోల్‌కత కాళిక మమత ఈయనకు కర్రు కాల్చి వాత పెట్టినంత పనిచేసిందని సోషల్‌మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి. దీంతో ఫెడరల్ ఆశలు గల్లంతైనట్టేనని అంటున్నవారు లేకపోలేదు. కూతురు కవితకు కేంద్ర మంత్రి పదవి కోసం పైరవీ, ఏపీ ప్రత్యేక హోదా విషయంలో అవిశ్వాసానికి మద్దతు ఇవ్వకపోవడంపై మమత కేసీఆర్‌తో మొహమాటం లేకుండా కుండబద్దలు కొట్టారట. దీంతో ప్రత్యేక విమానంలో పరిగెత్తిన ఈ పెద్దమనిషి కాస్త, మమత వేసిన వాగ్బాణాలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారని వాట్సప్, పేసుబుక్కులు, టిట్టర్లు అడగకుండానే చెప్పేసాయి. ఈ నేపథ్యంలో మూడో కూటమి ప్రతిపాదనలు మూటకట్టేశారనే వ్యాఖ్యానాలు వచ్చేసాయి.


- బి.బసవపున్నయ్య

రాసి ఇచ్చిన కాగితం చదివినట్టుంది

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతుంటే అచ్చం రాసి ఇచ్చిన కాగితం చదివినట్టుంది. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు 50 గ్రాముల నెయ్యి 12 రకాల ఐటమ్స్ ఇస్తున్నాం.. అని చెప్పారు. అంతే కాకుండా రోజు వారీగా మెనూలో ఏ ఐటమ్స్ అయితే పేర్కొన్నామో అవే ఐటమ్స్ పెడుతున్నారని చెప్పారు. వాస్తవంగా మెనూకూ హాస్టళ్లలో వండిపెట్టే భోజనానికి పొంతనే ఉండదు. ఒక వేళ ఎవరైనా అధికారులు వెళ్లి ప్రశ్నించినపుడు వచ్చే సమాధానమేంటంటే ఈ రోజు మాత్రమే వండలేదు సార్.. ప్రతి రోజూ మెనూ ఫాలో అవుతున్నామ్ సార్.. అని అంటారు. అధికారులు రాసి ఇచ్చిన పేపర్లలో ఉన్నదే వాస్తవం అనుకోకుండా అప్పుడప్పుడు హాస్టళ్ల తనిఖీకి వెళ్తే వాస్తవాలు బయటపడతాయి. హైదరాబాద్‌లోని హాస్టళ్లలో రెండేడ్లుగా విద్యార్థులకు ఐడీ కార్డులు ఇవ్వకపోవడంతో ఇప్పటికీ వాటినే ఉపయోగిస్తున్నారు. అధికారులు తనిఖీలకే పరిమితం కాకుండా హాస్టళ్లలో నిద్రచేస్తే పిల్లలు అనుభవించే దోమల బాధలు అప్పుడు అర్థమవుతాయని మీడియా పాయింట్‌లో జర్నలిస్టు మిత్రులు చర్చించుకున్నారు.

- మొత్కూరి యాదయ్య

కుర్సిగండం



తెలిదేవర భానుమూర్తి

నడిరాత్రి. యాడ జూసినా శీకటి శీకటే. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. కుక్కలు బౌబౌ మంటున్నయి. సడక్ మీద ఆడొక లారి ఈడొక మోటర్ బోతున్నయి. గూర్ఖ సడక్ మీద లాటితోని మోర్ గొట్టుకుంట గస్తి దిర్గుతున్నడు. అందరు పండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. ఇంకొందరు నిద్రరాక అటిటు బొర్లుతున్నరు. దొంగలు దొంగతనం జేసెతందుకు మోక కోసం ఎదురుజూస్తున్నరు. పోలీసోల్లు జీపుల గస్తి దిర్గుతున్నరు. జిద్దు ఇద్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. గాయిన దినం పూట పంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు. సైకిల్ దొక్కుకుంట గాయిన బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.


బొందలగడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు సుత దినంపూట పంటడు. నాత్రిపూట డ్యూటిజేస్తడు. పొద్దుమీకినంక గానికి వొండుకోబుద్ధి గాలేదు. గాడు హొటల్కు బోయిండు. బిర్యాని దిన్నడు. బిర్యాని తిన్నంక సిగిలేటు ముట్టిచ్చుకుండు. సిగిలేటు దాక్కుంట ఇంటికి వొచ్చిండు. ఇంటికి వొచ్చి టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంటనే గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. గని ఎప్పటితీర్గ బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్లు గొడ్తున్నదనుకోని నాలుగైదు పార్ల విక్రమార్కుడు సైకిల్ గంటి బజాయించిండు. గంటి సప్పుడుకు బేతాలుడు నిద్రలేసిండు. సల్లటి నీల్లతోని మొకం గడుక్కుండు. ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు.గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను గూసుండబెట్టుకోని ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త ఇను.

ముక్యమంత్రి కెసిఆర్ అపొజిసన్ పార్టిలను తిట్టుట్ల పస్తు. గదే తీర్గ టిఆర్ఎస్ మంత్రులను, ఎమ్మెల్యేలను గూడ లైన్ల బెట్టుట్ల గూడ పస్టే. గాయిన ఏమనుకుంటె గది జేస్తడు. ఎవ్వలకు ఎర్కగాకుంట చెయ్యికి మన్ను అంటకుంట పనులు. జేస్తుంటడు. ఎప్పటి సందో మంత్రి కుర్సిలను ఎక్వజేస్తనని గాయిన అంటున్నడు. గని జేస్తలేడు. మంత్రి కుర్సిలు ఎక్వజెయ్యాలంటె కొంత మంది మంత్రులను కుర్సిల మీదికెల్లి దించాలె. ఎవ్వరిని దించాలె? ఎవ్వరిని మంత్రికుర్సిల మీద గూసుండ బెట్టాలని గాయిన ఒక తీర్గ ఆలోచన జేసిండు. ఏం జేసినా చెయ్యికి మన్ను అంటకుండ జెయ్యాలని గాయిన అనుకున్నడు.

ఉగాది దినాన పంచాంగం జెప్తరు. గా పంచాంగంల ముందు ఏమైతదో జెప్తరు. టిఆర్ఎస్ పంచాంగం జెప్పిస్తె అంత టిఆర్ఎస్‌కు మంచిగ ఉంటదని జెప్తరు. మల్ల టిఆర్ఎస్సే హుకూమత్లకు వొస్తదంటరు. గదే బిజెపి పంచాంగం జెప్పిస్తె బిజెపియే హుకూమత్లకు వొస్తదని జెప్తరు. కాంగ్రెస్ పంచాంగం జెప్పిస్తె వొచ్చేపారి ఎట్లన్న కాంగ్రేస్సే హుకూమత్లకు వొస్తదని జెప్తరు. ఏ పార్టి పంచాంగం ఆ పార్టికి అనుకూలంగ ఉంటది. పంచాంగంకు కొంత మంది మంత్రులను కుర్సిల మీది కెల్లి దించి కొంతమందిని మంత్రి కుర్సిల మీద గూసుండ బెట్టుడుకు సంబందం ఏమున్నది. గీ సవాల్‌కు జవాబున్నది.



టిఆర్ఎస్ దిక్కుకెల్లి గీ పారి సంతోష్‌కుమార్ అనేటి అయ్యగారు పంచాంగం జెప్పిండు. గాయిన ఐదారుగురు మంత్రులకు కుర్సిగండం ఉన్నదని జెప్పిండు. గీ సంగతిని అయ్యగారే సొంతంగ జెప్పలేదంట. కెసిఆరే గాయినతోని గీ సంగతిని జెప్పిచ్చిండని అంటున్నరు. చెప్పిచ్చినా చెప్పిచ్చి ఉండొచ్చు. మంత్రులను లైన్ల బెట్టెతందుకే గాయిన గిట్ల జేసిండని అంటున్నరు. పంచాంగం అనేట్ది పైన్సు. గది సూర్యుడు ఎటు దిక్కు కెల్లి ఎల్తడో చెంద్రుడు ఎటుదిక్కు కెల్లి ఇంటి బోతడో జెప్తది. ఏ నచ్చత్రం ఏ తీర్గ మెరుస్తదో జెప్తది. వానలు ఎన్నడు గురుస్తయో, ఎండలు ఎన్నడు గొడ్తయో జెప్తది. పంచాంగంల అన్ని ఉన్నయి అని కెసిఆర్ అన్నడు. ముందుగాల దలితున్ని ముక్యమంత్రిని జేస్తనని గాయిన అన్నడు. గని అటెంకల కెసిఆరే అందరికన్న పెద్ద దలితుడు గాయిన్నే ముక్యమంత్రిని జెయ్యాలని అందరు ఎమ్మెల్యేలతోని అనిపిచ్చిండు. ముక్యమంత్రి అయ్యిండు.

ఐదారుగురు మంత్రు లను కుర్సిల మీది కెల్లి దించుతరనంగనే అందరు మంత్రులకు బుగులైంది. ఒక మంత్రి శివుని గుడికి బోయి అబిషేకాలు జేపిచ్చిండు. దేవుడా దేవుడా నన్ను మంత్రి కుర్సి మీదికెల్లి దించకుంట సూడు అని ఒక్క తీర్గ మొక్కిండు. ఒక మంత్రి గాయిన ఇంటి వాస్తును సూబెట్టిండు. మీ ఇంటి వాస్తు బాగ లేదు. ముంగటి దర్వాజ బంద్ బెట్టి ఎన్కటి దర్వాజ కెల్లి నడ్వుండ్రి. గట్ల జేస్తిరా అంటె మీకు అంత బాగుంటదని వాస్తు జూసెటోల్లు జెప్పిండ్రు. ఇగ దాంతోని గా మంత్రి ముంగటి దర్వాజ బంద్ బెట్టి ఎన్క దర్వాజ కెల్లి నడ్వబట్టిండు. ఇగ నేను బత్కమ్మ చీరెలను అందరికి బంచిన నాకే మంత్రి కుర్సి దొర్కుతదని ఒక ఎమ్మెల్యే అనుకోబట్టిండు. ముక్యమంత్రికి గులాబి పువ్వు ఇచ్చిన. ముక్యమంత్రి మెడల గులాబిపూల దండ ఏసిన. గాయిన మీటింగ్లకు లారిలల్ల. జెనంను దోల్కొచ్చిన.. జిందాబాద్లు గొట్టిపిచ్చిన. ఎట్లన్న జేసి నాకే మంత్రి కుర్సి వొస్తదని ఒక ఎమ్మెల్యే కలలు గనబట్టిండు. నూరు కన్న ఎక్వ పద్దెంలు యాజ్జేసిన. నిద్రల కెల్లి లేపి అడిగినా గా పద్దెంలను వొప్పజెప్త. నాకే మంత్రి కుర్సి దొర్కుతదని ఇంకొక ఎమ్మెల్యే అనుకోబట్టిండు.


"ఇంతకు కొంతమంది మంత్రులను కుర్సిల మీది కెల్లి దించాలని ముక్యమంత్రి ఎందుకు అనుకున్నడు. గీ సవాల్‌కు జవాబ్ ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ పంపుచర్ అయితది" అని బేతాలుడు అన్నడు.

"యాడాదిల ఎలచ్చన్లు ఉన్నయి. టిఆర్ఎస్ సర్కార్‌ల ఎసువంటి అవినీతి లేదని జెనంకు జెప్పెతందుకే కొంతమంది మంత్రు లను కుర్సిల మీద దించాలని ముక్యమంత్రి అనుకున్నడు" అని విక్రమార్కుడు జెప్పంగనే బేతాలుడు సైకిల్ దిగి బొందల గడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్:9959150491

'గజల్'... అర్థం ప్రేయసితో సంభాషణ. అదో పర్షియన్ సాహిత్య ప్రక్రియ... ఉర్దూకి అబ్బింది. మనసును తట్టిలేపే సంగీతం, మనిషిని ఆలోచింపజేసే సాహిత్యం.. గజల్ సొంతం. దాని అర్థం లాగానే ప్రేయసీ ప్రియులకే సొంతమైన ఒకప్పటి గజల్... తరువాత ప్రగతిబాట పట్టింది. సామాజిక ప్రయోజనం వైపు పయనించింది. తెలుగులో దాశరథి మొదలుపెట్టిన గజల్స్‌ను.. సినారె కొనసాగించారు. ఇప్పుడు ఎంతోమంది యువ కవులు, కవయిత్రులూ ఆ దోవనే నడుస్తున్నారు. రాయడానికి చాలా మంది ఉన్నారు. మరి పాడటానికో..? అంటే సమాధానం ఖాళీ. ఆ ఖాళీని పూరించారు మన తెలంగాణ బిడ్డ... కొత్తకాపు స్వరూప రాణి రెడ్డి. కేవలం వేదికలకే పరిమితమవ్వలేదు... మొన్ననే విడుదలైన 'నీది నాది ఒకే కథ' సినిమాలోనూ గజల్ పాడి... వెండితెరపై తన గళాన్ని వినిపించారు. తన పాటకు ప్రేక్షకులతో స్టాండింగ్ ఓవేషన్ ఇప్పించుకున్నారు. ఆ జహీరాబాద్ ఆడపడుచు పరిచయం...





సమాజ శ్రేయస్సుకోసం...

"గజల్స్‌తోపాటు... గోదావరి పుష్కరాలప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కోసం ఆల్బమ్ చేశాను. నేను భద్రాచలం వెళ్లినప్పుడు... ఆ పాట వినపడుతుంటే... అద్భుతమైన అనుభవం. కృష్ణ పుష్కరాలకోసం చేశాను. యాదగిరి గుట్టను యాదాద్రి అని మార్చగానే.. మావారు ఓ ఆల్బమ్ చేయమన్నారు. అలా యాదాద్రి మనోరంజని ఒక ఆల్బమ్ చేశాను. గజల్స్‌తో వీడియో ఆల్బమ్ చేయాలని ఉంది. అది కూడా సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడేవి చేయాలని ఉంది. జైల్లో ఉన్నవాళ్లకు కౌన్సెలింగ్ ఇస్తుంటారు. మాటగా చెప్పడం కంటే కూడా పాటగా చెబితే వారి మనసును హత్తుకుంటుంది. అందుకే ప్రభుత్వం సహకారం అడిగాను. సానుకూలంగా స్పందించారు. అది కూడా తొందరలోనే కార్యరూపం దాల్చనుంది. జూన్ 18న ఆటా(అమెరికన్ తెలంగాణ అసోసియేషన్) కన్వెన్షన్ నిర్వహిస్తుంది. దాన్ని సినారెగారికి అంకితం చేస్తున్నారు. అందుకోసం సినారెగారి ఆల్బమ్ ఒకటి చేయాలనుకుంటున్నా. తరువాత మిగిలిన వాటిమీద ఫోకస్ చేయాలి"

గజల్స్ గానామృతం

స్వరూప రాణి స్వస్థలం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్. తండ్రి పెంటారెడ్డి. తల్లి వీరమణి. వ్యవసాయాధారిత కుటుంబం. టెంత్ వరకు అక్కడే చదివింది. ఆమె చదివే స్కూల్లో చిన్నప్పటినుంచి సంగీతం నేర్పించేవారు. ఇంకా బాగా నేర్చుకోవాలని ఆమెకు ఆసక్తి. కానీ అప్పట్లో జహీరాబాద్‌లో సంగీత గురువులు లేరు. సంగీతం నేర్చుకోవడం కోసమే టెంత్ అయిపోగానే హైదరాబాద్ వచ్చింది. ఇంటర్ రెడ్డి కాలేజీలో చేరిందామె. తనకు ఇష్టమైన సంగీతం కోర్సులో 'రామ్‌కోటి' కాలేజీలో చేరింది. ఏదో ఒక ఇంటర్వ్యూలో తాను మ్యూజిక్ డిగ్రీ చేశానని శోభరాజు చెప్పారు. అది విన్న ఆమె... డిగ్రీ చేయాలనుకుంది. అదే విషయం ఇంట్లో చెబితే.. ముందు ఇంటర్‌లో మంచి మార్కులుతో పాసవ్వమన్నారు. చెప్పినట్టుగానే మంచి మార్కులతో తెచ్చుకున్నది. తరువాత తెలుగు యూనివర్సిటీలో డిగ్రీ, ఎమ్మే. నిజానికి తెలుగు యూనివర్సిటీలో సంగీతంలో ఎంఫిల్, పీహెచ్‌డీ లేవు. కానీ చేయాలన్న పట్టుదల ఆమెది.

జానపదాలకు రాగం కట్టి...

ఓసారి ఆమె దసరాకు ఇంటికి వెళ్లినప్పుడు.. బుడగ జంగాల వాళ్లు వచ్చారు. తండ్రి పాడతా ఉంటే.. కొడుకు వంత పాడుతున్నాడు. ఎన్ని తరాల నుంచి పాడుతున్నారని అడిగిందామె వారిని. 'మా తాతలు, తండ్రులు పాడారు. నేను పాడుతున్నా. నా పెద్ద కొడుకు మాత్రమే పాడుతున్నాడు. చిన్నోడు పట్నంల పనిచేసుకుంటుండు. ఇందులో ఏముంది? కడుపు నింపదు' అన్నాడు. నిజమే కడుపు నింపని కళేది బతకడం లేదు. ఈ తరానికి ఒక్క కొడుకైనా పాడుతున్నాడు. తరువాతి జనరేషన్ పాడదు. ఆ కళారూపం అంతరించి పోతుంది. శాస్త్రీయ సంగీతమైతే... నొటేషన్స్ చూసుకుని పాడతారు. మరి ఇలాంటి జానపదాలను ఎలా పాడతారు? పల్లెల్లో జానపదాలు



స్వతంత్రంగా బతకగలగాలి...

"ఎంతసేపు మహిళలు ఎవరో ఒకరి సంరక్షణలో బతుకుతున్నారు. కానీ స్వతంత్రంగా బతికే రోజులు లేవు. వాళ్లకు స్వేచ్ఛ రావాలి. అప్పుడే ఏదైనా సాధ్యమవుతుంది. మహిళలు మగవాళ్లకు ఎక్కడా తీసిపోలేదు. అంకితభావంతో పనిచేస్తారు. ఇంటి బాధ్యతలు, బయట పనులు. నిత్యం పరుగులు. ఎన్ని చేసినా... చిన్నచూపే. చులకనే. ఎవరో ఒకరి చాటున బతకాల్సి వస్తుంది. అలా కాకుండా మహిళలు స్వతంత్రంగా బతకగలగాలి. అలాగే కుటుంబంలో అమ్మకు, చెల్లెకు, బయట ఆడవాళ్లకు విలువ ఎట్లా ఇవ్వాలని అబ్బాయికి నేర్పించాలి"

అంతకుమించిన ప్రశంస లేదు...

"ఓసారి గజల్ పాడుతుంటే సినీ దర్శకుడు వేణుగారు విన్నారు. తరువాత తన సినిమా 'నీదినాది ఒకే కథ' కోసం ప్రత్యేకంగా ఎంబిడి శ్యామలగారితో గజల్ రాయించి మరీ పాడించారు. అదే

'హృదయమెంత తపిస్తే... బతుకు విలువ తెలిసింది.
గుండెనెంత మథిస్తే... కన్నీటి విలువ తెలిసింది.
//// //// ////
చీకటసలే లేకుంటే... వెన్నెలకేం విలువుంది.
నిన్న ముగిసిపోయాక... నేటి విలువ తెలిసింది'

ఈ గజల్ సినిమా చివరలో ఉన్నా... స్టాండింగ్ ఒవేషన్ అందుకుంటున్న పాట. ఫ్రెండ్స్, చూసిన ప్రతి ఒక్కరు... మామూలుగా సినిమా అయిపోయాక పేర్లు పడుతుంటే... అందరూ వెళ్లిపోతారు. కానీ ఈ గజల్ ప్లే అవుతుంటే ఏ ఒక్కరు హాల్ నుంచి బయటికి వెళ్లడం లేదు. సినిమా అయిపోయాక పాట వెంటాడుతున్నదని చెబుతున్నారు. ఒక గాయనిగా అంతకు మించిన ప్రశంస ఏముంటుంది? అంతకు మించిన ఆనందం ఏముంది?"

ఆసువుగా పాడుతుంటారు. అందులో ఒక శృతి-లయ ఉంటుంది. రాగం ఉంటుంది. ఆ రాగం ఏంటిది? వాటికి నొటేషన్ ఇస్తే... భవిష్యత్ తరాలు వాటిని బతికించుకుంటాయి కదా అనిపించిందామెకు. ఎంఫిల్‌కి అదే అంశాన్ని తీసుకుంది. అదే సబ్జెక్ట్‌పై పీహెచ్‌డీ కూడా చేసింది. జానపదాలకు నొటేషన్స్ సృష్టించింది.

సినారె గజల్స్‌తో...

పీహెచ్‌డీ వర్క్‌లో ఉన్నప్పుడే... అవి డీటీపి చేసిన ప్రసాద్ అనే వ్యకి, వాటి ప్రూఫ్స్ పట్టుకుని వస్తూ... సినారె గజల్స్ పుస్తకం ఒకటి తెచ్చారు.'మా ఇంట్లో నిరుపయోగంగా ఉంది... మీకు ఉపయోగపడుతుందేమో చూడండి' అని ఇచ్చారు. పీహెచ్‌డీ పనిలో ఉండి... పక్కకు పెట్టింది. అది అయిపోగానే... తీసి చదివింది. అద్భుతమైన సాహిత్యం. ఒకప్పుడు నడిరాత్రిదాకా ముషాయిరాల్లో, గజల్స్ గానామృతంలో మునిగి తేలిన నగరం మనది. కానీ తెలుగుకి వచ్చేసరికి గాయకులే కరువయ్యారు. సినారె గజల్స్‌లో ఉన్న ఆత్మీయత, అనుబంధాలు ఆమెను తట్టి లేపాయి. అప్పటిదాకా గజల్స్ అప్పుడప్పుడు పాడుతూ ఉన్నా... పూర్తిస్థాయిలో సినారె గజల్స్ మీద ఓ కచేరి చేయాలనుకున్నదామె. వెంటనే ఆ సాహిత్యానికి సంగీతాన్ని సమకూర్చింది. 'మీ గజల్స్ పాడదామనుకుంటున్నా' అని అనుమతికోసం ఆయన దగ్గరకు వెళ్లింది. అప్పటికే అనారోగ్యంతో వీల్ చెయిర్‌లో ఉన్నారు. 'నేను రాలేను. కానీ నా



ఆశీర్వాదం ఉంటుంది. వెళ్లి పాడు' అన్నారాయన. ఆమె మనసంగీకరించలేదు. అందుకే వేదిక మీద పాడాలనుకుంటున్న ఒక్కో గజల్‌ను ఆయనకు పాడి వినిపించింది. ఆ తరువాత మొదటి 2017 మార్చి 16న రవీంద్రభారతిలో గజల్ కచేరి నిర్వహించింది. ఆమె పాడుతోంది. కార్యక్రమం ఆసాంతం హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది. మొదటి గజల్ కచేరి... వందల కార్యక్రమాలు చేసిన పరిణితి ఉందని ప్రశంసించారు ఆహుతులు. అది మొదలు... ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూనే ఉన్నారు.

ఆయన సాహిత్యం... ఆమె సంగీతం...

స్వరూప భర్త... వెంకట్‌రెడ్డి. సనత్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్. పెండ్లి చూపులకు వచ్చినప్పుడే... వాళ్లన్నతో 'నాకు సంగీతం అంటే ఇష్టం. ఎన్ని ఉన్నా... నాకు సంగీతం ఆనందం ఇస్తుంది. పెండ్లి తరువాత సంగీతం కొనసాగించనిస్తేనే పెండ్లి చేసుకుంటా' అని నిబంధన పెట్టింది. అందుకు ఆయన అంగీకరించారు. ఆ మాటకి ఇప్పటికీ కట్టుబడి ఉన్నారు. పెండ్లి తరువాతే ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిందామె. గజల్స్‌ను పూర్తి స్థాయి తీసుకోవడానికి కారణం కూడా ఆయనే. ఓసారి ఫ్యామిలీ గెట్ టు గెదర్‌లో గజల్ పాడిందామె. అది విన్న ఆయన... 'సంగీతం అందరూ పాడతారు. కానీ గజల్స్ కొందరే పాడగలుగుతారు. నువ్వు పాడగలుగుతున్నావు. దీన్నే కొనసాగించు' అన్నారు. ప్రోత్సహించారు. ఆమె ప్రతి గజల్‌కి మొదటి శ్రోత ఆయనే. ఆయనకు సంగీతం తెలియకపోయినా.. సాహిత్యంపై అవగాహన ఉంది. అందుకే ఆయన సాహిత్యం గురించి... ఆమె సంగీతం గురించి మాట్లాడతారు.

సంస్కృతి పరిరక్షణకోసం...

కొన్నాళ్లపాటు వివిధ స్కూళ్లలో సంగీతం ఉపాధ్యాయురాలిగా పనిచేసిన ఆమె... 'శృతి-లయ మ్యూజిక్ అకాడమీ' పెట్టింది. ఆమె దగ్గర నేర్చుకున్న పిల్లలు బోల్ బేబీ బోల్ , పాడతా తీయగా... ఇలా టీవీ షోస్‌లో పాడుతున్నారు. ఏదైనా కార్యక్రమాలకు వెళ్లినప్పుడు వెళ్లినప్పుడు గజల్స్‌తోపాటు 'సినిమా పాటలు పాడతారా' అని అడుగుతూ ఉంటారు. 'నేను పాడను... సినిమా పాటలు పాడటానికి చాలా మంది ఉన్నారు. నేను గజల్స్ మాత్రమే పాడాలనుకుంటున్నా' అని ముక్కుసూటిగా చెప్పేస్తారు. అలా అని ఊరుకోరు. 'మనకు చాలా కళారూపాలున్నాయి. సంగీతంలో చాలా జానర్స్ ఉన్నాయి. బుర్రకథలు, ఒగ్గుకథలు, బుడగజంగాలు, మందహెచ్చులు... ఇలా ఎన్నో కళారూపాలున్నాయి. వాటిని పిల్లలకు తెలియనివ్వాలి. అలా జరగాలంటే... సినిమా పాటల ప్రోగ్రామ్స్ పెట్టినప్పుడు ఓ పావు వంతు ఈ కళారూపాలకు కేటాయించండి. మన సంస్కృతి పిల్లలకు చెప్పినవారవుతారు' అంటుందామె.

కట్ట కవిత

కుంగుబాటుకు కారణాలు...

ప్రస్తుతం చాలామందిని వేధిస్తున్న సమస్య కుంగుబాటు. ఇది జీవితాన్ని అతలాకుతలం చేస్తుంది. కేవలం బాధితులనే కాదు కుటుంబ సభ్యులను, స్నేహితులను కూడా ఇబ్బందులకు గురి చేస్తుంది. ఈ సమస్య గురించి తెలుసుకోవాలనుకుంటే దానికి గల కారణాలేంటో కూడా తెలిసుండాలి.

- మానసిక సమస్యలను ప్రశ్నించడం ద్వారా తెలుసుకోవచ్చు. మిమ్మల్ని మీరే ప్రశ్నించుకోవడం ద్వారా కుంగుబాటుకు కారణం తెలుస్తుంది. దానికి గల కారణం తెలిస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కుంగుబాటు, డిప్రెషన్ ఉన్నప్పుడు మొట్టమొదట ఆలోచించాల్సింది ఆందోళన గురించి. ఆందోళనగా, భయంగా, దిక్కుతోచనట్టుగా అనిపిస్తే దీన్ని మానసిక సమస్యగా చెప్పుకోవచ్చు.
- అలాగే శరీర బరువును గమనించుకుంటూ ఉండాలి. బరువులో మార్పులు, నీరసం, అలసటగా అనిపిస్తే శరీరంలో హార్మోన్ల ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించాలి. అంటే హార్మోన్ల స్థాయిలో హెచ్చు, తగ్గులు కలగడం.
- చర్మం, కండ్లు పాలిపోయినట్టు కనిపిస్తే రక్తహీనతగా చెప్పుకోవచ్చు. ఈ విధమైన కుంగుబాటుతో కూడా చాలా మంది బాధపడుతుంటారు.
- కుంగుబాటుకు దీర్ఘకాలిక వ్యాధులు, ఇన్ఫెక్షన్లు, ఎలర్జీలు, ట్యాబ్‌లెట్స్ ప్రభావం కూడా కుంగుబాటు, డిప్రెషన్‌కు కారణం అవుతాయి.
- శారీరక, మానసికంగా ఒత్తిడికి గురైనప్పుడు నిరాశగా, ఒంటరిగా, విషాదంగా అనిపిస్తుంది. ఇది అందరిలో ఉండే ఒక సహజ లక్షణం. దీనికి పెద్దగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈ విధమైన కారణాలను దృష్టిలో ఉంచుకొని వైద్యులను సంప్రదించడం వారి సలహాలు తీసుకోవడం వల్ల కుంగుబాటు, డిప్రెషన్‌కు నుంచి కాపాడుకోవచ్చు.



ఆముదం నూనెతో...

సహజ సిద్ధమైన ఔషధ గుణాలను కలిగి ఉంటుంది ఆముదం నూనె. ఈ నూనె కురుల సంరక్షణకు ఎంతగానో సహాయపడతుంది, జుట్టు ఊడటాన్ని, చుండ్రు, చిట్లిపోవడం వంటి సమస్యలను దూరం చేయడంలో అద్భుతంగా పని చేస్తుంది. ఆముదం నూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, ఒమేగా -6,9 ఫ్యాటీ ఆమ్లలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి వెంట్రుకలను మృదువుగా, దృఢంగా, పొడవుగా పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇంకా వివిధ రకమైన ఇన్ఫెక్షన్లను, ఎలర్జీలను కూడా దూరం చేస్తుంది.

- కొబ్బరి నూనెలో ఆముదం నూనెను కలిపి వేడి చేసుకోవాలి. గోరు వెచ్చగా ఉన్నప్పుడే తలకు పట్టిస్తే మంచిది. ఇది మంచి కండీషనర్‌లా పని చేస్తుంది.
- ఆముదం నూనెలో మెంతుల పొడిని కలిపి వెంట్రుకలకు మాస్కల వేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని 20 నిమిషాలు పట్టించాలి. తర్వాత గోరు వెచ్చటి నీటితో తల స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల వెంట్రుకలు రాలిపోవడం తగ్గుతుంది.
- కురుల బలహీనంగా ఉంటే ఆముదం నూనెలో, ఊసిరి నూనెను కలిపి తలకు మసాజ్ చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేసుకున్న జుట్టు దృఢంగా, పొడవుగా పెరుగుతుంది.
- రెండు చెంచాల ఆముదం నూనెలో ఒక చెంచా ఊసిరి నూనె, మూడు లేదా నాలుగు చుక్కల నిమ్మరసం కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు నిండుగా రాసుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు 10-15 నిమిషాలు పట్టించాలి. తర్వాత షాంపూ పెట్టి తల స్నానం చేస్తే చుండ్రు సమస్య దూరం అవుతుంది.

సృజనకు పదును...

ఊహకు అందని చిత్రాలను గీయడం, అంతుపట్టని ఆవిష్కరణలు చేయడం కళాకారుల సొంతం.

ఇక తమ కళకు కాస్త సృజనాత్మకత తోడైతే చేసే ప్రతి పని ఎంతో అద్భుతంగా, అందంగా కనిపిస్తుంది. ఈ ఆధునిక ప్రపంచంలో నిత్యం మన చుట్టూ ఎన్నో వింతలు, విచిత్రాలను చూస్తూనే ఉన్నాం. అలాంటిది ప్రతిరోజు రొటీన్‌గా చూసే ఫ్రాక్స్‌ను కాస్త భిన్నంగా , డిఫరెంట్ స్టైల్స్‌లో చూస్తే మది పులకరించిపోతుంది. వాటి కోసం ప్రత్యేకంగా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. మిగిలిపోయిన పెన్సిల్ ముక్కలతో, విరిగిపోయిన చెంచాలతో, పాత పేపర్లతో, స్ట్రా లతో, కాలిపోయిన అగ్గిపుల్లలతో సైతం అందమైన ఫ్రాక్స్‌ను తయారు చేసుకోవాలంటే సృజనకు పదును పెడితే సరిపోతుంది.

ఇలాంటి అబ్బురపరిచే బొమ్మలను ఈ వేసవి సెలవుల్లో మీ పిల్లలకు పరిచయం చేయండి...













మతోన్మాద కుట్రలను భగ్నం చేయాలి

- పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాల ర్యాలీలు



కోల్‌కతా: ఆర్ఎస్ఎస్, బీజేపీ, సంఘ్‌పరివార్ శక్తుల మతోన్మాద కుట్రలను భగ్నం చేయాలని కోరుతూ బెంగాల్‌లో శనివారంనాడు వామపక్షాలు చేపట్టిన ర్యాలీల్లో లక్షలాది ప్రజలు పాల్గొన్నారు. ప్రతిఏటా శ్రీరామనవమికి ముందు ఆ రాష్ట్రంలో సంఘ్‌పరివార్‌తోపాటు అధికార టీఎంసీ, కాంగ్రెస్ వర్గాలు అల్లర్లు సృష్టించడం ద్వారా రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు ప్రయత్నిండం ఆనవాయితీగా వస్తోంది. దాంతో, ముందస్తు జాగ్రత్తగా ఈసారి ప్రజల్లో అప్రమత్తత పెంచేందుకు రాష్ట్రవ్యాపితంగా ర్యాలీలు నిర్వహించినట్టు వామపక్ష పార్టీల నేతలు తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఆ రాష్ట్రంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తారు. గతేడాది ఇదే సమయంలో సంఘ్‌పరివార్, టీఎంసీ వర్గాలు మత ఘర్షణలకు యత్నించగా స్వల్ప ఘటనలు జరిగాయి. శనివారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన ర్యాలీల్లో సీపీఐ(ఎం)సహా ఇతర వామపక్షాల కార్యకర్తలు పాల్గొన్నారు. రామ్‌పూర్హాత్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్‌బసు మాట్లాడుతూ..మత ఉద్రిక్తతలను నివారించడంలో అధికారులు విఫలమైన చోట సామరస్యత సాధనలో వామపక్ష కార్యకర్తలు చురుగ్గా వ్యవహరించాలని కోరారు.

కల్లుగీత కార్మికులకు అన్యాయం

- కొందరు టీఆర్ఎస్‌కు అమ్ముడు పోతున్నారు : జై గౌడ అధ్యక్షులు రాష్ట్ర రామారావుగౌడ్



నవతెలంగాణ - రాంనగర్

రాష్ట్రంలో కల్లు గీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, అత్యధిక జనాభా ఉన్న గౌడ సామాజిక తరగతికి రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న రీతిలో నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందని జై గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావుగౌడ్ విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణ అధ్యక్షతన 'గీతలు అడుగుతున్నదేమిటి-ప్రభుత్వం ఇస్తానంటున్నదేమిటి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక గీత వత్తిని నాశనం చేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. కొంత మంది గౌడ సంఘం నాయకులు టీఆర్ఎస్‌కు అమ్ముడుపోయి భజన చేస్తున్నారని ఆరోపించారు. దీంతో గౌడ సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఐలి వెంకన్నగౌడ్ జోక్యం చేసుకుంటూ టీఆర్ఎస్ ప్రభుత్వం గౌడ కులస్తులకు మేలు చేస్తున్నదని, మీరు గౌడ్లను కాంగ్రెస్‌లో కలపాలని చూస్తున్నారని ఎదురుదాడికి దిగారు. సమావేశ ఉద్దేశాన్ని పక్కదారి పట్టించొద్దని పలువురు సర్దిచెప్పడంతో ఇరువురూ శాంతించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మెన్ బాలరాజుగౌడ్, కన్వీనర్లు అంబాల నారాయణగౌడ్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు శారదగౌడ్, జనార్దన్‌గౌడ్, నరేష్‌గౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ అదృశ్యం ?

- నాలుగు రోజులుగా విధులకు దూరం
- గోప్యంగా ఉంచిన పోలీసులు
- నేరేడ్‌మెట్‌లో కలకలం రేపిన ఘటన
- ఎస్ఐ క్షేమంగానే ఉన్నాడు : సీఐ జగదీష్‌చందర్



నవతెలంగాణ - నేరేడ్‌మెట్

ఎస్ఐ అదృశ్యమయ్యాడు. నాలుగు రోజులుగా విధులకు హాజరు కాకపోవడం, కనిపించక పోవడంతో హైదరాబాద్ నేరేడ్ మెట్‌లో కలకలం రేపింది. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. ఎస్ఐ అదృశ్య మైన విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి జిల్లాకు చెందిన పుల్లం నాగరాజు 2016లో ఎస్ఐగా ఎంపికయ్యాడు. ప్రొహిబిషన్ పీరియడ్‌లో భాగంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సిబ్బంది కొరత కారణంగా పని ఒత్తిడి తీవ్రంగా ఉందని, తట్టుకోలేక పోతున్నానని నాగరాజు పలుమార్లు సహోద్యోగులతో చర్చించినట్టు తెలిసింది. ఇటీవల నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గీతానగర్‌లో ఓ ఇంటిని ఖాళీ చేయించే విషయంలో మహిళ సీపీకి ఫిర్యాదు చేసింది. పై అధికారులు వాస్తవాలు తెలుసుకోకుండా తనకు మెమో జారీ చేశారని నాగరాజు మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. ఈనెల 22న జవహర్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, సీఐలతో ఏసీపీ సమావేశం ఏర్పాటు చేశా రు. ఉదయం 10గంటలకు సమావేశానికి హాజరైన ఎస్ఐ ఒంట్లో బాగా లేదని చెప్పి సమావేశం మధ్యలోనే మరో ఎస్ఐ వెంకట్‌రెడ్డి ద్విచక్ర వాహ నం తీసుకొని ఉప్పల్‌లోని చిలుకానగర్‌లో ఉన్న ఇంటికెళ్లాడు. అప్పట నుంచి ఆయన కనిపించడం లేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోంది. కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. కానీ, వారు ఎక్కడా మి స్సింగ్‌కేసు పెట్టనట్టు తెలుస్తోంది. అనారోగ్యానికి గురైనా క్రమం తప్పకుం డా విధులకు వచ్చేవాడని సహోద్యోగులు తెలిపారు. అధికారుల వేధిం పులు పనిభారమే అదృశ్యానికి కారణమై ఉండొచ్చని పలువురు భావిస్తు న్నారు. ఈ విషయాన్ని నేరేడ్‌మెట్ పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. ఎస్ఐ నాగరాజు ఆయన మామ ఫోన్‌లో టచ్‌లో ఉన్నాడు. ఆయన క్షేమంగా ఉన్నాడు. నాగరాజుకు ట్రాన్స్‌ఫర్ కావడంతో అక్కడికెళ్లేందుకు ఇష్టం లేక మనస్తాపానికి గురైనట్టు తెలుస్తోంది. త్వరలోనే వివరాలు వెల్లడిస్తాం.

జేసీటీయూ ఆవిర్భావం

- 54 ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు
- 2నుంచి ప్రారంభమయ్యే స్పాట్ బహిష్కరణకు పిలుపు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో మూడు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదికల పరిధిలో ఉన్న 54 సంఘాలన్నీ ఒకే వేదికపై వచ్చాయి. జాయింట్ కౌన్సిల్ ఆఫ్ టీచర్స్ యూనియన్(జేసీటీయూ) పేరుతో పోరాటాలు చేసేందుకు ఆయా సంఘాలు నిర్ణయించుకున్నాయి. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఏప్రిల్ 2నుంచి జరిగే పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకణ(స్పాట్)ను బహిష్కరించాలని తీర్మానించాయి. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీటీజేఏసీ, యూఎస్‌పీసీ, జాక్టో సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు సరోత్తంరెడ్డి, చావ రవి, భుజంగరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు న్యాయపరమైన ఆటంకాలు తొలగించి, వేసవిలోనే ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలనీ, నూతన పీఆర్‌సీ జూలై 1నుంచి అమలు చేయాలనీ, పండిత్, పీఈటీల పదోన్నతులు చేపట్టాలని తీర్మానించారు. వేసవిలో మధ్యాహ్నభోజన నిర్వహణ సందర్భంగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయాలనీ, ఎస్ఎస్‌సీ పరీక్షల విధుల మూల్యాంకణ రేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 27న ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చి, 28,29 తేదీల్లో అన్ని జిల్లాల్లో సన్నాహక సదస్సులు నిర్వహించాలని జేసీటీయూ నిర్ణయించింది. ఈ సమావేశంలో జేసీటీయూ సభ్యసంఘాల ప్రతినిధులు కొండల్‌రెడ్డి, ఈ రఘునందన్, రఘుశంకర్‌రెడ్డి, పోచయ్య, ఎల్ లక్ష్మారెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నయ్య, జాడి రాజన్న, బిక్షపతి, విజయసాగర్, ఎస్ లక్ష్మారెడ్డి, వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.


రిపోర్ట్ అంతా వన్‌సైడే..!

- 'సాట్స్'ను కాపాడేందుకు వన్‌మెన్ కమిటీ తాపత్రయం
- జీవోలు 11, 8లను పట్టించుకోని వైనం
- బాధితుల వినతులు బుట్టదాఖలు
- స్పోర్ట్స్‌కోటా అక్రమాలపై కమిటీ నివేదిక తీరిది...

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

స్పోర్ట్స్‌కోటాలో మెడికల్ సీట్ల కేటాయింపు అక్రమాలపై ప్రభుత్వం నియమించిన 'వన్‌'మెన్ కమిటీ..రిపోర్టు అంతా వన్‌సైడ్‌గానే ఇచ్చేసింది. రిపోర్టులో ఎక్కడా కూడా జీవోనెంబర్ 8 ప్రస్తావనే చేయలేదు..సరికదా, జీవో11నూ పూర్తిస్థాయిలో పరిగణలోకి తీసుకోలేదు. అక్రమాలపై నివేదిక ఇవ్వాలని సర్కారు కోరితే...ఈ కమిటీకి సంబంధం లేని సీట్ల కేటాయింపు విషయాలనూ నివేదికలో పేర్కొన్నది. ఇటీవలే కమిటీ తన నివేదికను సర్కారుకు అందించినట్టు తెలిసింది. అసలు నివేదికలో ఎక్కడా కూడా తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారుల తీరును తప్పుపట్టకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2017-18 విద్యాసంవత్సరానికిగానూ స్పోర్ట్స్ కోటాలో అక్రమాల తీరుపై 'నవతెలంగాణ' వరుస కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో సాట్స్ ద్విసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ రిపోర్టు కూడా సరిగా లేదనీ, దాంట్లోని లోపాలను నవతెలంగాణ ఎత్తిచూపడంతో స్పందించిన సర్కారు...రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రఫత్‌అలీతో ఫిబ్రవరి 14న ఏకసభ్య కమిటీని నియమించింది. ఆయనకు సహాయకుడిగా హకీంపేట స్పోర్ట్స్‌స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ కె నర్సయ్యను ఏర్పాటు చేసింది. అక్రమాలపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించింది. సాట్స్ కార్యాలయంలో రెండు రోజుల పాటు ఐదుగురి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



జీవో 8 ప్రస్తావనేదీ..?

మెడికల్, ఇంజినీరింగ్‌తో పాటు వృత్తివిద్యాకోర్సుల్లో స్పోర్ట్స్‌కోటాలో సీట్ల కేటాయింపునకు సంబంధించిన జీవో నెంబర్ 8 ప్రధానమైనది. ఆ జీవో ప్రకారమే కమిటీ ఏర్పడి.. సీట్లను కేటాయించాల్సి ఉంది. కానీ జీవోను సాట్స్ అధికారులు పక్కనపెట్టి, పలు ఆరోపణల్లో విచారణ ఎదుర్కొంటున్న సాట్స్ డిప్యూటీ డైరెక్టర్లు, కోచ్‌లతో కూడిన కమిటీ వేసి మెడికల్ సీట్లను ఎంపిక చేశారు. అయితే ఈ కమిటీ తన నివేదిక కనీసం సాట్స్ ఎండీతో అప్రూవల్ లేకుండానే కాళోజీ నారాయణ యూనివర్సిటీకి పంపించారు. ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో మెడికల్ సీట్ల ప్రెయార్టీలిస్టును ఆమోదం తెలుపలేదని సమాచార హక్కుచట్టం ద్వారా బాధిత విద్యార్థి భరత్ అడిగిన ప్రశ్నకు సర్కారు సమాధానమిచ్చింది. అయితే ఈ విషయాన్ని వన్‌మెన్ కమిటీ ఎక్కడా ప్రస్తావించలేదు. జీవోనెంబర్ 8 ప్రకారం కమిటీ ఏర్పాటు చేయలేదనే విషయాన్ని ఎందుకు నివేదికలో ప్రస్తావించలేదనేది బాధితుల ప్రశ్నలకు కమిటీ ఎలాంటి సమాధానమిస్తుంది మరి..?


అధికారుల తప్పు కనిపించలేదా..?

జీవో నెంబర్ 11 ప్రకారం సీట్లు కేటాయించాల్సి ఉందని కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. కానీ జీవో నెంబర్ 11 ప్రకారం జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు శాయ్ సర్టిపై చేయాల్సి ఉంది. దీన్ని బుట్టదాఖలు చేస్తూ 2008నుంచి 2016వరకూ శాయ్ సర్టిఫికేట్లను పరిశీలించలేదు. కానీ 2017లో మాత్రం జాతీయ క్రీడాకారులకు ప్రెయార్టీ ఇచ్చి, అంతర్జాతీయ క్రీడాకారులను మాత్రం పక్కన పెట్టారు. ఈవిషయాన్ని కమిటీ ప్రస్తావించలేదు. దీనికితోడు భరత్ అనే విద్యార్థి అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనడంపై అనుమానాలు వ్యక్తం చేసింది. అయితే అదే క్రీడాకారుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నట్టు, ఆయనకు ప్రోత్సాహకం అందించాలని కోరుతూ సాట్స్ ఎండీ ప్రభుత్వానికి రిఫర్ చేయగా..2016, ఫిబ్రవరి 17న ప్రభుత్వం రూ.3లక్షల సహాయాన్ని అందించింది. దీంట్లో ఏది తప్పనే విషయాన్ని కమిటీ కనీసం గుర్తించపోవడం గమనార్హం.

తప్పుడు ప్రయార్టీ ఇచ్చినా..


మరో క్రీడాకారిణి జాతీయస్థాయిలో ఆడిన ఆమెకు తప్పుడు ప్రెయార్టీని అధికారులు ఇచ్చారు. మెడల్ రాకున్నా వచ్చినట్టు అధికారులు ప్రయార్టీ నెంబర్ అందించారు. దీంతో ఆమెకు మెడికల్ సీటు లభించింది. దీన్ని పెద్దగా కమిటీ ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే ఈ విషయాన్ని పక్కనపెట్టడం అనుమానాలకు తావిస్తుంది. దీంట్లో తప్పు చూపించకుండా, సీట్ల ప్రస్తావనను కమిటీ నివేదికలో పేర్కొన్నది. కమిటీకి సీట్లతో సంబంధం లేకున్నా అధికారులను కాపాడేందుకు ఆ ప్రస్తావన తెచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో విద్యార్థి జాతీయ స్థాయిలో సీనియర్ విభాగంలో ఆడినా.. ఆమెకు జూనియర్ విభాగంలో ఆడినట్టు అధికారులు తప్పుగా సర్టిపై చేశారు. దీంతో ఆమె మెడికల్ సీటును కోల్పోయింది. దీంట్లోనూ ఆ క్రీడా అసోసియేషన్‌ను, సాట్స్‌లోని అడ్మినిస్ట్రేషన్‌ను తప్పుపట్టింది. కానీ ఈ పనిచేయాల్సింది..ఎంపిక కమిటీ అనే విషయాన్ని ఎక్కడా నివేదికలో పొందుపర్చలేదు. దీనికితోడు గతంలో ద్విసభ్య కమిటీలో తప్పుజరినట్టు స్పష్టంగా పేర్కొన్నా..ఈ నివేదికలో మాత్రం ఎక్కడా తప్పు అనే పదం కనిపించలేదు. దీంతో ఈ కమిటీ పూర్తిగా వన్‌సైడ్‌గానే రిపోర్టు ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి.

మీరే మోసం చేశారు!



లేఖలో అమిత్ షా

'ప్రత్యేకహోదాతో సమానమైన ఆర్థిక ప్రయోజనాలందించే ప్యాకేజిని మీరు సంతోషంగా అంగీకరించారు. ఇప్పుడు రాజకీయ కారణాలతో మీ వైఖరిని మార్చుకున్నారు. తప్పుడు సమాచారమిస్తూ ప్రజలను మోసగిస్తున్నారు'



అసెంబ్లీలో చంద్రబాబు

'రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పింది. అయినా ప్రజలు నమ్మలేదు. ఇప్పుడు మీరు అది కూడా ఇవ్వమంటున్నారు. కాంగ్రెస్ కన్నా మీరే ఎక్కువ మోసం, అన్యాయం చేశారన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని క్షమించరు.



మా పోరాటం ఆగదు : జగన్

హోదా ఇవ్వకుండా రాష్ట్రం బతకలేదు. యువతకు ఉపాధి లభించదు. ఎన్నికల్లో అదే హామీ ఇచ్చి ఇప్పుడు చర్చిస్తే ఎలా? హోదా ఇచ్చే వరకు మా పోరాటం ఆగదు.



తొమ్మిది పేజీల అసత్యాలు : సీపీఐ(ఎం)

ముఖ్యమంత్రికి అమిత్‌షా రాసిన తొమ్మిది పేజీల లేఖ అసత్యాలతో కూడుకుంది. కేంద్ర పథకాల్లో భాగంగానే ఇచ్చే నిధులనూ ప్రత్యేక సాయం కింద చూపడం బీజేపీ మోసకారితనానికి నిదర్శనం.



ఎందుకీ దాగుడు మూతలు : జనసేన

నిధులపై అమిత్‌షా పాత పాటే పాడారు. చంద్రబాబు కూడా ఎప్పటిలాగే బీజేపీ అన్యాయం చేసిందని ఘోషించారు. ఎందుకీ దాగుడు మూతలు.

యూట్యూబ్ మాయలెన్నో!

- యూట్యూబ్ వీడియోలను చూస్తున్న 80 శాతం ఇండియన్ ఇంటర్నెట్ యూజర్లు
- ఇండియన్స్ చూసే అధిక వీడియోలు మ్యూజిక్ స్ట్రీమ్‌కు సంబంధించినవే!
- యూట్యూబ్ వీడియోలన్నీ చూడాలంటే ఒక వ్యక్తికి పట్టే సమయం లక్ష సంవత్సరాలు
- వీడియోల మధ్య ఇబ్బడిముబ్బడిగా యాడ్స్ వేస్తోన్న గూగుల్.. అసహనం వ్యక్తం చేస్తోన్న వీక్షకులు

ఇంట్లో జరిగిన చిన్నోడి బర్త్ డే పార్టీ అయినా, దోస్త్ పెండ్లి దావత్ నాడు తీసిన వీడియో అయినా.. అమెరికా ప్రెసిడెంట్ ఇచ్చే కీలక ప్రసంగంమైనా.. ప్రపంచం మొత్తానికి క్షణాల వ్యవధిలో చేర్చే మాధ్యమంగా ప్రజలమన్ననలు పొందుతోన్న యూట్యూబ్ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాం తాజా గిమ్మిక్కులు, రికార్డులు అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తుతున్నాయి. ఆ నేపథ్యంపై 'నవతెలంగాణ' స్పెషల్ ఫోకస్..

కడవేర్గు

మానవ చరిత్రలో మునుపెన్నడూ చూడని విధంగా, సరికొత్త ఇంటర్నెట్ విప్లవానికి నాంది పలుకుతూ.. నేటి తరానికి దొరికిన అత్యుత్తమ విస్తృత స్థాయి వీడియోసహిత సమాచార వేదికగా నిలుస్తోన్న సామాజిక మాధ్యమం 'యూట్యూబ్' గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ప్రపంచంలోనే ఎక్కువ వీడియోలను కలిగి ఉన్న ఈ ప్రముఖ వీడియో షేరింగ్ ప్లాట్‌ఫాంను మన దేశంలో 80శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు వినియోగిస్తున్నట్టు తాజాగా తేలడం విశేషం.

మొబైల్ నుంచే 22.5కోట్ల మంది:

2005లో యూట్యూబ్ యాక్టివేట్ అయినప్పటికీ, మన దేశంలో 07, మే 2008 నాటి నుంచి అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే! యూట్యూబ్‌ను భారతదేశంలోకి తీసుకొచ్చి 10 ఏండ్లు అవుతున్న సందర్భంగా 'బ్రాండ్‌కాస్ట్ 2018' పేరుతో గూగుల్ ఇండియా సంస్థ ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇండియాలో సుమారు 80శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు యూట్యూబ్‌ను వినియోగిస్తున్నట్టు, యూట్యూబ్‌కు ప్రస్తుతం 22.5కోట్ల మంది మొబైల్ ఫోన్ నెలవారీ యాక్టివ్ యూజర్లున్నట్టు తెలిపారు. కాగా, భారత్ నుండి యూట్యూబ్ మొబైల్ ఫోన్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 2020 నాటికి 5కోట్లకు చేరే అవకాశమున్నదని ఫిక్కీ తాజాగా పేర్కొనడం గమనార్హం. ఐతే, తక్కువ ధరల్లో లభిస్తోన్న స్మార్ట్ ఫోన్లు, అందుబాటు ధరల్లో వివిధ టెలికాం సంస్థలు ప్రకటిస్తోన్న డేటా ఆఫర్ల మూలంగా దేశంలో యూట్యూబ్ వాడకం మరింత ఎక్కువైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



పే సబ్ స్క్రైబర్స్ కోసమేనా?:

ఇండియాలో అనూహ్యంగా దూసుకుపోతున్న యూట్యూబ్ యూజర్ బేస్ ను క్యాష్ చేసుకోవాలన్న ఆలోచనలు గూగుల్ సంస్థకు ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ, ఈ మధ్య కాలంలోనే ఆయా ఆలోచనలను కార్యరూపంలోకి తెచ్చినట్టు తెలుస్తోంది. ఇండియాలో ఎక్కువ మంది యూజర్లు మ్యూజిక్ స్ట్రీమ్ కు సంబంధించిన వీడియోలను యూట్యూబ్ వేదికగా చూస్తుండటాన్ని గమనించిన గూగుల్.. యూజర్స్ వీడియోలను చూసే వ్యవధిలో నిబంధనలకు విరుద్ధంగా అత్యధికంగా యాడ్స్ వేస్తూ వీడియో అనుభవాన్ని వీక్షకులకు దూరం చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. పే సబ్ స్క్రైబర్స్ ను ఆన్ బోర్డ్ చేసుకునే పథకంలో భాగంగానే యూట్యూబ్ ఇలా వీడియోల మధ్య ఎక్కువ యాడ్స్ వేస్తున్నదని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

లక్ష సంవత్సరాలు పడుతుంది:

ఆన్ లైన్ చెల్లింపు సంస్థ పేపాల్ లో పనిచేసే చాడ్ హర్లీ, స్టీవ్ చెన్, జావేద్ కరీం అనే ముగ్గురు వ్యక్తులచే కాలిఫోర్నియా కేంద్రంగా ఫిబ్రవరి 14, 2005లో యూట్యూబ్ ప్రారంభించబడినా.. ఏప్రిల్ 23, 2005 తర్వాతే ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ప్రారంభించిన అనతి కాలంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సైట్ లో 2005 నవంబరులో వెంచర్ క్యాపిటల్ సంస్థ సీక్వోయా కాపిటల్ రూ. 22.75కోట్లను పెట్టుబడులుగా పెట్టింది. తర్వాత, 2006 నవంబర్ లో గూగుల్ సంస్థ రూ.10,727కోట్లతో యూట్యూబ్‌ను సొంతం చేసుకున్నది. తాజా నివేదికల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం యూట్యూబ్ కు సుమారు 130కోట్ల మంది యూజర్లు ఉండగా, ఒక రోజులో ఈ సైట్ ను సుమారు 30కోట్లకు పైగా ప్రజలు సందర్శిస్తున్నట్టు అంచనా. కాగా, ప్రస్తుతం యూట్యూబ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఒక్క నిమిషానికి 400 గంటల నిడివి గల వీడియోలు అప్‌లోడ్ అవుతున్నాయని.. యూట్యూబ్‌లో ఉన్న వీడియోలన్నింటినీ ఏకధాటిగా చూస్తూ వెళితే ఒక వ్యక్తికి అక్షరాలా 1 లక్ష సంవత్సరాలు పట్టొచ్చని యూట్యూబ్ ప్రతినిధులు చెబుతున్నారు.

అంకెల్లో యూట్యూబ్ విశేషాలు

500కోట్లు - యూజర్లు ఒక రోజులో చూసే వీడియోలు
30కోట్లు - ప్రతీరోజు యూట్యూబ్ ను విజిట్ చేసే యూజర్లు
130కోట్లు - ప్రస్తుతం, యూట్యూబ్ లో ఉన్న యూజర్లు
10,113 - యూట్యూబ్ లో వంద కోట్ల వ్యూస్ ను రీచ్ అయిన వీడియోలు
80 - అమెరికా మినహా యూట్యూబ్ వీడియోలను చూస్తోన్న వివిధ దేశాల వీక్షకుల శాతం
38 - యూట్యూబ్ వీడియోలను చూసే మగువలు
76 - యూట్యూబ్ నావిగేషన్‌లో ఉన్న భాషలు

యూజర్ వయస్సు	శాతం
18కన్నాతక్కువ	13
18-24	11
25-34	23
35-44	26
45-54	16
55-64	8
65 ఆ పైన	3

గతేడాది 1300కుపైగా సోషల్ సైట్ల మూసివేత

- 2016లో 964 సైట్ల మూసివేత
- జాబితాలో ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఖాతాలు



న్యూఢిల్లీ: అభ్యంతరకర కథనాలు,వీడియోలు, ఫోటోలను పోస్ట్ చేసిన సోషల్ మీడియా సైట్లు మూసివేతకు గురి కావడం ఏటేటా పెరుగుతోంది. గతేడాది (2017) నవంబర్ వరకూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 1329 యూఆర్ఎల్ లేదా వెబ్ అడ్రస్‌లు మూసివేతకు గురయ్యాయి. ఇది అంతకుముందు ఏడాది(2016)లో మూసివేతకు గురైన 964 సైట్లతో పోలిస్తే 38 శాతం అధికం. 2015లో 587 సైట్లను మూసివేశారు. మూసివేతకు గురైనవాటిలో ట్విట్టర్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌కు సంబంధించినవి ఉన్నాయి. అభ్యంతరకర విషయాలున్న సైట్లను గుర్తించి మూసివేతకు సిఫారసు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, మూసివేతకు గురైనవాటిలో కమిటీ సిఫారసు చేసినవాటితోపాటు ఉన్నత న్యాయస్థానాలు ఆదేశించినవి కూడా ఉన్నాయి. న్యాయస్థానాల ఆదేశాలతో మూసివేతకు గురైనవి 2016లో 100 సైట్లు, 2017లో 83 సైట్లు ఉన్నట్టు సమాచార, సాంకేతికశాఖ తెలిపింది. తొలగించినవాటిలో సామాజిక ఉద్రిక్తతలకు కారణమయ్యే పుకార్లు, అసభ్యతకు సంబంధించినవి ఉన్నట్టు అధికారులు తెలిపారు. సైబర్ నేరాలకు ఉద్దేశించిన సైట్లను కూడా మూసివేసినట్టు వారు తెలిపారు. సమాచార, సాంకేతికత సవరణ చట్టం ప్రకారం అభ్యంతరకరమైన సైట్లను మూసివేసేందుకు ప్రభుత్వానికి హక్కు ఉన్నదని సైబర్ చట్టాల నిపుణుడు పవన్‌దుగ్గల్ తెలిపారు. అయితే, ప్రస్తుతమున్న నెట్‌వర్క్ విస్తృతిలో సమాచారాన్ని లేదా కథనాలను బ్లాక్ చేయడం అసాధ్యమని ఆయన అన్నారు. బ్లాక్ చేస్తున్నవాటిలో రాజకీయ కారణాలతో కూడినవి కూడా ఉన్నాయని ఆయన అన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం అనేవి ఎంతో విశాలమైన అంశాలని, బ్లాక్ చేయడానికి చూపే కారణాలు పారదర్శకంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం అనుసరిస్తున్న ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆయన స్పష్టం చేశారు. 2017లో మూసివేతకు గురైనవాటిలో ఫేస్‌బుక్ నుంచి 530, యూట్యూబ్ నుంచి 123, ట్విట్టర్ నుంచి 598 ఉన్నాయి.

లోడింగ్, అన్‌లోడింగ్ వర్కర్లకు నేరుగా వేతనాలు ఇప్పించండి

ముఖ్యమంత్రికి సున్నం రాజయ్య లేఖ


నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ స్టోర్లలో 214 మంది లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు సుమారు 20 నుంచి 30 ఏండ్ల నుంచి పని చేస్తున్నారని, వారికి విద్యుత్ శాఖ నుంచి నేరుగా వేతనాలు ఇప్పించాలని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య పేర్కొన్నారు. దీంతోపాటు వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు ఆయన లేఖ రాశారు. కొన్ని స్టోర్లలో కాంట్రాక్టు పద్ధతి, మరికొన్ని స్టోర్లలో పీస్ వర్క్ కింద పేమెంట్ చేస్తున్నారన్నారు.

బరువులు మోసి, ప్రమాదాలకు గురైనా డిపార్డుమెంటుకు వారి సేవలు అందిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. అనేక విజ్ఞప్తుల మేరకు తమరు సానుకూలంగా స్పందించి గుర్తింపు కార్డులు ఇప్పించారని తెలిపారు. అయితే వారికి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యానికి నోచుకోలేకపోతున్నారని చెప్పారు ప్రమాదాలకు గురైనప్పుడు వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమరు దయతో స్పందించి కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, నేరుగా వేతనాలు ఇచ్చేలా విద్యుత్ శాఖకు ఆదేశాలు ఇవ్వాలని రాజయ్య విజ్ఞప్తి చేశారు.

లీక్ కాదు.. మాల్‌ప్రాక్టీసే!

- పకడ్బందీగా టెన్త్ పరీక్షల నిర్వహణ
- ఇప్పటికీ 29 మందిపై క్రిమినల్ కేసులు : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్ వెల్లడి



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలో జరుగుతున్న పదోతరగతి పరీక్షల్లో ఎక్కడా ప్రశ్నాపత్రం లీక్ కాలేదనీ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. పలు జిల్లాల్లో మాల్‌ప్రాక్టిస్ కేసులు మాత్రమే నమోదయ్యాయనీ చెప్పారు. పరీక్ష ప్రారంభమయ్యాకా, కొంతమంది నిర్లక్ష్యంతో పేపర్ బయటికొస్తే...అది మాల్ ప్రాక్టిస్‌గానే పరిగణించాలని కోరారు. శనివారం పాఠశాల విద్య డైరెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన 9రోజుల్లో 25మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టిస్ కేసులు, ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసినందుకు గానూ మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు కిషన్ తెలిపారు. ఇప్పటివరకు 29మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని చెప్పారు. వీరిలో విధుల్లో ఉన్న వారు 18మంది, విధుల్లో లేని టీచర్లు మరో 11మంది కాగా, బయటివ్యక్తులు ఐదుగురు ఉన్నారని తెలిపారు. ఆరుగురు చీఫ్ సూపరింటెం డెంట్‌లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌ను విధుల నుంచి తొలగించినట్టు చెప్పారు. వీరితో పాటు ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్ మరియు పరీక్షలతో సం బంధమున్న నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేసిన ట్టు తెలిపారు. నిర్మల్, జగిత్యాల, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రశ్నాపత్రం బయటకు రావడంపై సీరియస్‌గా తీసుకున్నామనీ, పూర్తి స్థాయి విచారణ తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ఈ ఘటనలతో సంబంధమున్న ప్రయివేటు పాఠశాలలకు ఇప్పటికే షోకజ్ నోటీసులు జారీ చేశామన్నారు. పదోతరగతి పరీక్షలు జరిగిన తీరుపై సమగ్ర నివేదికను హైకోర్టుకు అందజేస్తామని చెప్పారు. విద్యాశాఖలో అక్రమ ఈటీఆర్‌లు, హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల అక్ర మాలపై సమగ్ర విచారణ జరుపుతున్నామనీ, టెన్త్ పరీక్షల తర్వాత చర్యలు తీసుకుంటామని తెలి పారు. డీఈఓ ఇచ్చిన ప్రాథమిక నివేదికలో అక్రమా లు జరిగినట్టు గుర్తించినట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్, అడిషనల్ డైరెక్టర్ విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



తుపాకీ సంస్కృతికీ వ్యతిరేకంగా...

వాషింగ్టన్ : తుపాకీ కాల్పుల ఘటనలపై అమెరికా ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు తుపాకీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో, నగరాల్లో ఈ వారంతం ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. వాషింగ్టన్‌లో శనివారం జరిగిన 'మార్చ్ ఫర్ అవర్ లైవ్స్' జరిగిన ర్యాలీకి సంబంధించిన ఫొటో ఇది.

ప్రాణాల్ని సైతం లెక్కచేయలేదు..

చాకచక్యంగా ఉగ్రదాదిని ఎదుర్కొన్న ఫ్రాన్స్ ఉన్నతాధికారి

- తీవ్ర గాయాలతో బయటపడ్డ లెఫ్టినెంట్ కల్నల్ ఆర్నాడ్ బెల్ట్రేమ్ మృతి
- ఆయన నిజమైన హీరో : ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్



ట్రెబెస్: నరరూప రాక్షసుడిగా మారి విచక్షణ లేకుండా కాల్పులకు తెగబడుతున్న ఉగ్రవాది హఠాత్తుగా ఎదురుపడితే ఏం చేస్తారు ? ఎలా తప్పించుకోవటమా ? అని ఆలోచిస్తాం. కానీ ఒక ఫ్రాన్స్ ఉన్నతాధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఆర్నాడ్ బెల్ట్రేమ్ అక్కడ బందీల గురించి ఆలోచించాడు. తన ప్రాణాల్ని సైతం లెక్కచేయకుండా, ధైర్యంగా వ్యవహరించి..ఉగ్రవాదితో మాట్లాడాడు. మాట్లాడటమేకాదు, ఉగ్రవాది చేతిలో నుంచి ఓ మహిళను విడిపించి, ఆమె స్థానంలో బందీగా మారాడు. ఓ వైపు ఇదంతా చేస్తూనే...తన మొబైల్ ఫోన్‌తో పోలీసులకు ఫోన్ చేసి...ఉగ్రవాది కంటపడకుండా ఫోన్ ద్వారా పోలీసులకు ఘటన వివరాలు అందజేశాడు.

ఎంతో మనోధైర్యం, చాకచక్యం ఉంటేనే ఇదంతా సాధ్యమవుతుంది. అంతా అనుకున్నట్టే ఆ ఫ్రాన్స్ ఉన్నతాధికారి చేశాడు. కానీ కొంతసేపయ్యాక ఉగ్రవాది తూటాలను ఎదుర్కోక తప్పలేదు. తీవ్రగాయాలపాలైన ఫ్రాన్స్ ఉన్నతాధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఆర్నాడ్ బెల్ట్రేమ్ శనివారం కన్నుమూశారు. ఆయన చూపిన అసాధారణ ధైర్యసాహసానికి అందరూ సెల్యూట్ చేస్తున్నారు. ప్రజలను కాపాడేందుకు తన ప్రాణాలనే పణంగా పెట్టాడు.. ఆయన నిజంగా హీరో అంటూ అభినందిస్తున్నారు.

ఆయుధాన్ని కిందపడేసి...

శుక్రవారం ఫ్రాన్స్‌లోని ఓ సూపర్‌మార్కెట్‌కి సాయుధుడు చొరబడి పోలీస్‌పై కాల్పులు జరిపి అక్కడి వారిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే. వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాది కాల్పులు జరిపే సమయంలో అక్కడే ఉన్న ఓ మహిళను బందీగా చేసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అక్కడ ఉన్న కల్నల్ బెల్ట్రేమ్ తన వద్ద ఉన్న ఆయుధాన్ని కిందపడేసి మహిళకు బదులుగా ఆయనే ఉగ్రవాదికి బందీగా వెళ్లాడు.

అంతేకాదు.. సూపర్‌మార్కెట్ లోపల ఏం జరుగుతుందనేది బయట ఉన్న పోలీసులకు తెలిసే విధంగా కల్నల్ తన ఫోన్‌ను ఆన్ చేసి ఘటనా స్థలంలో వదిలిపెట్టాడు. ఆయన ఫోన్ ద్వారానే పోలీసులు సూపర్‌మార్కెట్‌లో ఏం జరుగుతుందనేది తెలుసుకోగలిగారు. బందీగా వెళ్లిన బెల్ట్రేమ్‌పై ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో ఆయనకు తీవ్రంగా బుల్లెట్ గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ ఆయన ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు శనివారం ప్రకటించారు. దీంతో ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య నాలుగుకు చేరింది.

కల్నల్ బెల్ట్రేమ్ సాహసాన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మానుయేల్ మేక్రాన్, అంతర్గతశాఖ మంత్రి కొల్లాంబ్ కొనియాడారు. ఆయన దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఆయన ధైర్యసాహసాలను దేశం ఎన్నటికీ మరిచిపోదని పేర్కొన్నారు. కల్నల్ మృతికి మేక్రాన్ సంతాపం తెలియజేస్తూ నివాళులర్పించారు. శుక్రవారం టెబ్రెస్‌లోని ఓ సూపర్ మార్కెట్‌కి సాయుధుడు చొరబడి పోలీస్‌పై కాల్పులు జరిపి అక్కడి వారిని బందీలుగా చేసుకున్న విషయం తెలిసిందే.

ఖైదీలు ఎక్కువయ్యారని వదిలేశారు..

- జైళ్లన్నీ ఇరుకుగా మారాయని క్షమాభిక్ష: జింబాబ్వే అధ్యక్షుడు



హరారే : సత్ప్రవర్తన కారణంగా గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఖైదీలకు క్షమాభిక్ష పెట్టడం మన దగ్గర చూస్తుంటాం. కానీ జైళ్లన్నీ ఖైదీలతో నిండిపోయి ఇరుకుగా మారాయని 3 వేల మందికి క్షమాభిక్ష పెట్టిన సంఘటన మాత్రం జింబాబ్వేలో జరిగింది. జింబాబ్వే అధ్యక్షుడు ఎమర్సన్ మాంగాగ్వా జైళ్లన్నీ ఖైదీలతో కిటకిటలాడుతున్నాయని ఈ నిర్ణయం తీసుకున్నారు. జీవిత ఖైదును అనుభవిస్తున్న మహిళలను మినహాయించి మిగతా మహిళా ఖైదీలు, అంగవైకల్యంతో బాధపడుతున్న వారు, జువెనైల్ ఖైదీలు విడుదలైన వారిలో ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు, 60 సంవత్సరాలు పైబడిన ఖైదీలూ ఇందులో ఉన్నారు. రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు వీరికి క్షమాభిక్ష పెట్టారని జింబాబ్వే ప్రిజన్స్, కరెక్షనల్ సర్వీస్ ఓ ప్రకటనలో వెల్లడించింది. 'ఖైదీలు ఎక్కువవడంతో ఇరుకుగా మారిన జైళ్లను కొంతమేర ఖాళీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని అందులో తెలిపారు. 3వేల మందిని విడుదల చేయడంతో ఆ దేశంలో ఖైదీల సంఖ్య 17వేలకు చేరుకుంది. హత్య, దేశద్రోహం, అత్యాచారం, కార్‌జాకింగ్, దోపిడీ వంటి నేరాల కింద శిక్ష పడిన వారికి ఈ క్షమాభిక్ష లభించలేదు. గతంలో రాబర్ట్ ముగాబే ప్రభుత్వం కూడా ఈ విధంగా ఖైదీలను విడుదల చేసింది. ఖైదీలకు నిత్యం ఆహారం, దుస్తులు అందించడానికి ఆర్థిక లోటులో ఉన్న జింబాబ్వే ప్రభుత్వానికి కష్టతరంగా మారింది. సరైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఖైదీల ఆరోగ్యం ప్రమాదంలో పడింది. ఈ కారణాల వల్ల 2013లో 100 మంది ఖైదీలు మరణించారు.

సైన్యంలో ట్రాన్స్‌జెండర్లపై నిషేధం

- ఉత్తర్వులపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ దేశ సైన్యంలో ట్రాన్స్‌జెండర్లపై నిషేధం విధిస్తూ చేసిన తీర్మానంపై సంతకం చేశారు. అయితే, ఇతర సాయుధ బలగాల్లో వారిని ఉపయోగించుకునేందుకు కొంత విస్తృత భావనతో ఆలోచించాలని చెప్పారు. అమెరికా సైన్యంలో ఇప్పటి వరకు స్వలింగ సంపర్కులు సైతం తమ సేవలు అందించారు.

అయితే, వారితో పలుమార్లు సమస్యలు వస్తున్నాయని, వారిలో చాలామంది ఆత్మన్యూన తవంటి భావనలతో జీవితాలపై ఆసక్తి లేకుండా బతికేస్తు న్నారని, ఆ పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులు సైన్యంలో ఉపయోగించుకుంటే సమస్యలు వస్తాయని వారిని ముమ్మందు కొనసాగించకూడదని నిర్ణయించారు. 'జెండర్ డిస్ఫోరియా' అనే లక్షణం స్వలింగ సంపర్కుల్లో ఉంటుందని, వారికి వ్యక్తిగతంగా కొంత వైద్యం చేయించుకోవాల్సిన అవసరం ఉంటుందని, అలాగే, మందులు ఉపయోగించడం, అవసరం అయితే, శస్త్ర చికిత్సలు వెళ్లడం లాంటివి ఉంటాయని, వారితో మిలిటరీలో ప్రమాదం అని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు వైట్‌హౌస్ ప్రకటించింది. ఈ మేరకు రక్షణ మంత్రి జిమ్ మ్యాటిస్ ప్రకటన చేశారు. 'తాజాగా మా అధ్యక్షుడు సంతకం చేసిన కొత్త పాలసీ ద్వారా భౌతికంగా, మానసికంగా సమర్థులైనవారే సైన్యంలోకి రావాల్సి ఉంటుంది. ఈ నిర్ణయం ద్వారా ప్రపంచంలోనే మేటి అయిన సైన్యాన్ని ఏర్పాటుచేయాలని నిర్ణయించుకున్నాం' అని ఆయన తెలిపారు.

చిక్కుల్లో ఫేస్‌బుక్

- వీడుతున్న టాప్ కంపెనీలు, యూజర్లు

న్యూయార్క్: ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం విషయంలో ప్రముఖ సోషల్ మీడియా 'ఫేస్‌బుక్' తీవ్ర చిక్కుల్లో కూరుకుపోయింది. ఈ వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్న యూజర్లు ఫేస్‌బుక్ ఖాతాలను తొలగించాలని సోషల్‌మీడియాలో పిలుపునిస్తున్నారు. 'డిలీట్ ఫేస్‌బుక్' ఉద్యమం సామాజిక మాధ్యమంలో మొదలైంది. తమవైపు నుంచి పొరబాటు జరిగిందని సంస్థ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పినప్పటికీ.. ఈ ఉద్యమం ఆగట్లేదు. తాజాగా మొ జిల్లా, టెస్లా, స్పేస్‌ఎక్స్ లాంటి ప్రముఖ కంపెనీలు కూడా ఫేస్‌బుక్‌ను వీడుతున్నట్టు ప్రకటించటం సంచలనం రేపింది.



సియోల్‌లో భారీ శాంతి ర్యాలీ

సియోల్ : కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనాలని, ఇందుకు అమెరికా తగినవిధంగా సహకరించాలని డిమాండ్ చేస్తూ ద.కొరియా రాజధాని సియోల్‌లో ప్రజలంతా భారీ ర్యాలీ చేపట్టారు. ఉభయ కొరియా దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం ఇప్పుడిప్పుడే కాస్త చల్లబడుతోంది. చర్చల దిశగా రెండు దేశాల నాయకత్వం అడుగులు వేస్తోంది. ద.కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్, ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ మధ్య ఏప్రిల్‌లో భేటీ జరగనున్నదని ద.కొరియా అధికార వర్గాలు శనివారం మీడియాకు తెలియజేశాయి. దీనికంటే ముందు...ఇరు దేశాల ఉన్నతస్థాయి అధికారుల సమావేశం వారం రోజుల్లో జరగనున్నది. ఈ నేపథ్యంలో ఉభయ కొరియా దేశాల మధ్య శాంతి నెలకొనేలా చూడాలని సియోల్ నగర ప్రజలు డిమాండ్ చేస్తూ, ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయం ముందు ప్లకార్డులు, కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు.

పత్రికానగర్ పేదలకు

పక్కా ఇండ్లు మంజూరు చేయాలి : రేవంత్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



హైటెక్‌సిటీలోని పత్రికానగర్‌లో గుడిసెలు కాలిపోయి రోడ్డునపడ్డ పేదలకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే ఎ.రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారిని అక్కడి నుంచి వెళ్లగొడితే సహించేది లేదని హెచ్చరించారు. పేదలకు మద్ద తుగా ప్రజాందోళన సాగిస్తామన్నారు. సంబంధిత బాధితులు రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. వారికి ఓటర్ కార్డులు, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. పేదలు ఉంటున్న స్థలాలపై కన్నేసిన అధికార పార్టీ ఎమ్మెల్యే మనుషులు పత్రికానగర్ నుంచి ఖాళీచేయాలని ఒత్తిడిచేయడం సరికాదన్నారు. పేదలకు అన్యాయం చేసేందుకు ఎమ్మెల్యే అనుచరులు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరాశ్రయులకు న్యాయం చేయాలని శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు ఫోన్‌లో చెప్పినట్టు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమాల అణచివేత తగదు

శాసనసభలో సున్నం రాజయ్య

- కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తారా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందనీ, ప్రజలు, పార్టీలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లుతారని, అలాంటి ఉద్యమాలను అణచివేయడం ఎంతవరకు సమంజసమని సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. శనివారం శాసనసభలో హోం, కార్మిక, ఉపాధి, పరిశ్రమల శాఖలపై జరిగిన పద్దులపై చర్చల సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఉద్యమాలను ఎందుకు అణచితవేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ధర్నా చౌక్ లేకుండా చేయడం అన్యాయమన్నారు. ప్రజలు తమ నిరసనను తెలియజేసే హక్కును పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలి

జైళ్లలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. ఏండ్ల తరబడి జైళ్లలో ఉన్న ఖైదీలు మంచి జీవితాన్ని గడపాలనుకుంటున్నారని అలాంటి వారిని ప్రభుత్వం మానవతాదృక్పథంతో జైళ్ల నుంచి విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. అలాగే చెక్‌పోస్టులలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల పర్మినెంట్ సంగతేంటి!

వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తారా? లేదా? అని సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. రెగ్యులరైజ్ చేయడంలో ఉన్న సమస్యలను అధికమించి వారిని పర్మినెంట్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

చేపట్టినవి 27,318... పూర్తయినవి 16,606

- మిషన్ కాకతీయ ప్రగతి నివేదిక : ఇరిగేషన్ డిమాండ్‌పై అసెంబ్లీకి ప్రభుత్వ వివరణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

మిషన్ కాకతీయలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ నివేదికను ప్రభుత్వం శాసనసభకు సమర్పించింది. ఇరిగేషన్ డిమాండ్‌పై ఇచ్చిన ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో నాలుగు దశల మిషన్ పనుల్లో భాగంగా 27,318 చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టగా వీటిలో 16,606 పనులు పూర్తయ్యాయి. ఈ పథకంలో భాగంగా 20,000 కోట్ల తాత్కాలిక అంచనాలతో ప్రతి సంవత్సరం 20 శాతం చొప్పున ఐదు సంవత్సరాల్లో 46,531 చెరువులను పునరుద్ధ రించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. నాలుగు దశల్లో చెరువుల పునరుద్ధరణ కోసం రూ. 8,534 కోట్ల అంచనా వ్యయంతో పాలనా పరమైన అనుమతులు జారీ చేయగా వీటిలో రూ. 2,971.98 కోట్లు ఖర్చు పెట్టినట్టు ప్రభుత్వ నివేదిక స్పష్టం చేస్తున్నది. నాలుగు దశల పునరుద్ధరణ తర్వాత 20,78,199 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికి 11,40,711 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించినట్టు నివేదికలో తెలిపారు. ఫలితంగా 8.203 టీఎంసీల నిల్వ సామర్థ్యం పెరిగిందని నీటిపారుదల శాఖ పేర్కొన్నది. మూడవ పార్టీ ద్వారా మిషన్ కాకతీయ పారదర్శకత ప్రభావ మదింపు చేయటానికి నాబార్డు అనుబంధ సంస్థ నాబ్‌కాన్స్‌కి పనిని అప్పగించారు. చెరువుల పూడిక మట్టి వినియోగంతో 35 నుంచి 50 శాతం రసాయనిక ఎరువుల వినియోగం తగ్గిందని, భూగర్భ జలాలు పెరిగాయని, ఆయకట్టు అం తరం తగ్గిందని, సాగునీటి సమర్థత, పంట దిగుబడి పెరిగాయని నాబ్ కాన్స్ ప్రభావ మదింపు అంచనా వెల్లడించిందని ప్రభుత్వ నివేదికలో పేర్కొన్నారు.

ఏపీలో టీడీపీ సెల్ఫ్ గోల్

- మీడియాతో మంత్రి తలసాని చిట్‌చాట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ సెల్ఫ్‌గోల్ చేసుకుంటుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విమర్శించారు. శనివారం అసెంబ్లీలో మీడియాతో మంత్రి చిట్‌చాట్ చేశారు. రిజర్వేషన్ల కోసం టీఆర్‌ఎస్ ఎంపీలు చేస్తున్న పోరాటంలో న్యాయం ఉంది. ఈ విషయంలో టీఆర్‌ఎస్‌ను నిందించడం తగదన్నారు. అన్నాడీఎంకే కూడా ఆందోళన చేస్తుందన్నారు. ఆ పార్టీ ఎంపీలతో టీడీపీ అవిశ్వాసం మీద మాట్లాడిందా? అని ప్రశ్నించారు. లోక్‌సభలో బీజేపీకి 273 మంది ఎంపీల బలం ఉంది. అవిశ్వాస తీర్మానంతో వచ్చే ప్రయోజనమేమిటి? అని అడిగారు. ప్రత్యేక హోదా సాధించుకోవడానికి అనేక వేదికలు ఉన్నాయన్నారు. ఏపీ పార్టీలు అక్కడి ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాయి. అక్కడి ప్రజలను అమాయకులను చేసి ఆడుకుంటున్నాయి. తమ దిగజారుడు రాజకీయాలతో ప్రజలను పిచ్చివాళ్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఏపీలో ఉన్న మొత్తం 25 ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే ఏదైనా ఫలితం ఉంటుందేమో చూడాలి అని చెప్పారు. ప్రజలను గందరగోళ పరచడానికి ఏపీలోని పార్టీలు ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం చూసైనా, ఏపీ పార్టీలు పోరాడటం నేర్చుకుంటే మంచిదని సూచించారు. ఎన్డీఏ నుంచి వైదొలిగాక చంద్రబాబు అవిశ్వాసంపై అన్ని పార్టీలతో మాట్లాడారని మీడియాలో వార్తలు వచ్చాయి. చంద్రబాబు తానెవరితోనూ మాట్లాడలేదని ఆ తర్వాత వివరణ ఇచ్చారు. దీంతోనే అక్కడి రాజకీయాలు ఎలా ఉన్నాయో అర్థమవుతున్నదని అన్నారు. నాలుగేండ్లుగా చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచకుండా ఏం చేశారంటూ ప్రశ్నించారు. ఏపీ పార్టీలకు ప్రణాళిక లోపించిందన్న మంత్రి తలసాని, ఎంపీల రాజీనామాలతోనే ఆ రాష్ట్రం దేశ ద ష్టిని ఆకర్షించగలదని అభిప్రాయపడ్డారు.

ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్ కొనుగోలు : జగదీశ్‌రెడ్డి

ఎన్టీపీసీ కరెంట్‌కు ఎక్కువ చెల్లింపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్




రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పారు. శనివారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా విద్యుత్ అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఓపెన్ టెండర్ల ద్వారానే విద్యుత్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీపీసీ ద్వారా విద్యుత్ కొనుగోలుకు ధర ఎక్కువ చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్టీపీసీ వెల్లూరు నుంచి కొనుగోలు చేస్తే ధర రూ 5.42 పైసలు, ఎన్టీపీసీ కొడ్గి నుంచి కొనుగోలు చేసిన దానికి ధర రూ 5.46 పైసలు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రయివేటు సంస్థల కంటే ఎన్టీపీసీ వద్ద ఎక్కువ ధరకు కొనుగోలు కొనుగోలు చేస్తున్నామన్నారు. పాత ఒప్పందాల కంటే కొత్తగా ఒప్పందాలు చేసుకుంటే ధర ఎక్కువ అవుతుందన్నారు. ఓపెన్ టెండర్ల ద్వారా వెళ్లినా ఈఆర్‌సీలే ధరలు నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

ఇది కేంద్ర ప్రభుత్వ నిబంధనల్లో ఉంటుందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వ రంగ సంస్థ కూడంకుళం ఎన్టీపీసీని సంప్రదించామన్నారు. ఎన్టీపీసీ కూడంకుళం నుంచి రూ 10 చెల్లించాలని చెప్పిందని, అలాగే మూడు నెలల అడ్వాన్స్ ఇవ్వాలని షరతు పెట్టిందన్నారు. 3 నెలల అడ్వాన్స్ ఇచ్చిన సందర్భాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. సేంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థలు రూ 4.15 పైసలకు విద్యుత్ సరఫరా చేస్తామని ముందుకు వచ్చాయన్నారు. విద్యుత్ కొనుగోలులో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ముందుకు పోతున్నామన్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు. కొన్ని పరిశ్రమలకు ప్రభుత్వ బకాయిలు ఉన్నాయనేది వాస్తవమన్నారు. విద్యుత్ బిల్లు చెల్లించకపోతే గత పాలకులు ప్రభుత్వ కార్యాలయాలను జప్తు చేసిన సందర్భాలు ఉన్నాయని, కరీంనగర్ కలెక్టరేట్‌ను ఉదాహరించారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమన్నారు. ప్రతి రాష్ట్రం ఉత్పత్తి చేసే దాంట్లో నిర్ణీత శాతం సౌర విద్యుత్ ఉండాలనేది నిబంధన ఉందన్నారు. సోలార్ డెవలపర్స్ రూ 4.66 పైసల నుంచి రూ 6.45 పైసలకు సరఫరా చేస్తోందన్నారు. ఉదయ్ పథకానికి సంబంధించి రాష్ట్రానికి ఎలాంటి లాభం లేదన్నారు. డిస్కమ్‌ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు.డిస్కామ్‌ల నష్టాన్ని 10 శాతానికి తగ్గించామన్నారు. ఇంకా తగ్గించాలన ముఖ్యమంత్రి సూచనలు చేశారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే ప్రస్తుతానికి తెలంగాణలో మిగులు విద్యుత్ రాష్ట్రంగా లేదన్నారు. రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు మాత్రమే సరిపోతుందని, భవిష్యతులో విద్యుత్ వినియోగం, సరఫరా తదితర అంశాలను అంచనా వేశామన్నారు. అందుకు అనుగుణంగా విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆయన వివరించారు. ఉచిత విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వ సాయం కూడా లేదని, మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.


'గ్రేటర్'లో వ్యూహాత్మక రోడ్లకు అత్యంత ప్రాధాన్యత : మంత్రి కేటీఆర్



గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్‌లో ట్రాఫిక్ రద్దీ, పెరుగుతున్న నగర విస్తరణను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మక రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్టు పురపాలక శాఖ మంత్రి కె తారకరామారావు చెప్పారు. శనివారం ప్రశోత్తరాల్లో హైదరాబాద్ నగరానికి చెందిన సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఎస్ఆర్‌డీపీ కింద రూ 2645 కోట్ల అంచనా వ్యయంతో 5 దశలలో మొత్తం 52 పనులను చేపట్టినట్టు తెలిపారు.16 పనులు పూర్తిగా స్థాయిలో కొనసాగుతున్నాయన్నారు. మిగిలిన వాటిలో పనులను త్వరలోనే చేపట్టమైందన్నారు. ఈ పనులను పూర్తి చేయడానికి నిర్దిష్ట కాలపరిమితి రూపొందించామన్నారు. అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ ద్వారా వెళ్లే ప్రయాణికులు ఫీడ్ బ్యాక్ కోరుతూ జీహెచ్‌ఎంసీ సర్వేను నిర్వహించిందన్నారు. ఈ సర్వేలో ద్విచక్ర వాహనదారులకు, త్రిచక్ర వాహనదారులు, నాలుకు చక్రాల వాహనదారులకు వర్తిస్తుందన్నారు. అయ్యప్ప సొసైటీ వద్ద అండర్‌పాస్ నిర్మాణాలు నిమిత్తం ప్రయాణికులందరు వారి సంతృప్తి, సంతోషాన్ని వ్యక్తపరించారన్నారు. ఈ అండర్‌పాస్ వల్ల కనీసం 30 నిమిషాల నుంచి 45 నిమిషాలకు వారి ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాజెక్టులు జీహెచ్‌ఎంసీ చేపట్టాలని సూచించారు. సిగ్నల్ రహిత జంక్షన్లను చేయడం ద్వారా ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

నవచిత్రం

థ్రిల్ చేసే టాక్సీవాలా


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, ప్రియాంక జవాల్కర్, మాళవిక నాయర్ హీరోహీరోయిన్లుగా రాహుల్ సంక్రిత్యాన్ దర్శకత్వంలో జీఏ2, యువి పిక్చర్స్ పతాకాలపై ఎస్.కె.ఎన్ నిర్మిస్తున్న చిత్రం 'టాక్సీవాలా'. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను శనివారం చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ, 'విజయ్ దేవర కొండకి ఉన్న క్రేజ్, పాపులారిటీని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు ఈ కథను తయారు చేశాడు. దానికి తగ్గట్టుగానే అన్ని వర్గాల్ని ఎంటర్‌టైన్ చేసే విధంగా విజయ్ పాత్రను తీర్చిదిద్దారు. విజయ్ బాడీలాంగ్వేజ్, మ్యానరిజమ్స్, పాత్ర తీరుతెన్నులు ఆడియెన్స్‌ను మెస్మరైజ్ చేస్తాయి. దర్శకుడు రాహుల్ టేకింగ్, సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ ఈ చిత్రంలో హైలైట్‌గా నిలుస్తాయి. శక్తివంతమైన కథ, నటీనటుల నటనను దృష్టిలో పెట్టుకుని సినిమాను గ్రాండియర్‌గా నిర్మిస్తున్నాం. ఫస్ట్‌లుక్‌కు ముందుగా టైటిల్‌ను రివీల్ చేస్తూ విడుదల చేసిన వీడియోకు మంచి స్పందన లభించింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. మే 18న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా సినిమాను రూపొందిస్తున్నాం. ఆద్యంతం కామెడీగా ప్రేక్షకుల్ని నవ్విస్తూ థ్రిల్ చేస్తుంది. 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండని ఒక డైమన్షన్‌లో చూశారు. ఇందులో మరో డైమన్షన్‌లో చూస్తారు. విజయ్ టైమింగ్‌కి ప్రేక్షకులు ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన నటనతో ఆకట్టుకుంటాడు. త్వరలో మరిన్ని ఆసక్తికర అంశాలను పంచుకుంటాం' అని దర్శకుడు తెలిపారు. కళ్యాణి, మధునందన్, సిజ్జు మీనన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్, విష్ణు తదితరులు ఇతర పాత్రధారులు.

పోకిరి, ఇడియట్ రేంజ్..


ఆకాష్ పూరీ

తనయుడు ఆకాష్ పూరీ హీరోగా పూరీ జగన్నాథ్ రూపొందిస్తున్న నూతన చిత్రం 'మెహబూబా'. పూరీ కనెక్ట్స్ పతాకంపై నిర్మితమవుతున్న ఈ చిత్రంలో నేహాశెట్టి కథానాయికగా నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నిర్మాణంలో నిర్మాత దిల్‌రాజు భాగమయ్యారు. దిల్‌రాజ్, పూరీ కాంబినేషన్‌లో 'పోకిరి', 'ఇడియట్' వంటి విజయవంతమైన చిత్రాలొచ్చాయి. తాజాగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్ సంస్థ భాగమవ్వడం పట్ల చిత్ర బృందం ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పూరీ కనెక్ట్స్ కో ఫౌండర్ ఛార్మి చెబుతూ, 'మాకు ఎంతో ప్రత్యేకమైన ఈ సినిమా కోసం దిల్‌రాజుతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. 'పోకిరి', 'ఇడియట్' తర్వాత ఇది మరో విజయవంతమైన సినిమా అవుతుంది. ఈ చిత్రాన్ని మే 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపింది.

2 స్టేట్స్ ప్రారంభం..

అడివి శేష హీరోగా టి.జి.విశ్వప్రసాద్ సమర్పణలో లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకాలపై ఎంఎల్‌వి సత్యనారాయణ నిర్మిస్తున్న చిత్రం '2 స్టేట్స్'. చేతన్ భగత్ నవల ఆధారంగా రూపొందిస్తున్న ఈ చిత్రం ద్వారా వెంకట్ కుంచమ్ దర్శకుడిగా, శివానీ రాజశేఖర్ కథానాయికగా పరిచయమవుతున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం శనివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వైభవంగా జరిగింది. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రాజమౌళి క్లాప్‌నివ్వగా, కృష్ణంరాజు కెమెరా స్విచాన్ చేశారు. కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు.
ఈ సందర్భంగా అతిథిగా విచ్చేసిన కోడి రామకృష్ణ మాట్లాడుతూ, 'శివానీ మా ఇంటి అమ్మాయి. ఆమె హీరోయిన్‌గా పరిచయం కావడం చాలా హ్యాపీగా ఉంది. సినిమా పెద్ద హిట్ కావడంతోపాటు శివానీ పెద్ద హీరోయిన్‌గా ఎదగాలి' అని అన్నారు.
'నవలను అడాప్ట్ చేసుకుని సినిమా చేయడం ఈజీకాదు. '2స్టేట్స్'ను ఎలా చేయాలనే దానిపై కొన్ని రోజులు ఆలోచించాం. చైతన్య, మధు సహకారంతో స్క్రిప్ట్ వర్క్ చేశాం. కొత్త టీమ్ దొరికింది. అడివి శేష అద్భుతమైన నటుడు. శివానీ రాజశేఖర్‌ను ఈ సినిమా ద్వారా పరిచయం చేయడం హ్యాపీగా ఉంది. అనూప్ రూబెన్స్ ఇప్పటికే మూడు ట్యూన్స్ అందించారు. సూపర్‌గా వచ్చాయి. ఏప్రిల్ 5 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి 19 వరకు హైదరాబాద్‌లో, మేలో రెండవ షెడ్యూల్‌ను కోల్‌కతాలో, మూడో షెడ్యూల్ యూఎస్‌లో చిత్రీకరించడానికి ప్లాన్ చేశాం. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుంది. నన్ను నమ్మిన నిర్మాతకు, జీవిత, రాజశేఖర్‌లకు థ్యాంక్స్' అని దర్శకుడు చెప్పారు.


అడివిశేషు, శివానీ రాజశేఖర్

అడివిశేషు చెబుతూ, 'ఎప్పట్నుంచో లవ్ స్టోరీలో నటించాలని ఉండేది. ఈ సినిమాతో ఆ కోరిక తీరనుంది. శివానీతో నటించడం హ్యాపీగా ఉంది. తనకిది మంచి ప్రారంభ సినిమా అవుతుంది. హిందీలో '2 స్టేట్స్'ను మూడు సార్లు చూశా. నాకు బాగా నచ్చింది. ఫ్రెష్ కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా కూడా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. 'నన్ను ప్రోత్సహిస్తున్న అమ్మా, నాన్న(జీవిత, రాజశేఖర్)లకు థ్యాంక్స్. నాకిది డ్రీమ్ లాంచ్. అనూప్ సంగీతం అందించడం హ్యాపీగా ఉంది' అని శివానీ తెలిపారు. 'ఇందులో మా పీపుల్ మీడియా బ్యానర్ అసోసియేట్ కావడం హ్యాపీగా ఉంది' అని వివేక్ కూచిబొట్ల అన్నారు.

ఎడిటర్ రేణు సాలుజా పాత్రలో..!

సెలక్టీవ్‌గా సినిమాలు చేస్తూ రాణిస్తున్న అదితి రావ్ హైదరీ తాజాగా ప్రముఖ ఎడిటర్ రేణు సాలుజా బయోపిక్‌లో నటించే ఛాన్స్‌ను అందుకున్నట్టు తెలుస్తోంది. రేణు సాలుజా భర్త, దర్శకుడు సుధీర్ మిశ్రా ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. క్యాన్సర్ కారణంగా 2000లో రేణు కన్నుమూశారు.
'స్వెహ' పేరుతో రూపొందించే ఈసినిమాలో తన భార్య పాత్ర ప్రధానంగా ఆటోబయోగ్రఫీని సుధీర్ మిశ్రా చూపించబోతున్నారట.
క్యాన్సర్‌తో ఆమె చనిపోయే ముందు రోజుల్లో వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం ప్రధానంగా ఈ కథ సాగుతుందట. ఈ సినిమా గురించి సుధీర్ మిశ్రా మాట్లాడుతూ,
'రేణుపై సినిమా తీస్తేగానీ నా జీవితం పూర్తి కాదు. ఇది చేయాలని చాలా రోజులుగా అనుకున్నా, ఇప్పటికి కుదురుతోంది. అదితి మంచి నటి. సెన్సిటివ్ పాత్రలకు తనని తాను మలుచుకునే తీరు బాగుంటుంది. రేణులాగే అదితి కూడా బాగా పాడగలదు. త్వరలోనే ఈచిత్ర షూటింగ్ కార్యక్రమాలను ప్రారంభిస్తాం' అని తెలిపారు.
ప్రస్తుతం ఆయన 'దాస్‌దేవ్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో కూడా అదితినే కథానాయికగా నటిస్తుండటం విశేషం.
అదితి ఈ చిత్రంతోపాటు తెలుగులో 'సమ్మోహనం', 'నవాబ్' చిత్రాల్లోనూ నటిస్తోంది.


అదితిరావు హైదరీ

ఆ సినిమా ఆగిపోలేదు..


నాగచైతన్య

నాగచైతన్య ప్రస్తుతం 'సవ్యసాచి' చిత్రంలో నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం జూన్ 14న విడుదల కానుంది. దీంతోపాటు నాగచైతన్య మారుతి దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో ఈ సినిమా ఉంటుందా? లేదా అనే అనుమానాలు చైతూ అభిమానుల్లో, ప్రేక్షకుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని కొంతమంది దర్శకుడు మారుతిని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించగా, అందుకు ఆయన క్లారిటీ ఇచ్చారు.
'అందరు చై సినిమా గురించి అడుగుతున్నారు. మా సినిమా ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం చైతూ 'సవ్యసాచి' చిత్ర షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆయన కోసం నేను మీలాగే వెయిట్ చేస్తున్నా. మే నెలలో మా చిత్ర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. అప్పటి వరకు వెయిట్ చేయండి. మా సినిమా విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు వద్దు' అని తెలిపారు. ఈ సినిమాకు 'శైలజారెడ్డి అల్లుడు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం. ఇందులో నాగచైతన్య సరసన అను ఇమ్మాన్యుయెల్ కథానాయికగా ఎంపికైన విషయం విదితమే. రమ్యకృష్ణ కీలక పాత్ర పోషించనున్నారట. ఆ తర్వాత వెంకటేష్‌తో కలిసి నాగచైతన్య ఓ మల్టీస్టారర్ చిత్రంలో నటించనున్నారు. దీనికి బాబీ దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది.

పాత్ర కోసం నిజమైన రైతుగా..


కార్తీ

పాత్ర కోసం తన బాడీ లాంగ్వేజ్‌ను మార్చుకోవడంలో హీరో కార్తీ గురించి వేరే చెప్పక్కర్లేదు. 'చెలియా', 'కాష్మోరా' చిత్రాల్లో తన నట వైవిధ్యాన్ని స్పష్టంగా చూడొచ్చు. అలాగే 'ఖాకి' చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించిన వైనానికి హ్యాట్సాఫ్ చెప్పి తీరాల్సిందే. త్వరలోనే ఆయన మరో భిన్న పాత్రతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజా సినిమా కోసం రైతుగా మారారు. కార్తీ ప్రస్తుతం 'కాదైకుట్టి సింగమ్' చిత్రంలో నటిస్తున్నారు. విలేజ్ డ్రామా నేపథ్యంలో సినిమా సాగుతుంది. పాండిరాజ్ దర్శకుడు. ఇందులో రైతుగా కార్తీ నటిస్తున్నారు. పాత్రలో సహజత్వం తేవడం కోసం, పాత్రను రక్తికట్టించడం కోసం నిజ జీవితంలో రైతుగా మారి వ్యవసాయ పనులు చేయబోతున్నాడు. దీని కోసం వ్యవసాయం ఎలా చేస్తారనే దానిపై అగ్రికల్చరల్ స్కూల్‌లో జాయిన్ అయ్యారు కూడా. ఈ సందర్భంగా తీసిన కొన్ని కార్తీ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాద్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కార్తీ సరసన సయేషా కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను కార్తీ సోదరుడు, నటుడు సూర్య నిర్మిస్తుండటం విశేషం.


సాయి పల్లవి

నేనెవరికీ పోటీ కాదు..

'నటిగా ఏదో సాధించాలనే కోరిక నాకు లేదు. మంచి గుర్తింపు సాధించడమే నా లక్ష్యం' అని అంటోంది సాయిపల్లవి. 'ఫిదా' చిత్రంలోని నటన, డైలాగ్ డెలివరీ, డాన్స్‌లతో తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. 'ఎంసీఏ'తోనూ మంచి విజయాన్ని అందుకున్న సాయి పల్లవి చాలా జాగ్రత్తగా సినిమాలను ఎంపిక చేసుకుంటోంది. తన సినిమాలు, కెరీర్ గురించి సాయిపల్లవి మాట్లాడుతూ,'సినిమా ఇండస్ట్రీలో నేను ఎవరినీ పోటీగా భావించడం లేదు. నేనూ ఎవరికీ పోటీ కాదు. కథానాయికలంతా నాకు మంచి స్నేహితులే. అన్ని రకాల పాత్రలు నాకు సూట్ కావు. నా బలం, బలహీనతలేంటో నాకు తెలుసు. నేను ఎలాంటి పాత్రలు చేయాలో, నా హద్దులేంటో కూడా తెలుసు. తమిళంలో నటించాలనుకున్నప్పుడు 'కరు'(తెలుగులో కణం) అవకాశం వచ్చింది. ఇందులో ఓ చిన్నారికి తల్లిగా నటించడం హ్యాపీగా ఉంది. వచ్చిన సినిమాలన్నింటినీ కాకుండా ప్రాధాన్యత, భిన్నమైన సినిమాలనే చేసేందుకు ప్రయారిటీ ఇస్తాను' అని అన్నారు. సాయిపల్లవి ప్రస్తుతం 'కణం'తోపాటు 'మారి 2', సూర్య సరసన ఓ సినిమాలోనూ నటిస్తోంది.

ఆద్యంతం ఉత్కంఠభరితం

నందు, సౌమ్య వేణుగోపాల్, పూజా రామచంద్రన్, గగన్ విహారి ప్రధాన పాత్రధారులుగా వరప్రసాద్ వరికూటి దర్శకత్వంలో హరిహర చలన చిత్ర పతాకంపై ఎస్.శ్రీకాంత్‌రెడ్డి, రామమోహనరావు ఇప్పిలి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా గురించి శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు వరప్రసాద్ మాట్లాడుతూ, 'నలుగురు ఫ్రెండ్స్ మధ్య సాగే కథ ఇది. హీరో హీరోయిన్లకు ఎంగేజ్‌మెంట్ నుంచి పెళ్ళి అయ్యేంత వరకు ఈ మధ్యలో ఏం జరిగింది?, వాళ్ళ జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయి?, ఎలాంటి ఇబ్బందులను, సంఘటనలను ఎదుర్కొన్నారు?, చివరికి పెళ్ళి అయ్యిందా లేదా అన్నది సినిమా. ఆద్యంతం ట్విస్టులు, టర్న్‌లతో సాగుతుంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్, కామెడీ, సెంటిమెంట్, థ్రిల్లర్, యాక్షన్ ఇలా అన్ని అంశాల మేళవింపుగా ఉంటుంది. సినిమా చూశాక కథ, స్క్రీన్‌ప్లే గురించి చర్చించుకుంటారు. అద్భుతమైన కథ ఇది. స్క్రీన్‌ప్లే ఆడియెన్స్‌ను ఎంగేజ్ చేస్తుంది. టెక్నీకల్ టీమ్ సినిమాకు పెద్ద అసెట్. నిర్మాతలు నాకు మంచి టీమ్‌నిచ్చారు. మంచి టెక్నీషియన్లు ఉంటే అవుట్‌పుట్ బాగా వస్తుందనడానికి సినిమా నిదర్శనం. అవుట్‌పుట్‌పై చాలా నమ్మకంగా ఉన్నాం. దర్శకుడిగా నా తొలి ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.
'ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రమిది. ఆడియెన్స్‌కు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ఇందులో ఉన్న మూడు పాటలకు మంచి స్పందన లభించింది. నందు, సౌమ్య, పూజా రామచంద్రన్, గగన్ పాత్రలు హైలైట్‌గా నిలుస్తాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి ఏప్రిల్ 6న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాం' అని నిర్మాత రామమోహనరావు తెలిపారు.


సౌమ్య వేణుగోపాల్
నందు


జాక్వెలిన్ ఫెర్నాండేజ్


అలియాభట్

గాయాలైనప్పటికీ భయం లేదు..

ఒకప్పుడు కథానాయికలు యాక్షన్ చేయడం చాలా అరుదు. ఇటీవల ట్రెండ్ మారింది. హీరోలకు దీటుగా హీరోయిన్లూ పోరాటాలు చేస్తున్నారు. యాక్షన్ సీక్వెన్స్‌ల్లోనూ తాము తక్కువ కాదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గాయాల పాలైనప్పటికీ ఏమాత్రం భయపడకుండా షూటింగ్‌ల్లో పాల్గొనటం విశేషం. ఆ మధ్య షూటింగ్‌లో కత్తి యుద్ధం చేస్తూ కంగనా రనౌత్ తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. తాజాగా ఆమె బాటలోనే అలియా భట్, జాక్వెలిన్ ఫెర్నాండేజ్, నటాషా సూరి సెట్‌లో యాక్షన్ చేస్తూ గాయపడ్డారు.
ఝాన్సీ రాణి లక్ష్మి భాయి జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు క్రిష్ బాలీవుడ్‌లో 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లక్ష్మి భాయి పాత్రలో కంగనా రనౌత్ నటిస్తోంది. ఝాన్సీ రాణి లక్ష్మిభాయి అంటే యుద్ధాలకు పెట్టింది పేరు. ఈ క్రమంలో షూటింగ్‌లో భాగంగా యుద్ధ సన్నివేశాలు చిత్రీకరించే సమయంలో కంగనా కత్తి గాట్లకు గురయ్యారు. దీంతో కొన్ని రోజుల పాటు షూటింగ్ కూడా వాయిదా వేయాల్సి వచ్చింది. అలాగే కాలుకి కూడా గాయాలయ్యాయి. అయినప్పటికీ కొద్ది రోజుల్లోనే షూటింగ్‌లో పాల్గొని నటన పట్ల తనకున్న ప్యాషన్‌ను చాటుకుంది కంగనా. ఇటీవలే మరో బాలీవుడ్ నటి అలియాభట్ గాయపడింది. ప్రస్తుతం ఆమె అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో 'బ్రహ్మాస్త్ర'లో చిత్రంలో నటిస్తోంది. బల్గేరియాలో అత్యంత కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అందులో భాగంగా ఓ స్టంట్స్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నప్పుడు అలియా భుజానికి, మనికట్టుకి గాయమైందట. గాయాన్ని సైతం లెక్కచేయకుండా కట్టుకట్టుకుని కాసేపటికే షూటింగ్‌లో పాల్గొని అందరినీ ఆశ్చర్యపరిచింది అలియా. అయితే భుజానికి బలమైన గాయం కావడంతో నాలుగు వారాలు బెడ్‌రెస్ట్ తీసుకోవాలని వైద్యులు సూచించారట. తాజాగా మరో బాలీవుడ్ నటిన జాక్వెలిన్ గాయాలపాలయ్యారు. ప్రస్తుతం ఆమె సల్మాన్‌తో కలిసి 'రేస్3' చిత్రంలో నటిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో సల్మాన్‌తోపాటు జాక్వెలిన్ కూడా యాక్షన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ అబుదాబిలో జరుగుతోంది. అక్కడ యాక్షన్ ఘట్టాలను చిత్రీకరిస్తుండగా కంటి పై భాగంలో గాయమైందట. గాయం చిన్నది కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం తిరిగి ఆమె షూటింగ్‌లో పాల్గొందని నిర్మాత రమేష్ తౌరాని వెల్లడించారు.

అందుకే ఈ కథ ఎంచుకున్నా..


ఉపేంద్ర మాధవ్

'కమర్షియల్ సినిమా తీయడం ఈజీ కాదు. 'ఎంఎల్‌ఏ' చిత్రంలో అన్ని రకాల అంశాలున్నాయి. ఈ సినిమాకు మంచి ప్రశంసలు దక్కుతుండటం ఆనందంగా ఉంది' అని దర్శకుడు ఉపేంద్ర మాధవ్ అన్నారు. కళ్యాణ్ రామ్, కాజల్ జంగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందిన 'ఎంఎల్‌ఏ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శనివారం మీడియాతో ముచ్చటించారు.
'మాది గుంటూరు జిల్లా, జొన్నలగడ్డ. డైరెక్టర్ కావాలని ఇండస్ట్రీలోకి వచ్చా. 'సాక్షి' రామ్ దగ్గర రెండు చిత్రాలకు పనిచేశా. ఆ తర్వాత యాడ్ ఫిల్మ్స్ చేశా. 'దూకుడు' చిత్రానికి స్క్రిప్ట్ వర్క్‌లో అసొసియేట్‌గా పనిచేశా. ఇలా 'పాండవులు పాండవులు తుమ్మెద', 'యాక్షన్ త్రీడీ', 'బాద్‌షా', 'ఆగడు', 'బ్రూస్‌లీ' చిత్రాలకు రైటింగ్ సైడ్ భాగమయ్యాను. 'పటాస్' చిత్ర టైమ్‌లో అనిల్ రావిపూడి ద్వారా కళ్యాణ్ రామ్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన మంచికథ ఉంటే చెప్పు సినిమా చేద్దామన్నారు. రెండేండ్ల తర్వాత ఈ కథ చెప్పా. నచ్చి ఓకే చెప్పారు. కమర్షియల్ సినిమాతోనే లాంచ్ కావాలని ఈ కథను ఎంచుకున్నా. శ్రీనువైట్ల స్క్రిప్టు విని మెచ్చుకున్నారు. శుక్రవారం విడుదలైన సినిమాకు మంచి స్పందన లభిస్తుంది. పలువురు దర్శకులు ఫోన్ చేసి అప్రిషియేట్ చేస్తున్నారు. సినిమాలో ట్విస్టులు, డైలాగ్‌లకు మంచి పేరొస్తోంది. అలాగే పిల్లల విద్య గురించి చర్చించుకుంటున్నారు. కమర్షియల్ సినిమా తీయటం అంత ఈజీ కాదు. అయినప్పటికీ నాకు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్, ఎమోషన్ బేస్డ్ వినోదాత్మక చిత్రాలు చేయడమంటే ఇష్టం. నెక్ట్స్ ప్రాజెక్ట్ కూడా పీపుల్ మీడియా, బ్లూ ప్లానెట్ బ్యానర్స్‌లోనే ఉంటుంది' అని ఉపేంద్రమాధవ్ చెప్పారు.

"మహా" రైతుల మార్చ్ స్ఫూర్తిదాయకం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం/ యాదాద్రిభువనగిరి ప్రతినిధి

'మహారాష్ట్ర రైతుల మహాపాదయాత్ర దేశానికి స్ఫూర్తి. అది బీజేపీ ప్రభుత్వాన్ని గడగడలాడించింది. ఆ మహత్తర పోరాట స్ఫూర్తితో ఊరూరా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరముంది. హైదరాబాద్‌లో ఏప్రిల్‌లో జరగనున్న సీపీఐ(ఎం) జాతీయ మహాసభ తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు నాంది పలకనుంది. ఆర్‌ఎస్‌ఎస్ ఆదేశాల ప్రకారంగా మోడీ సర్కార్ భారత రాజ్యాంగాన్ని కాషాయీకరణ చేసే కుట్రకు పాల్పడుతోంది' అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్న పార్టీ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో బస్సు యాత్రలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జూలకంటి రంగారెడ్డి, బి.వెంకట్‌తో కలిసి రాఘవులు జెండా ఊపి ప్రారంభించారు.

అనంతరం సభలో రాఘవులు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా జరిగే ప్రజాపోరాటాలపై మహాసభలో చర్చించ నున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో మల్లన్నసాగర్ పేరుతో టీఆర్ఎస్ ప్రభుత్వం వేలాది ఎకరాలు సేకరించి వందలాది మంది రైతులను నిర్వాసితులను చేయాలనుకుంటుందని అన్నారు. మహారాష్ట్రలో నాసిక్ నుంచి ముంబాయి వరకు లక్షలాది మంది రైతులు నిర్వహించిన పాదయాత్ర బీజేపీ ప్రభుత్వాన్ని వణికించిందని చెప్పారు.



మాట్లాడుతున్న రాఘవులు

దళితులపై ప్రతి రోజూ ఏదో ఒక చోట వీరిపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు అంబేద్కర్ విగ్రహాలు కూడా అగ్రవర్ణాల వాడల్లో ఉండకూడదన్న దుర్మార్గ ఆలోచనలు జరుగు తున్నాయని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతకల్లోలాలు పెరిగాయని, స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధానాలు దేశంలో కుదరదని చెప్పిన సీపీఐ(ఎం) కార్యాలయాలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని అన్నారు.

మహాజన పాదయాత్ర సందర్భంగా సీపీఐ(ఎం)ను ముక్కు నేలకు రాయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పుడు తృతీయఫ్రంట్ పేరుతో ఢిల్లీలో సీపీఐ(ఎం) మద్దతు కావాలని పాకులాడుతున్నారని విమర్శించారు. ప్రజల కష్టాల్లో పాలుపంచుకున్నంత కాలం ఎర్రజెండాను ఎవరూ నాశనం చేయలేరన్నారు. జాతీయ మహాసభ సందర్భంగా 22న జరిగే మహాప్రదర్శనకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, ఆశయ్య, స్కైలాబ్‌బాబు, పి.జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతవిద్వేషాలు ఆందోళనకరం : తమ్మినేని

గుజరాత్‌లో మోడీ హయాంలో జరిగిన మత విద్వేషాలు నేడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయని తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. యాదాద్రి జిల్లా కేంద్రంలో బస్సు జాతా ప్రారంభంలో ఆయన మాట్లాడారు. సామాన్యుడికి అందుబాటులో ఉన్న సోషల్ మీడియాపై కూడా ఆంక్షలు విధించే స్థాయికి బీజేపీ దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు లూటీ అవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలో మతోన్మాదాన్ని ఎదుర్కొనే సైద్ధాంతిక శక్తి తమ పార్టీకే ఉందన్నారు. రైతులకు పెట్టుబడి కాదు.. గిట్టుబాటు కావాలన్నారు. లౌకిక వాదాన్ని కాపాడటానికి, అన్ని శక్తులను సంఘటితం చేయడానికి తమ పార్టీ జాతీయ మహాసభ నాంది పలుకనుందని చెప్పారు. 22న హైదరాబాద్‌లో మూడు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఏప్రిల్ 12న హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో ఫెస్ట్ నిర్వహిస్తామని చెప్పారు.

పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. మతోన్మాదుల దుర్మార్గాలను అడ్డుకొనే శక్తి ఎర్రజెండాకే ఉందని ప్రజలు గుర్తిస్తున్నారని వివరించారు. బడ్జెట్‌లో బీసీలకు అరకొర నిధులే కేటాయించారన్నారు. గత ఏడాది కేటాయించిన ఐదు వేల కోట్లల్లో వెయ్యి కోట్లే ఖర్చు పెట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ, కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి

నవతెలంగాణ-ములుగు

నాలుగేళ్ల చిన్నారిపై వరుసకు అన్ననే లైంగిక దాడి చేశాడు. ఈ ఘటన జయశంకర్ జిల్లా వెంకటాపూర్ మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. వెంకటాపూర్ ఎస్ఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కొప్పుల కార్తిక్(19) తన బాబాయ్ కుమార్తె(నాలుగేండ్లు)పై ఈనెల 19న లైంగిక దాడి చేశాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో బాలికను పక్కనే ఉన్న మిరప తోటలోకి తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. దాంతో బాలిక కడుపు నొప్పి వస్తోందని ఏడవటంతో తల్లిదండ్రులు మరుసటి రోజు ఆస్పత్రికి తీసుకుపోయారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి లైంగిక దాడి జరిగినట్టు చెప్పారు. దాంతో తల్లిదండ్రులు బాలికను వివరాలు అడిగారు. విషయం చెప్పింది. వెంటనే కార్తిక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం కార్తిక్ పరారీలో ఉన్నాడు.

24 గంటల కరెంట్ ముంచుతోంది

(మొదటి పేజీ తరువాయి)

భారీగా పడిపోతున్నాయి. జనవరిలో భూగర్భ జలాల లభ్యత 12.14 మీటర్ల లోతులో ఉంటే.. ఫిబ్రవరి నాటికి 13.89 మీటర్లకు పడి పోయింది. నెల రోజుల వ్యవధిలోనే జిల్లాలో నీటి మట్టం సరాసరిగా 1.75 మీటర్ల లోతుకు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఈసారి సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ 24 గంటల కరెంటు తాకిడితో ఏకబిగిన తోడెయ్యడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 40 శాతం బోర్లు ఒట్టిపోయాయి. ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, మాచారెడ్డి, పిట్లం మండలాల్లో మూడు వేల ఎకరాకలకు పైగా వరిపైరు ఎండిపోయినట్టు అంచనా.

పెట్టుబడులు బుగ్గి..గొర్లకు మేతగా పంట


ఎకరాకు రూ.20వేల నుంచి రూ.25వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారు. తీరా పొట్టదశలో సాగునీటి ఎద్దడి వల్ల పంటలు ఎండుముఖం పడుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు మరో అవకాశం లేక ఎకరా పైరును పశువుల మేత కోసం రూ.1500లకు విక్రయించుకుంటున్నారు. మరోవైపు పశువులకు గ్రాసం కొరత తీవ్రంగానే ఉంది. సబ్సిడీ గొర్రెలకు సరిపడా మేత లేక ఇప్పటికే కొంతమంది పెంపకందారులు మహారాష్ట్ర లోని ధర్మా బాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు తరలివెళ్లారు. మరికొంత మంది గొర్రెల పెంపకందారులు ఇక్కడే ఎండిపోతున్న పంట చేలను గొర్రెల మేత కోసం కొనుగోలు చేస్తున్నారు.

గొర్రెల మేతకు ఇచ్చినం : జక్కు కళావతి, మహిళా రైతు, మోపాల్



బోరు నీళ్లు పోస్తలేదు. మూడెకరాల్లో వరి సాగు చేస్తే అంతా ఎండిపో యింది. పెట్టుబడి బుగ్గి పాలైంది. దిక్కులేక మేత కోసం పంట అమ్మినం.

కండ్ల ముందే ఎండుతోంది : పెద్దొల్ల శ్రీనివాస్‌రెడ్డి, మోపాల్



మూడెకరాల 20 గుంటల్లో వరి పెట్టినం. బోరు పోస్తలేదు. 24గంటల కరెంటు కొంపముంచింది. ఒకే పట్టున బోర్లు నడిపించడంలో నీళ్ల ఇంకిపోయినయి. చేసేదేమీ లేక గేదెల మేత కోసం పచ్చటి పొలం ఇచ్చినం.

24 గంటల వల్లే : గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి, నిజామాబాద్

24 గంటల కరెంటు వల్ల భూగర్భజలాలు పడిపోయాయి. దీంతో పొలమంతా నీరందని పరిస్థితి. ఇలాంటి సమయంలో రైతులు నీళ్లందని ఆఖరిమడిని విడిచిపెడుతున్నారు. అంతా ఒకేసారి నాట్లు వేయని చోటే ఇలాంటి పరిస్థితి ఉంది.

ఐడీబీఐ బ్యాంకు జీఎంల

అరెస్టుకు రంగం సిద్ధం

- ఇంకా సూత్రధారులున్నారనే కోణంలో సీబీఐ దర్యాప్తు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



(ఫైల్)

మూడు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఐడీబీఐ బ్యాంకు కోట్లాది రూపాయల రుణమంజూరు కుభకోణంలో ఇద్దరు జనరల్ మేనేజర్ల అరెస్టుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) రంగం సిద్ధం చేస్తున్నది. అదే సమయంలో ఈ కుంభకోణం వెనుక మరి కొందరు సూత్రధారులు, పాత్రధారులు ఉన్నారనే కోణంలో కూడా సీబీఐ అధికారులు తమ దర్యాప్తును ముందుకు సాగిస్తున్నారని తెలుస్తోంది. ఐడీబీఐ బ్యాంకు బషీర్‌బాగ్ , హబ్సిగూడ, వైజాగ్‌లోని సిరిపురం బ్రాంచ్‌లతో పాటు చెన్నై బ్రాంచ్ నుంచి రూ.192.98 కోట్ల రూపాయల రుణమంజూరు కుంభకోణం పై బ్యాంకు సౌత్ రీజియన్ జనరల్ మేనేజర్ మంజూనాథ్ పాయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ దర్యాప్తును చేపట్టిన విషయం తెలిసిందే. కిసాన్‌క్రెడిట్ కార్డులతో చేపల పెంపకం తో పాటు ఇతర రుణాలను నకిలీ ధ్రువపత్రాలు, విలువలేని ఆస్తులను పూచీకత్తుగా చూపించి ఈ రుణాన్ని పొందినట్టు సీబీఐ గుర్తించింది. 2009 నుంచి 2012 వరకు మూడేండ్ల కాలంలో ఈ రుణాలు మంజూరు కావడం వెనుక అప్పటి బ్యాంక్ జనరల్ మేనేజర్లు దత్తు రామారావు, చెన్నై రీజియన్ జనరల్ మేనేజర్ ఆర్.దామోదరన్‌లు కీలక పాత్ర వహించినట్టు దర్యాప్తు అధికారులకు తగిన ఆధారాలు లభించినట్టు సమాచారం. అంతేగాక 22 మంది అగ్రిగేటర్‌లు, వారి గ్రూపు సంస్థల పాత్రకు సంబంధించి కూడా తగిన ఆధారాలను సీబీఐ ఇప్పటికే సేకరించినట్టు తెలిసింది. ఇద్దరు జీఎంల పాత్ర కు సంబంధించిన కొన్ని కీలక పాత్రలను శనివారం సీబీఐ అధికారులు ఐడీబీఐ బషీర్‌బాగ్, హబ్సిగూడ బ్రాంచ్‌ల నుంచి స్వాధీనం చేసుకున్నారని సమాచారం. వీటి ఆధారంగా ఇద్దరు అధికారులను అరెస్టు చేయడానికి సీబీఐ హైదరాబాద్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. వీరిని మరింత లోతుగా విచారించి ఈ బ్యాంకు కుంభకోణం సాగిన విధానంపై కూపీ లాగనున్నారని తెలిసింది. వీరి అరెస్టు తర్వాత అగ్రిగ్రేటర్‌ల పై సీబీఐ దృష్టిని సారించనుందని తెలిసింది. వీరికంటే ముందు ప్రధానంగా ఎలాంటి విలువలేని కోలాట్రల్ ఆస్తులను కుదువబెట్టే సమయంలో బ్యాంకుకు చెందిన వాల్యుయేటర్లు ఉద్దేశపూర్వకంగానే వాటి విలువలను ఎక్కువ చేసి చూపించారని, అందుకు పెద్ద మొత్తంలోనే ముడుపులు అందుకున్నారని దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చినట్టు తెలిసింది. ఏడుగురు వాల్యుయేటర్లను కూడా అరెస్టు చేయడానికి తగిన ఆధారాలతో అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఇదిలా ఉంటే రూ.192.98 కోట్ల రూపాయల రుణాలపై అసలు వడ్డీ కలిపి ఇప్పటి వరకు రూ.445 కోట్ల రూపాయలకు చేరిన ఈ స్కాంలో మరి కొందరు సూత్రధారులు, పాత్ర ధారులు ఉన్నారని సీబీఐ అనుమానిస్తోంది. ఇందులో కొందరు బ్యాంకు కింది స్థాయి అధికారులు, సిబ్బంది తో పాటు ప్రయివేటు వ్యక్తులు ఉన్నారనే కోణంలో తన దర్యాప్తును సీబీఐ ముందుకు సాగిస్తున్నట్టు తెలిసింది. సీబీఐ హైదరాబాద్ రీజియన్ డీఐజీ చంద్రశేఖర్ స్వీయ పర్యవేక్షణలో ఈ స్కాం దర్యాప్తు చురుకుగా సాగుతున్నది.

రామగుండం

కార్పొరేషన్‌లో గొడవ

నవతెలంగాణ-కోల్‌సిటీ



పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలో టీఎస్‌ఆర్టీసీ చైర్మెన్, ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మేయర్ లక్ష్మినారాయణ మధ్య నెలకొన్న విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. 14 నెలల తర్వాత శనివారం ప్రారంభమైన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. సొంత మేయర్‌పైనే ఎమ్మెల్యే గ్రూపు కార్పొరేటర్లు తిరుగు బావుటా ఎగురవేశారు. అడుగడుగునా కౌన్సిల్‌కు అడ్డు తగిలారు. ప్రతిపక్ష సభ్యులతో కలిసి బడ్జెట్ ప్రవేశపెట్టనివ్వలేదు. కార్పొరేటర్లు పరస్పరం ప్లకార్డుల ప్రదర్శించి నినాదాలు చేయడంతో కౌన్సిల్ ఉద్రిక్తంగా మారింది. గొడవ తీవ్రరూపం దాల్చటంతో మేయర్ కౌన్సిల్ వాయిదా వేసి వెళ్లిపోగా...ఎమ్మెల్యే గ్రూపు కార్పొరేటర్లు బడ్జెట్ ఎజెండా కాపీలు చింపేసి ఆందోళన కొనసాగించారు.

శనివారం ఉదయం బడ్జెట్, మధ్యాహ్నం సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు మేయర్ ప్రకటించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమైంది. ప్రజా సమస్యలు పరిష్కరించాకే బడ్జెట్ సమావేశం నిర్వహించాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే సోమారం సత్యనారాయణ గ్రూపు కార్పొరేటర్లు నినదించారు. మేయర్ పోడియం ఎదుట బైటాయించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కార్పొరేటర్లూ వారితో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మేయర్ లక్ష్మినారాణయణ గ్రూపులకు చెందిన కార్పొరేటర్లు పరస్పరం దూషించుకున్నారు. దీంతో సమావేశ మందిరం రసాభాసగా మారింది. అసంపూర్తిగా మిగిలిన మిషన్ భగీరథ నీటి పైపులైన్ల పనులు పూర్తిచేసి తన డివిజన్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ 23వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి ప్రకాశ్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో సభను అరగంట వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమయ్యాక కూడా సభ్యుల నిరసన, ఆందోళనలు కొనసాగడంతో మళ్లీ వాయిదా పడింది. అనంతరం కార్పొరేషన్‌లో సభ్యులకు ఏర్పాటు చేసిన భోజన సదుపాయాన్నీ పలువురు తిరస్కరించారు. భోజన విరామం అనంతరం తిరిగి ప్రారంభమైన సభలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, 36వ డివిజన్ కార్పొరేటర్ పాముకుంట్ల లలిత కార్పొరేషన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, 17వ డివిజన్ కార్పొరేటర్ నాయిని భాగ్యలక్ష్మి బలపరిచారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యే గ్రూపు కార్పొరేటర్లు ఆందోళనకు దిగి ముందుగా ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. దీంతో సభలో పలువురి సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కొందరు కార్పొరేటర్లు బడ్జెట్ కాపీలను చింపేశారు. పాలక వర్గాన్ని రద్దుచేయాలని, మేయర్ పదవి నుంచి దిగిపోవాలని ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. మేయర్ వారించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ఎలాంటి అంశాలు చర్చకు రాకుండానే సభ వాయిదా పడింది.

2019లో కాంగ్రెస్ అధికారంలోకి..

రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ

- ఎమ్మెల్యే డీకే.అరుణ సమక్షంలో కాంగ్రెస్‌లోకి జెడ్పీటీసీ ధర్మానాయక్
- కాంగ్రెస్‌ను వీడిన వారంతా తిరిగి రావాలని పిలుపు

నవతెలంగాణ-అచ్చంపేట



రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి, గద్వాల ఎమ్మెల్యే డికె.అరుణ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శనివారం బల్మూర్ జెడ్పీటీసీ ధర్మానాయక్ టీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే అరుణ, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ జెడ్పీటీసీకి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం డికె.అరుణ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తారని నమ్మి టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలను మానసికంగా, వ్యక్తిగతంగా ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని అన్నారు. టీఆర్ఎస్ అనుసరిస్తున్న విధానాల వల్ల ఆ పార్టీకి 14నెలలుగా జెడ్పీటీసీ ధర్మానాయక్ దూరంగా ఉన్నట్టు చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఢిల్లీ ప్లీనరీలో తీర్మాణం చేసినట్టు తెలిపారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు, అట్టడుగు వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని అన్నారు.టీఆర్ఎస్ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఎకరాకు రూ.నాలుగు వేల పెట్టుబడి అంటూ మరోసారి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు తిరిగి పార్టీలో చేరాలని ఆమె కోరారు.

వెల్‌నెస్ సెంటర్లు కొనసాగుతాయి

(మొదటి పేజీ తరువాయి)

సేవా కేంద్రాలని చెప్పారు. సేవలకు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్‌ని కేవలం ఇన్‌ఛార్జిగా మాత్రమే పెట్టాం. ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. గతం కంటే మెరుగ్గా, మరింత సమర్ధవంతంగా సేవలు అందిస్తామన్నారు. మందుల కొరత త్వరలోనే తీరుతుందని చెప్పారు. ప్రత్యేకంగా ఎగ్జిక్యూటివ్ అధికారిని అదనంగా నియమించాం. ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు, వారి కుటంబాలు ఎలాంటి అపోహలకు లోనుకారాదని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు, వారి కుటంబాలకు స్పష్టత ఇవ్వాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ భద్రతకు తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. దేశవ్యాప్తంగా దీనిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కావటంతో 2007లో యుపీఏ ప్రభుత్వం ఆ నిబంధనల్ని రద్దు చేసింది. మళ్లీ దీనిని మోడీ సర్కార్ అమల్లోకి తేవటంపై దేశంలోని కార్మికవర్గాలన్నీ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మళ్లీ ఉద్యమించడానికి కార్మిక సంఘాలన్నీ సిద్ధమవుతున్నాయి.

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ... "కార్మికరంగంలో సంస్కరణలు చేపట్టాలని గతకొన్నాళ్లుగా మోడీ సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. వీటిని మేమంతా నిరంతరం వ్యతిరేకిస్తూ వస్తున్నాం. కానీ మోడీ సర్కార్ కార్మికుల మాట వినిపించుకునే పరిస్థితిలో లేదు. ఏకపక్షంగా కార్మిక నిబంధనల్ని మార్చేసింది. తాజా గెజెట్ నోటిఫికేషన్‌తో మొత్తంగా కార్మికుల ఉద్యోగ భద్రతకే ఎసరుపెట్టారు" అని ఆందోళన వ్యక్తం చేశారు.

టీజీటీ మ్యాథ్స్ ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకుల విద్యాలయాల్లో ప్రకటించిన ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) మ్యాథమెటిక్స్ పోస్టులకు తుది ఫలితాలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీజీటీ మ్యాథ్స్‌లో 840 పోస్టులకు 805 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. మెడికల్ రిపోర్టు అందిన వెంటనే 35 అంగవైకల్యం ఖాళీలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు. 2017, జులై 20న జరిగిన టీజీటీ మ్యాథ్స్ మెయిన్స్‌కు రాతపరీక్షకు 11,093 మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. టీజీటీ మ్యాథ్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు.

నేడు సకల ఉద్యోగుల మహాసభ

- జయప్రదం చేయండి : కారం రవీందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో సకల ఉద్యోగుల మహాసభ జరగనుంది. సకల ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని, వేలాదిగా తరలిరావాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ కారం రవీందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో చెప్పారు. నాలుగేండ్లుగా ఉద్యోగుల సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. సకల జనుల సమ్మె ఒక్క రోజులో సాకారం అయ్యిందంటే ఉద్యోగుల వల్లేనని ప్రభుత్వం గుర్తించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమల్లో ఉద్యోగుల పాత్ర ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఇంత వరకూ జరగలేదని అన్నారు. పదో పీఆర్సీని పూర్తిగా అమలు చేయడం లేదన్నారు. 14 వెల్‌నెస్ సెంటర్లు ప్రకటించినా కేవలం నాలుగే పని చేస్తున్నాయని చెప్పారు. వెల్‌నెస్ సెంటర్లను మూసివేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని అన్నారు. ఉద్యోగుల విరమణ వయస్సును 60 ఏండ్లకు పెంచాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియ సజావుగా జరగడం లేదన్నారు. దీంతో పనిచేస్తున్న ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పా రు. ఉద్యోగుల కనీస వేతనం రూ.20 వేలు ఉండాలని డిమాండ్ చేశారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను వెంటనే స్వరాష్ట్రానికి తేవా లని కోరారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ సెక్రెటరీ జనరల్ వి మమత మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేశారు. స్పౌజ్ బదిలీలకు సీఎం కేసీఆర్ అనుమతి ఇచ్చినా అమ లు కాకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు పి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు.

రూ.80 వేల కోట్లతో కాళేశ్వరం

19 జిల్లాల్లో 37 లక్షల ఎకరాలకు సాగునీరు

- ఈ ఏడాది చివరి నాటికి 20 లక్షలకు ఎకరాలకు నీరందిస్తాం : మంత్రి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా 37 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందిస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఉద్ఘాటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లు అంచనా వ్యయం అవుతుందని చెప్పారు. శనివారం శాసనమండలిలో కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై లఘుచర్చ జరిగింది. బీజేపీ సభ్యుడు ఎన్ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంతోపాటు నాణ్యతాప్రమాణాలు పాటించాలని సూచించారు. టీఆర్ఎస్ సభ్యులు కర్నె ప్రభాకర్, టి భానుప్రసాదరావు, పురాణం సతీష్, ఫారూఖ్‌హుస్సేన్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎంఐఎం సభ్యుడు సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రీ మాట్లాడుతూ ప్రాజెక్టు అంచనా వ్యయం ఎంత అని అడిగారు. మంత్రి హరీశ్‌రావు సమాధానమిస్తూ... కాళేశ్వరం ప్రాజెక్టు పనులు మూడు షిఫ్టుల్లో వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం కీలక మలుపు అని అన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహట్టి వద్ద నిర్మించాలని కాంగ్రెస్ నిర్ణయించిందని చెప్పారు. అక్కడ 42 టీఎంసీల నీటిలభ్యత ఉన్నందున ప్రత్యామ్నాయం చూడాలని కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) సూచించిందని అన్నారు. అందుకే 200 టీఎంసీల నీటి లభ్యత ఉండే మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రాణహిత-చేవెళ్ల ద్వారా 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, కాళేశ్వరం ద్వారా 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 19 జిల్లాల్లోని ప్రజలకు సాగు,తాగునీరు అందుతుందని వివరించారు. మే చివరి నాటికి సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. 365 రోజులు 270 కిలోమీటర్ల పొడవునా గోదావరి నదిలో నీరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెలంగాణ ఉద్యమాన్ని ఏ స్ఫూర్తితో నిర్వహించామో, ప్రాజెక్టుల నిర్మాణాన్ని అదే స్ఫూర్తితో చేపడుతున్నామని అన్నారు. నాణ్యతలో రాజీ లేదన్నారు. వచ్చే వర్షాకాలంలోగా మిడ్‌మానేరుకు కాళేశ్వరం నీరు అందుతుందని చెప్పారు. రూ.వెయ్యి కోట్లతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని అన్నారు.

ఓట్లు, సీట్ల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యం

తమకు ఓట్లు, సీట్ల కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని హరీశ్‌రావు చెప్పారు. ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడం, ఆకుపచ్చ తెలంగాణ నిర్మాణమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూసేకరణకు రూ.7,200 కోట్లు కేటాయించామన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి రూ.1,417 కోట్లు పెట్టామని అన్నారు. జీఎస్టీ వల్ల 5,6 శాతం వ్యయం పెరిగిందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,718 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అందులో మొబిలైజేషన్ అడ్వాన్స్, సర్వే కోసం రూ.2,400 కోట్లు చెల్లించిందని అన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను రద్దు చేశామన్నారు. సర్వేను నీటిపారుదల శాఖ చేస్తుందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశామన్నారు. ఇప్పటి వరకు రూ.23 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. భూసేకరణ ప్రక్రియ ఇంకా జరుగుతోందని అన్నారు. ఇప్పటి వరకు 35 వేల ఎకరాలను సేకరించామన్నారు. కీలకమైన అనుమతులన్నీ వచ్చాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల పొడవు 1,832 కిలోమీటర్లు అని వివరించారు. లిఫ్టులు 20, పంప్‌హౌజ్‌లు 19 ఉండాలని నిర్ణయించామన్నారు. 4,600 మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యంతో 20 రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని అన్నారు.

పగటిదొంగలు కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకులు పగటి దొంగలు అని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రాజెక్టులు పూర్తి కావొద్దని, రైతులకు నీరు అందొద్దని కాంగ్రెస్ కోరుకుంటోందని అన్నారు. ఎలాగైనా అడ్డుకోవాలని కాంగ్రెస్ నాయకులు కేసులు వేస్తున్నారని చెప్పారు. దొంగ సంతకాలు, చనిపోయిన వారి పేరుమీద కేసులు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు నీళ్లొస్తే అడ్రస్ గల్లంతు అవుతుందని గ్రహించిన కాంగ్రెస్ ఎక్కడ లోపాలు దొరుకుతాయా?అని ఎదురుచూస్తున్నారని చెప్పారు. 1956 నుంచి 2014 నాటికి తెలంగాణ ప్రాంతంలో 21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని అన్నారు. అందులో 14 లక్షలు లేదా 15 లక్షల ఎకరాలకు నికరంగా సాగునీరు అందిందని చెప్పారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన ఈ మూడేండ్లలోనే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణ కావాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పమని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చేపట్టే 46 వేల చెరువుల కింద 25 లక్షల ఎకరాలకు ఇది అదనమని చెప్పారు. విభజన చట్టంలో తెలంగాణలోని ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకపోవడం కాంగ్రెస్ చేసిన మరో అన్యాయమని అన్నారు. జాతీయ హోదా కల్పించాలని బీజేపీని అడిగినా ఇంకా కల్పించలేదన్నారు. ఈ ఏడాది చివరి నాటికి 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల నిర్మాణంలో దేశానికే తెలంగాణ దిక్సూచి అవుతుందని అన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచుతామని చెప్పారు.

సెన్సెక్స్ ▼253 32,923	నిఫ్టీ ▼101 10,094	డాలరుకు రూపాయి విలువ 65.18	బంగారం(10.గ్రా) రూ. 30,408	వెండి (కేజీ) రూ. 40,200	కోడిగుడ్లు: హైదరాబాద్ 368, ఒక్కగుడ్డుకు 4.30, వరంగల్ 370, విజయవాడ 374, చెన్నై 397, ముంబయి 410

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి..

మెర్సిడెజ్ నుంచి రూ.2.5 కోట్ల కారు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: మెర్సిడెజ్ బెంజ్ మహావీర్ మోటర్స్ సంస్థ శనివారం హైదరాబాద్‌లో 'లగ్జరీ వీకెండ్ ఫెస్ట్'కు తెరతీసింది. అత్యంత విలువైన ఉత్పత్తులను ఈ ఫెస్ట్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఎక్స్‌బాక్స్, గుస్సీ,ఫెరగామో, అస్మితా మార్వా, కెనాలీ, ఎంటర్‌టైన్‌మెంట్ స్టోర్స్ వంటి ఉత్పత్తులను ఫెస్ట్‌లో ప్రదర్శనకు ఉంచారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ ఫెస్ట్‌కు తొలిరోజు నుంచే మంచి ఆదరణ లభించినట్టుగా నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శనలో భాగంగా మెర్సిడెజ్ బెంజ్ సంస్థకు చెందిన అత్యాధునిక మెర్సిడెజ్-ఏఎంజీ రోడ్‌స్టార్‌ను ఇక్కడ డిస్ప్లేకు ఉంచారు. భారత మార్కెట్లో దాదాపు రూ.2.5 కోట్ల విలువ పలికే ఈ కారు చూపరుల దృష్టిని ఆకర్షించడంతో పాటు ప్రదర్శనకే హైలెట్‌గా నిలిచింది.

తగ్గనున్న పలక టీవీల ధరలు



న్యూఢిల్లీ: పలక టీవీల ధరలు ఇక మరింతగా దిగిరానున్నాయి. దేశంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం భారత్‌కు దిగుమతి అయ్యే ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీల ప్యానెల్స్‌పై సుంకాన్ని తగ్గిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్(సీబీఈసీ) అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఓపెన్ సెల్ (15.6" అంగుళాలు, అంతకంటే ఎక్కువ) ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీల తయారీలో ఉపయోగించే ప్యానెల్స్‌పై దిగుమతి సుంకాన్ని 5 శాతానికి పరిమితం చేస్తున్నట్టుగా సీబీఈసీ వెల్లడించింది. దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల దేశంలో తయారయ్యే ఎల్ఈడీ, ఎల్‌సీడీ టీవీల విభాగాన్ని ఎంతో ప్రోత్సహించినట్లవుతోందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గత నెల ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీ ప్యానెల్స్‌పై విధిస్తున్న దిగుమతి సుంకాన్ని రెట్టింపు చేసిన విషయం తెలిసిందే. గతంలో 7.5శాతంగా ఉన్న కస్టమ్స్ డ్యూటీని ప్రభుత్వం 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు ఆ సుంకాన్ని 5శాతానికి చేర్చింది. దీంతో ఈ టీవీల ధరలు దిగిరానున్నాయి.

మరింతగా పెరిగిన అపరంజి ధరలు

న్యూఢిల్లీ: అమెరికా మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధం క్రమంగా తీవ్రతరం అవుతున్న వేళ ప్రపంచ మార్కెట్లో పసిడి ధర పరుగులు పెడుతోంది. చైనాపై అమెరికా వాణిజ్య ఆంక్షల నేపథ్యంలో ఆయా దేశాలు వివిధ రూపాల్లో స్పందిస్తున్న వేళ.. మదుపరులు రక్షణాత్మక ధోరణిలో వ్యవహరిస్తూ బంగారంలో పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నారు దీంతో బంగారం ధర కొండెక్కుతోంది. మదుపరులకు తోడు వ్యాపారులు కూడా ట్రేడ్‌వార్ భయాలతో ముందస్తు కోనుగోళ్లకు దిగుతుండడంతో అపరంజి ధర శనివారం ఏడాది గరిష్టానికి చేరింది. దేశీయ మార్కెట్లో పసిడి ధర మరో రూ.85 పెరిగి 10 గ్రాములకు రూ.31,835కు చేరింది. అటు వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. రూ.50 పెరిగి కేజీ వెండి ధర రూ. 39,600లకు చేరింది. న్యూయార్క్‌లో శుక్రవారం నాటి మార్కెట్లో ఔన్సు బంగారం ధర 1.37శాతం పెరిగి 1,346.80డాలర్లు.. వెండి కూడా 1.13 శాతం పెరిగి ఔన్సు ధర 16.53 డాలర్లు పలికింది.

28,00,000 కోట్ల నష్టం..

- జనవరి నుంచి మేటి కుబేరుల నష్టమిది..
- ప్రతికూలతతో భారీగా సంపద ఆవిరి
- అత్యధికంగా నష్టపోయిన జుకర్‌బర్గ్
- బ్లూమ్‌బర్గ్ సూచీలో 7 స్థానానికి చేరిక



న్యూయార్క్: అమెరికా కేంద్రంగా విస్తరిస్తున్న వాణిజ్య యుద్ధ ప్రకంపనలకు తోడు అంతర్జాతీయంగా పెరుగుతున్న ప్రతికూలతల నేపథ్యంలో ప్రధాన ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. వరుస పరిణామాల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు కుంగడంతో సంపన్నుల సంపద లక్షల కోట్లల్లో ఆవిరైపోతోంది. ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటి వరకు టాప్ 500 ప్రపంచ కుబేరులు దాదాపు 436 బిలియన్ డాలర్ల మేర సంపదను నష్టపోయారు. అంటే భారత కరెన్సీలో ఇది దాదాపు రూ. 28.33 లక్షల కోట్లకు పైమాటే అన్నట్టు.. కేవలం ప్రస్తుత ట్రేడింగ్ వారంలోనే 500మంది కుబేరుల సంపద 181 బిలియన్ డాలర్ల ఆవిరైపోయింది. అత్యధికంగా సంపదను నష్టపోయిన వారిలో సోషల్ మీడియా సంస్థ ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ ముందు వరుసలో ఉన్నారు. జనవరి 26 నుంచి జుకర్‌బర్గ్ దాదాపు 10.3 బిలియన్ డాలర్ల సంపదను కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలో జుకర్‌బర్గ్ 4వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయింది. ఆ తరువాత స్థానంలో ఒరాకిల్ కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ దాదాపు 7 బిలియన్ డాలర్ల మేర సంపదను నష్టపోయారు. బెర్క్‌షైర్ హాత్‌వే చైర్మెన్ వారెన్ బఫెట్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఆల్ఫాబెట్ సంస్థ సీఈవో ల్యారీ పేజ్‌లు సంయుక్తంగా 17 బిలియన్ డాలర్లు కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ సూచీ ప్రకారం 500 ప్రపంచ కుబేరుల మొత్తం సంపద 5.2 ట్రిలియన్ డాలర్లకు జారింది. ఈ ఏడాది ఆరంభం నుంచి అమెరికా మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయి. ఫిబ్రవరిలో క్రెడిట్ రేటింగ్ పెంచడంతో అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి దీంతో సంపన్నుల స్టాక్స్ కుదేలవుతూ వస్తున్నాయి. ఇక గత కొన్ని రోజులుగా ఫేస్‌బుక్ డేటా దుర్వినియోగం ఆరోపణల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వీటి ప్రభావంతో సంపన్నుల సంపద కరిగిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు.

75 బిలియన్ డాలర్లకు క్షీణత..

సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ యూజర్ల సమాచారాన్ని అమ్మేస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థ షేరు దాదాపు 14 శాతం మేర కుంగింది. కేవలం గత వారం రోజుల వ్యవధిలోనే సంస్థ షేర్లు 13 శాతం మేర జారింది. 160 డాలర్ల స్థాయిని చేరుకుంది. ఈ వారంలోనే ఫేస్‌బుక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా 75 బిలియన్ డాలర్ల మేర క్షీణించింది. ఫేస్‌బుక్ సంస్థ యూజర్ల సమాచారాన్ని అమ్మేస్తుందన్న ఆరోపణలు.. దాదాపు ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాల సమాచారం అమెరికా అధ్యక్ష ఎన్నికల కోసం పనిచేసే కేంబ్రిడ్జ్ అనలిటికాకు చిక్కినప్పటికీ ఆ సంస్థ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణల నేపథ్యంలో ఫేస్‌బుక్ సంస్థ స్టాక్ ఇంకా నష్టాల్లోనే కొనసాగుతోంది.

నీరవ్ ఆస్తులపై సీబీఐ పంజా..

- తాజాగా మరో దఫా సోదాలు
- రూ.10 కోట్ల వజ్రపు ఉంగరం విలువైన డైమండ్ వాచీలు సీజ్
- రూ.7600 కోట్లకు చేరిన ఎటాచ్




ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) స్కామ్ కేసులో ప్రధాన నిందితుడు వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఆస్తులపై దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ మరోసారి తాజాగా దాడులు నిర్వహించాయి. ఈ సందర్భంగా కండ్లు చెదిరే వజ్రాల ఆభరణాలు, విలువైన గడియారాలు, ఎంఎఫ్ హుస్సేన్ సహా ప్రముఖులు గీసిన విలువైన పెయింటింగ్స్‌ను అధికారులు సీజ్ చేశారు. తాజా దాడుల్లో రూ.26కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టుగా దర్యాప్తు వర్గాల ద్వారా తెలుస్తోంది. ముంబైలోని విలాసవంతమైన నివాస ప్రాంతాల్లో ఒకటైన సముద్ర మహల్‌లో నీరవ్‌మోదీకి చెందిన భవనాల్లో ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన సోదాల్లో భారీగా ఆస్తులను సీబీఐ, ఈడీ సీజ్ చేశాయి. రూ.15కోట్ల విలువైన వజ్రాల నగలు, డైమండ్లు పొదిగిన రూ. 1.40 కోట్ల విలువైన వాచీలు, రూ.10 కోట్ల వరకు విలువైన ఎంఫ్ హుస్సేన్, హెబ్బార్, అమ్రితా షెర్గిల్‌లు గీసిన పెయింటింగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న సొత్తులో రూ.10 కోట్ల విలువైన ఒక వజ్రపు ఉంగరం ఉన్నట్టుగా సమాచారం. దీంతో ఇప్పటివరకు ఈడీ ఎటాచ్ చేసిన మొత్తం ఆస్తులు విలువ రూ. 7600 కోట్లకు చేరింది. దేశంలో అతపెద్ద బ్యాంకింగ్ స్కామ్‌గా నిలిచిన పీఎన్‌బీ స్కాంలో కీలక నిందితులుగా నీరవ్ మోదీ,ఆయన మామ, మెహుల్ చోక్సీ తదితరులు దేశం దాటేసినప్పటికీ ఇప్పటికే వారిపై మనీలాండరింగ్ కేసులు నమోదైన సంగతి తెలిసిందే.

ఆ బ్యాంకుల విలీన ప్రతిపాదన లేదు!



న్యూఢిల్లీ: ప్రభుత్వ త్వరలో నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేయనున్నట్టుగా వస్తున్న వార్తలను ప్రభుత్వం తోసిపుచ్చింది. సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌లను విలీనం చేసే యోచనేది తమకు లేదని సర్కారు తెలిపింది. ఈ నాలుగు బ్యాంకులు విలీనం కోసం ప్రభుత్వానికి ఎటువంటి అర్జీ పెట్టుకోవడంగానీ.. నివేదకలను వెల్లడించడం గానీ చేయలేదని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభకు ఇచ్చిన ఒక లిఖిత పూర్వ సమాధానంలో తెలిపారు. గత ఏడాది స్టేట్ బ్యాంక్‌కు చెందిన అయిదు అనుబంధ బ్యాంకులతోత సహా భారతీయ మహిళా బ్యాంకుల్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో విలీనం చేసిన నేపథ్యంలో.. మిగతా బ్యాంకుల విలీనంపై కూడా ఊహగానాలు సాగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ తరువా సిండికేట్ బ్యాంక్‌లో కెనరా బ్యాంక్, విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనం ఉండనున్నట్టుగా బ్యాంకింగ్ వర్గాల్లో చర్చ జరుగుతూ వస్తోంది. సర్కారు తాజా వివరణతో ఈ ఊహాగానాలకు తాత్కాలికంగా తెరపడినట్టయింది.

ఆరు బిల్లులకు శాసనసభ ఆమోదం

అసైన్డ్ ల్యాండ్ చట్టానికి సవరణ బిల్లుపై చర్చ

నవ తెలంగాణబ్యూరో-హైదరాబాద్

శాసనసభ ఆరు బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణ బిల్లు, పీజీ వైద్య విద్యార్థుల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ అడ్వకేట్స్, క్లర్క్స్, వెల్ఫేర్ ఫండ్ చట్ట సవరణ బిల్లు, పదోవ తరగతి వరకు తెలుగు బోధన, అధ్యయన నిర్బంధ చట్ట బిల్లులకు శాసనసభ సభ ఆమోదించింది. తెలుగు ఈ విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రకటించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి, ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి నుంచి తెలుగు భాషను అమలులోకి వస్తుందని వివరించారు. అందులో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణ బిల్లుపై స్వల్పంగా చర్చ జరిగింది. అనంతరం శాసనసబబ ఆమోదించింది. ఈ బిల్లు దుర్మార్గమైందని, దళిత, గిరిజనులు, పేదలకు వ్యతిరేకమైందని సీపీఐ(ఎం) పేర్కొంది. ఈ బిల్లును టీడీపీ వ్యతిరేకించింది. స్పష్టత లేదని బీజేపీ విమర్శించింది. అసైన్డ్ ల్యాండ్ చట్ట సవరణ బిల్లును ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ శనివారం శాసనసభలో ప్రవేశపెట్టారు. టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ధనవంతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లాభం కలిగించే ప్రమాదకరమైన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. దళితుల నుంచి ఇతరులకు సంక్రమించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. భూములను రెగ్యులరైజ్ చేసుకుంటూ పోతే దళితులకు పేదలకు ఎక్కడి నుంచి ఇస్తారని నిలదీశారు.

దుర్మార్గమైన బిల్లు: సున్నం

అసైన్డ్ ల్యాండ్ బిల్లు దుర్మార్గమైందని సిపిఎం పక్షనేత సున్నం రాజయ్య తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ బిల్లు కారణంగా దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. వ్యాపారులకు లాభం కలుగుతుందన్నారు. ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు.

ముచ్చర్ల ఫార్మా సిటీని అడ్డుకుంటాం : బీజేపీ

ముచ్చర్లలో ఏర్పాటు చేయనున్న ఫార్మా సిటీని అడ్డుకుని తీరుతామని బీజేపీ సభ్యులు చెప్పారు. ఫార్మా సిటీ ఏర్పాటు వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు.

రాజకీయాల్లో అన్నీ సాధ్యమే.. :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాజకీయాల్లో అన్నీ సాధ్యమే.. ఏమైనా జరుగొచ్చు.. రేపు మీరే అధికారంలోకి రావొచ్చు.. మేము ప్రతిపక్షంలో కూర్చొవచ్చు.. అని శాసనసభలో కిషన్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ అన్నారు. ముచ్చర్ల ఫార్మాసిటీపై బీజేపీ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. దీనికి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తాము గతంలో ఎప్పుడూ అధికారంలో లేమని, కేంద్రంలోనే అధికారంలో ఉన్నామని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ గతంలో మీరు.. మీరు అంటూ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత మీరు ప్రతిపక్షంలో కూర్చున్నప్పుడు తమ గురించి మాట్లాడితే బాగుంటుందని కిషన్‌రెడ్డి అన్నారు. రాజకీయాల్లో అన్నీ సాధ్యం అవుతాయని, మీరు కూడా అధికారంలోకి వస్తారని మంత్రి చమత్కరించారు.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి..

- అసెంబ్లీలో సున్నం రాజయ్య వాయిదా తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని.. ఇందుకనుగుణంగా రాష్ట్రంలో ఒక చట్టం చేయాలని శాసనసభలో సీపీఐ (ఎం) సభ్యుడు సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సభలో వాయిదా తీర్మానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీలకు ప్రయివేటు రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించటం లేదని తెలిపారు. ఫలితంగా వారు ఆర్థికంగా ఎదగలేకపోతున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగం నానాటికీ కుంచించుకుపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అప్పుడే ఆయా సామాజిక వర్గాలకు ప్రయివేటు రంగంలో అవకాశాలు దక్కుతాయని తెలిపారు. ఈ అంశంపై చొరవ తీసుకుని.. ప్రత్యేక చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

ప్రశంసలు తప్ప.. పైసా సాయం లేదు

కేంద్రంపై మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- సిర్పూర్ మిల్లు తెరిపిస్తున్నాం
- అంబేద్కర్ జయంతిన దళిత పారిశ్రామికవేత్తలకు రాయితీలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రశంసించడమే తప్ప కేంద్ర ప్రభుత్వం నయా పైసా చేయడం లేదని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి కోసం తాము చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి కేంద్ర మంత్రులు రాష్ట్రానికి వచ్చి ప్రశంసిస్తున్నారే కానీ.. నిధులను మాత్రం సమకూర్చడం లేదన్నారు.

ఐటిఐఆర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 3650 కోట్లు సమకూర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామన్నారు. కానీ రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. శాసనసభలో శనివారం పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా ముచ్చర్ల ఫార్మా సిటి ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని, అక్కడి ప్రజలకు కలిగే ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు చెప్పి అడ్డుకుంటామని బీజేపీ సభ్యులు ప్రకటించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై, రాష్ట్ర బీజేపీ నేతలపై విమర్శలు కురిపించారు. 4 లక్షల మందికి ఉపాధి కల్పించే ముచ్చర్ల ఫార్మా సిటీని అడ్డుకుంటారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 14 దేశాల్లో అధ్యయనం చేశామన్నారు. ఫార్మా సిటీ వల్ల పర్యావరణంతో పాటు ప్రజలకు ముప్పు వాటిల్లకుండా ఫార్మా సిటి ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. దీన్ని ప్రశంసించేది పోయి కేంద్రంతో చెప్పి అడ్డుకుంటామంటారా.? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మందికి ఉపాధి కల్పించేదిశగా తాము ముందుకు సాగుతుంటే అభినందించాల్సింది పోయి విమర్శిస్తారా? అని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తాము పాటుపడుతున్నామని, 13 కంపెనీలను మూసి వేయించామని, హైదరాబాద్‌లో ఉన్న 100 పరిశ్రమలను మూడు నెలల్లో బయటకు తరలిస్తామని వెల్లడించారు. రాష్ట్ర విభజన హామీల్లో ప్రధానమైన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్రమంత్రులను కలిసి విజ్ఞప్తి చేసినా స్పందించలేదన్నారు. ఉక్కులేని విశాఖకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బైలా జిల్లా నుంచి సుమారు 500 కిలీ మీటర్ల దూరం నుంచి ఉక్కు సరఫరా చేసి పరిశ్రమను నడిపిస్తున్న కేంద్రం, బయ్యారంలో పుష్కలంగా ఉక్కు ఉన్నా ఎందుకివ్వరని నిలదీశారు. రాష్ట్ర విభజన చట్టంలో కూడా బయ్యారంకు ఉక్కు పరిశ్రమ ఇస్తామనీ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేవారు. మీకు చేతనైతే.. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెచ్చి ఆ ఘనత మాదేనని చెప్పుకోండి కానీ.. అభివృద్ధి నిరోధకులుగా మారి మోకాలడ్డొద్దని బీజేపీ సభ్యులకు సూచించారు. టెక్స్‌టైల్స్ పార్కుపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కలిసి సాయం కోరినా.. ఇప్పటివరకూ స్పందన లేదన్నారు. 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామని జబ్బలు చరుచుకోవడం తప్ప మీరు చేసిందేమీటని రాష్ట్రానికి చేసింది ఏమిటని ప్రశ్నించారు. మూతపడిన బీమా సిమెంట్ కంపెనీని తెరిపించామన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు, బిల్ట్ పరిశ్రమ పునరుద్ధరణకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో 46 వేల ఎకరాల్లో 53 ఇండస్ట్రీయల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. కేంద్రం సహకరించకున్నా.. ఐటీ పరిశ్రమను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 200 కంపెనీలు వచ్చాయని, వీటిల్లో 1.50 లక్షల మందికి ఉపాధి కలిగిందన్నారు. ఏప్రిల్ 4న అంబేద్కర్ జయంతిన దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తలకు రూ. 105 కోట్ల రాయితీలు అందిస్తామని ప్రకటించారు.

చిన్న పరిశ్రమలను వేధిస్తున్నారు

నీరవ్ మోడీ లాంటి పెద్ద పారిశ్రామిక వేత్తలు దేశాన్ని విడిచి పారిపోతున్నా పట్టించుకోని బ్యాంకర్లు, చిన్న పరిశ్రమల వారిని రుణాలు చెల్లించాలని వేధిస్తున్నారని కెటిఆర్ ఆరోపించారు. ఈ కారణంగా చిన్న పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. వీటి కోసం 'సర్ఫేజ్ యాక్ట్' మార్చాలని నాటి ఆర్‌బీఐ గవర్నర్ రఘురాం రాజన్, ప్రస్తుత గవర్నర్ ఉర్జిత్‌పటేల్‌ను కలిసినా.. పట్టించుకోలేదన్నారు. రైతు రుణమాఫీకి అనుమతివ్వాలని ఆర్‌బీఐని పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. బ్యాంకులను వేల కోట్ల రూపాయలు ముంచిన నీరవ్‌మోడీ, విజయ్ మాల్యాను వదిలేసి, చిన్న తరహా పరిశ్రమలు బ్యాంకులనుంచి రుణం తీసుకున్న దానికి ఒక్క నెల వాయిదా చెల్లించకున్నా ఆయా పరిశ్రమలను సిక్ పరిశ్రమలుగా గుర్తిస్తున్నారని విమర్శించారు.

తాగి ఇంట్లో పడుకోమన్నాం: హోంమంత్రి నాయిని

తాగి ఇంట్లో పడుకోమన్నాము కానీ, బండి నడిపించాలని తాము చెప్పామా.? అని హోంమంత్రి నాయని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. పబ్‌లకు అనుమతిచ్చి తాగమని చెప్పి మళ్లీ.. డ్రంక్‌డ్రైవ్ చేయడమేమిటని టీడీపీ సభ్యుడు సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించడంతో ఆయన పై విధంగా స్పందించారు. ఇక్కడ పెండ్లి చేసుకొని, అమెరికాకు పారిపోయి ఇంకో పెండ్లి చేసుకుంటే.. నేనేం చేస్తా అని వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలను పోలీసులు సమర్థవంతంగా కాపాడుతున్నారని ఆయన కితాబిచ్చారు. వారికి అందించిన ఆధునిక వాహనాపై ఉన్న 'జిల్ జిల్ లైట్ల'ను చూసి గూండాలు, రౌడీల గుండెల్లో గుబులు పుట్టి పారిపోతున్నారని చెప్పారు. అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో దొంగతనాలు జరగడం లేదన్నారు.

87వేల ఎకరాల భూములు; ఇంద్రకరణ్‌రెడ్డి

రాష్ట్రంలో 12302 దేవాలయాలున్నాయని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. దేవాలయాలకు 87 వేల ఎకరాల భూములున్నాయని చెప్పారు. భూ ఆక్రమణలకు సంబంధించి 1146 కేసులున్నాయన్నారు. ఆక్రమణలకు గురైన దేవాలయాల భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. అటవీశాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని చించోలిలో రూ. 1.50 కోట్లలో కోతులకు పునరావాసం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. కోతుల కోసం అడవుల్లో పండ్ల చెట్లను పెంచుతున్నామని ఆయన తెలిపారు.

డాక్టర్ల కొరత వాస్తవమే...

570 పోస్టులు త్వరలోనే భర్తీ చేస్తాం: మండలిలో మంత్రి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ప్రభుత్వ దవాఖానాల్లో డాక్టర్ల కొరత వాస్తవమేనని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి లక్ష్మారెడ్డి అంగీకరించారు. 570 డాక్టర్ పోస్టులు మంజూరయ్యాయని, త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. శనివారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో టీఆర్ఎస్ సభ్యుడు పాతూరి సుధాకర్‌రెడ్డి లేవనెత్తారు. ఏడాది కాలంగా సిద్ధిపేట జిల్లా కోహెడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు లేరని చెప్పారు. వైద్యుడు లేకుండా సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. అదే ఆస్పత్రిలో 11 ప్రసవాలు జరిగితే ఐదు మందికే కేసీఆర్ కిట్ ఇచ్చారని, ఆరు మందికి ఇవ్వలేదని అన్నారు. 280 మంది జన్మిస్తే, 220 మంది చనిపోయారని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారని చెప్పారు. తక్షణమే వైద్యుడిని నియమించాలని కోరారు. మంత్రి లక్ష్మారెడ్డి సమాధానమిస్తూ... ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు జరిగితే కేసీఆర్ కిట్ వర్తిస్తుందని చెప్పారు. అది రెండు కాన్పుల వరకే ఇస్తారని, మూడో కాన్పు నుంచి ఇవ్వబోరని స్పష్టం చేశారు. 280 మంది జన్మిస్తే 220 మంది మరణించారని చెప్పడం అవాస్తవమని, తప్పుడు సమాచారం అయి ఉంటుందని, శిశు మరణాలపై నివేదిక తెప్పించుకొని పరిశీలిస్తామని అన్నారు.

దేవాదాయ భూములు 74,155 ఎకరాలు : ఇంద్రకరణ్‌రెడ్డి



రాష్ట్రంలో దేవాదాయ భూములు 74,155 ఎకరాలున్నట్టు భూరికార్డుల ప్రక్షాళన ద్వారా రెవెన్యూ శాఖ తేల్చిందని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. భూరికా ర్డుల వివరాలు కంప్యూటరైజ్డ్ అవుతాయని, భూములు అన్యాక్రాంతమైతే ఎవరి వద్ద ఉన్నా స్వాధీనం చేసుకుంటా మని స్పష్టం చేశారు. అర్చకులకు ట్రెజరీ ద్వారా జీతాలివ్వ డం సాధ్యం కాదన్నారు. రిజర్వేషన్లు పాటిస్తేనే 010 పద్దు కింద జీతాలిచ్చేందుకు అవకాశముంటుందని చెప్పారు. 1,805 దేవాలయాలకు దూపదీప నైవేద్యం పథకం అమలవుతోందని, కొత్తగా మరో మూడు వేల దేవాలయా లకు వర్తింపచేస్తున్నామని అన్నారు.

స్పోర్ట్స్ కోటాలో అక్రమాలపై విచారణ : పద్మారావు



రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంబీబీఎస్ సీట్లను అక్రమంగా పొందారనే విషయంలో విచారణ కమిటీ వేశా మని మంత్రి పద్మారావు చెప్పారు. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 1993,1999, 2009లో కాంట్రాక్టు కోచ్‌లు పనిచేస్తున్నారని అన్నారు. వారిని రెగ్యుల రైజ్ చేసే ఆలోచన ఉందని చెప్పారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడు తున్న క్రీడాకారిణి అరుణరెడ్డి కోచ్‌కు వైద్య సాయంతోపాటు



రూ.25 లక్షల ఆర్థిక సాయం అందిస్తామన్నారు.


కల్తీపై కఠినంగా వ్యవహరిస్తాం : లక్ష్మారెడ్డి

కల్తీ ఆహారంపై కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. ఆహారం కల్తీ పట్ల ప్రజల్లో కొన్ని అపోహలున్నాయని అన్నారు. కల్తీ జరుగుతున్న మాట వాస్తవమేనని, ప్రతిదాంట్లోనూ కల్తీ జరగడం లేదన్నారు. కల్తీని అరికట్టేందుకు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను అందు బాటులోకి తీసుకొచ్చామని అన్నారు. కార్బైడ్ ద్వారా పండ్ల ను మాగబెట్టే విషయంలో అందరిలోనూ అవగాహన పెరిగిందని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ కేంద్రం పరిధిలో ఉందని, అది బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. వ్యాపారులు, వినియోగదారులకు ఈ చట్టం పట్ల అవగాహన పెంపొందిస్తామని అన్నారు.

హైదరాబాద్‌లో 17 బస్తీ దవాఖానాలు


హైదరాబాద్‌లో 17 బస్తీ దవాఖానాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి లక్ష్మారెడ్డి చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో మురికివాడల్లో మొత్తం 45 బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. వాటిలో ఉచితంగానే సేవలు అందిస్తామని అన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌లుగా 90 చెరువులు : హరీశ్‌రావు



రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 90 చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా ఆధునీకరించాలని నిర్ణయించామని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇప్పటికే జీహెచ్ఎంసీ పరిధిలో 63 చెరువులను రూ.94 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఇంకా 20 చెరువులను రూ.287 కోట్లతో సుందరీకరిస్తామని చెప్పారు.

నిటి ఆయోగ్ చెప్పినా కేంద్రం పైసా ఇవ్వలేదు : ఈటల



మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు బాగున్నాయని నిటి ఆయోగ్ ప్రశంసించిందని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మిషన్ భగీరథకు రూ.19,205 కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్లు ఇవ్వాలని నిటి ఆయోగ్ సిఫార్సు చెసినా కేంద్రం ఒక్క పైసా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. 14వ ఆర్థిక సంఘం 2020, మార్చి 31 నాటికి గడువు ముగుస్తుందని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం 2020, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ఐదేండ్లపాటు ఉంటుందని చెప్పారు. విద్యావైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్లు వంటి శాఖలపై కేంద్రం పెత్తనం ఎందుకుండాలని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు అమలు చేసేది రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు ప్రగతి ముందంజలో ఉన్నాయని చెప్పారు. విద్యపై సెస్ విధించారని అన్నారు. నిధుల కేటాయింపులో వెనుకబాటుతనం, జనాభా, మాతా, శిశుమరణాల రేటు మాత్రమే ప్రామాణికం కాకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆయా రాష్ట్రాల అవసరాలను పరిగణనలోకి తీసుకొని కేంద్రం ప్రోత్సహించాలని కోరారు.

జోష్
నవతెలంగాణ

ఆలోచన లోచన (Open Think Forum)
Public group

Open Think Forum



ఆలోచనకు సలామ్

ఫేస్‌బుక్ అంటే... కేవలం చాటింగ్, షేరింగ్ అని కొందరనుకుంటారు. టైం వేస్ట్, చెత్తరాతలు, పిచ్చికూతలు అని మరి కొందరంటారు. 'పుర్రెకో బుద్ధి జిహ్వాకో రుచి' అన్న నానుడిని నిజం చేస్తూ. 'వేయి పూలు వికసించనీ లక్ష మెదళ్లు ఆలోచించనీ' అంటారు ఫేస్‌బుక్‌లో ఓ గ్రూప్ సభ్యులు. 'పరుగులు తీసే ప్రపంచంలో ప్రశ్నలు వర్షం కురవనీ' అంటూ ఉత్తేజం నింపుతారు. వారు రాసే రాతలు గ్రూప్‌నకే పరిమితం కావు. పోస్టులు షేర్‌చేసి వదిలేయరు. సామాజిక స్పృహతో స్పందిస్తారు. నిర్భయంగా ప్రశ్నిస్తారు. ధైర్యంతో చర్చిస్తారు. పెద్ద మనస్సుతో సాయం చేస్తారు. భావాలు పంచుకోవడానికి, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చించడానికి ఏటా ఓ చోట సమావేశమవుతారు. ప్రతీ సమావేశానికి ఓ ప్రాధాన్యత ఉంటుంది. ఐదేండ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కలుసుకుంటున్న ఆ గ్రూప్ సభ్యులు ఇటీవల నెల్లూరు సెజ్ ఏరియాలో పర్యటించారు. పచ్చని పొలాల తో ఉండే నెల్లూరు లో పారిశ్రామిక అభివృద్ధి పేరా జరుగుతున్న ప్రయోగ ఫలితాలను కళ్లారా చూసి, బయటకు తెలియజేశారు. మళ్లీ నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కలవబోతున్నారు. సోషల్ మీడియా, రాజ్యాంగం, అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నారు. ఆశ్చర్యంగా ఉంది కదూ..! రెండు రాష్ట్రాల నుంచి ఫేస్‌బుక్‌లో పరిచయమైన మిత్రులంతా ఓ బృందంగా ఏర్పడి సమకాలీన అంశాలపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ గ్రూప్ సభ్యులు నిర్వహించే ప్రతీ సమావేశానికి ఓ ప్రాధాన్యత ఉంటుంది. ఆ గ్రూప్ పేరు 'ఓపెన్ థింక్ ఫోరమ్ (ఆలోచన-లోచన)'. సామాజిక, సమకాలీన, రాజకీయ చర్చలకు సోషల్ మీడియాలో వేదికవుతున్న ఓటీఎఫ్ గ్రూప్‌పై సక్సెస్‌స్టోరీ

విజ్ఞాన సాగరమథనంలో వికసించిన పుష్పమే...ఈ ముఖ పుస్తకం. 'ఎవరి మనసులో ఏముందో తెలుసుకోటం బ్రహ్మతరం కూడా కాదు' అనేవారు ఒకప్పుడు కానీ ఇప్పుడు ఎవరి మనసులో ఏముందో ప్రేమ, కోపం, తాపం, ఆవేశం, నినాదాలు, విధానాలు తెలియజేయడానికి విశాలవేదికవు తోంది ఈ ముఖపుస్తకం. ఎవరి భావాలు వారికుంటాయి, ఎవరి ఆలోచనా విధానం వారికుంటుంది దానిని ఎవరూ కాదనలేరు. ఎవరి అభిప్రాయాలను వారు స్వేచ్ఛగా షేర్ చేసుకోవడానికి ఫేస్‌బుక్ ఓ వేదిక. దీనిని పాజిటీవ్ వేదికగా మల్చుకుని ఎన్నో చర్చలకు, విశ్లేషణలకు, సలహాలకు వేదికవుతూ 40వేల మంది గ్రూప్ సభ్యులతో ముందుకు సాగుతోంది ఓటీఎఫ్. ఈ గ్రూప్‌లో ఎవరైనా తమ అభిప్రాయాలను పంచుకోవచ్చు. కుల, మత తేడాలు లేకుండా అన్ని అంశాలను చర్చించవచ్చు. విద్యార్థులు, లెక్చరర్లు, సామాజిక వేత్తలు, కార్మికులు, మేధావులు, విశ్లేషకులు ఒకే చోట కలిసి జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ అంశాలపై చర్చలు సాగిస్తారు. గ్రూప్ సభ్యులు కూడా అంశంపై తమ తమ అభిప్రాయాలను వ్యక్త పరుస్తుంటారు. ఈ చర్చలు, వాదనలు సామన్య గ్రూప్ సభ్యులను ఆలోచింప జేయాలన్నదే వారి లక్ష్యం. దేన్నైనా గుడ్డిగా నమ్మకుండా లోతైన విశ్లేషణ జరిగి, అందరూ నిజా నిజాలు తెలుసుకుని ముందుకు సాగాలన్నదే వారి ఉద్దేశ్యం.

> **ఏ రాజ్యం లో అయితే ప్రజల గొంతుక మూగబోతుందో అక్కడే ఆలోచనా మొదలవుతుంది. ఆ ఆలోచనలను అందరి మధ్యలోకి తీసుకువచ్చి వివిధ ఆలోచనల మధ్య ఘర్షణల నుంచి కొత్త ఆలోచనలను బయటకి తీసుకురావడానికి వేదికలు అవసరం.**

ఓటీఎఫ్ చేసిందేంటి?

ఎదుటి మనిషి ఆపదలో ఉంటే మనిషిగా మనం స్పందించాలి. అభాగ్యులకు అండగా నిలవాలి. తోడు లేని వారికి నీడనవ్వాలి. ప్రశ్నలకు వేదిక వ్వాలి. ఇది ఓటీఎఫ్ నినాదం. అదే 'వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్'. విశాఖపట్నానికి చెందిన గ్రూప్ సభ్యుని ఇంటికి రోజూ పాలమ్ముకోవడానికి వచ్చే ఓ అబ్బాయి నాలుగేండ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అది సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గ్రూప్ సభ్యులు స్పందించి బాలుని కుటుంబీకులను కలిసి, ఆర్థిక సాయం అందించాలను కున్నారు. అదే విషయాన్ని గ్రూప్‌లో పోస్టు చేశారు. అడ్మిన్లు, సభ్యుల నుంచి విరాళాలు సేకరించి ఆ కుటుంబానికి ముప్పై వేల రూపాలను అందించారు. 2015 నూతన రాజధాని అమరావతి కోసం అక్కడి ప్రాంత రైతుల భూ ఆక్రమణ జరుగుతుంటే ప్రజల బాధల ను 'రాజధాని పర్యటన' ద్వారా వెలుగులోకి తెచ్చారు. 2015 నవంబర్‌లో భారీ వర్షాలకు నెల్లూరు నగరం చిగురుటాకులా వణికి పోయింది. వందలాది గ్రామాలు, కాలనీలు వరదనీటిలో మునిగిపోయాయి. పల్లెలో తిండి గింజలు దొరక్క ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటుంటే అక్కడి బాధితులకు ఆసరా గా తన వంతు సహాయాన్ని అందించారు. గ్రూప్ సభ్యుల డొనేషన్స్‌తో కాలనీ వాసులకు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఇంకా 2016లో విజయవాడ, హైదరాబాద్ లో సమావేశాలను ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించారు. సమాజ హితం కోసం ఇరు రాష్ట్రాల నలు మూలల నుంచి ఒకే వేదికపై తమ భావాలను పంచుకున్నారు. 2017 జూన్ పదకొండున సుమారు 60 మంది సభ్యులు నెల్లూర్ సెజ్ ఏరియాలో పర్య టించారు. పారి శ్రామిక అభివృద్ధి పేరుతో అక్కడ జరు గుతున్న అన్యాయన్ని సోషల్ మీడియా ద్వారా బయటకు తీశారు. వీళ్లంతా ఫేస్‌బుక్ ద్వారా పరిచయస్తులైన ఫ్రెండ్స్ మాత్రమే..

> **2015 నవంబర్‌లో భారీ వర్షాలకు నెల్లూరు నగరం చిగురుటాకులా వణికిపోయింది. వందలాది గ్రామాలు, కాలనీలు వరదనీటిలో మునిగిపోయాయి. పల్లెలో తిండి గింజలు దొరక్క ప్రజలు నానా అవస్థలు ఎదుర్కొంటుంటే అక్కడి బాధితులకు ఆసరా గా తమ వంతు సహాయాన్ని అందించారు.**

జర్నీ ఇలా....

వివిధ అంశాలపై చర్చించడానికి 'నిశిధి' చే సృజింపబడి అనేక ఆటుపోట్లుకు గురైనా అశేష జనవాహి నికి ఆవాసమై నలభై మైలు రాయిని దాటి ముందుకు పోతోంది ఆలోచన-లోచన గ్రూపు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు అడ్మిన్ల సారథ్యంలో ఈ గ్రూప్ నడుస్తోంది. ఏడాదికి ఒకటి, రెండు సార్లు గ్రూప్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేస్తారు. దీనికి ఇరు రాష్ట్రాల అడ్మిన్స్ అందరూ చర్చించి ఓ మ్యాప్ రెడీ చేస్తారు. ఏ అంశం మీద చర్చించాలి, ఎక్కడ పర్యటించాలి అనేది ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, వాటి ప్రభావం ఎక్కడా ఎక్కువ ఉంది తెలుసుకుని అక్కడ సమావేశం అవుతారు. ఈ షెడ్యూల్‌ను నెల రోజుల ముందు నుంచే గ్రూప్ ద్వారా అందరికీ తెలియ జేస్తారు. అక్టీవ్ మెంబర్స్ అభిప్రాయాలు, ఆలోచనలు సేకరిస్తారు. ఎవరెవరు హాజరవుతున్నారు, ఎంత మంది హాజరవుతు న్నారో ఓ జాబితా తయారు చేస్తారు. ఖరారు చేసుకున్న తేది రోజు గ్రూప్‌లో ఉండే సభ్యులు అడ్మిన్స్ చెప్పిన స్థలానికి చేరుకుంటారు.

– వినోద్ మామిడాల

ఆశ్చర్యం కలిగించింది



ఒకే భావాలున్నవ్యక్తులు ముఖ పుస్తకం ద్వారా ఒకే వేదిక మీదికి రావటం ఆశ్చర్యాన్ని కల్గించింది. హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించినప్పుడు సుమారు మూడు వందల మంది హాజర య్యారు. వాళ్లంతా ఒకరికొకరు పరిచయంలేని వారే. కేవలం ఫేస్‌బుక్ సమాచారంతో ఇరు రాష్ట్రాలనుంచి సభ్యులు రావటం ఊహించలేదు. అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాం. గ్రూప్ అక్టీవ్ మెంబర్స్ నుంచి సహకారం ఎక్కువ ఉంటుంది. అందరి చొరవతో ఇప్పటి వరకూ అన్ని సమావేశాలు విజయవంతంగా జరిగాయి.

-బలరాం, అడ్మిన్..

బార్డర్స్ లేవు..



ఏ రాజ్యం లో అయితే ప్రజల గొంతుక మూగబోతుందో అక్కడే ఆలోచనా మొదలవుతుంది. ఆ ఆలోచనలను అందరి మధ్యలోకి తీసుకువచ్చి వివిధ ఆలోచనల మధ్య ఘర్షణల నుంచి కొత్త ఆలోచ నలను బయటకి తీసుకురావటానికి ఉపయోగ పడుతున్న ఓపెన్ థింక్ ఫోరమ్ గ్రూప్ కి బార్డర్స్ లేవని ఎన్నో సార్లు నిరూపించుకుంది.గతంలో హైదరబాద్, అమరావతి, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరులో కలుసుకున్నాం. ఇప్పుడు హైదరాబాద్‌లో కలుసుకుంటు న్నాం. ఈ గ్రూప్ ఇంతింత ఎదిగి విశ్వమంతా కావాలని కోరుతున్న..

శ్రీ సుందర్, అడ్మిన్...







హైదరాబాద్‌లో

నేడు హైదరాబాద్‌లో

సోషల్ మీడియా – రాజ్యాంగ హక్కులు అనే అంశం పై ఈ సారి హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాల్‌లో ఈరోజు సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సెమినార్‌కు ఢిల్లీ నుంచి న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్తా ముఖ్యవక్తగా హాజరవుతున్నారు. సోషల్ మీడియా, ప్రస్తుత రాజకీయ, ఆర్థిక అంశాల పై అన్ని కోణాల నుంచి అనేక ఆలోచన మధ్య సెమినార్ కొనసాగుతుంది.

వహ్వా..వహ్వా

ఆరాధన



ఓ మనోహరి!
శృంగారరసఝరి!
నా గుండెల కొండల లోయలలో
పరుగులెత్తే....
జ్ఞాపకాల జలపాతం నీవు!
నా బతుకనెడు ప్రశ్నకు
సమాధానం నీవు!
నీ సౌందర్యమనెడు
సూర్యుడి ముందు
నే నొక ప్రొద్దుతిరుగుడుపూవునౌతాను!
నీ నయనాలనెడు
పౌర్ణమిచంద్రుల గని
నేనొక కడలినై ఉప్పొంగుతాను!!!

-రఘువర్మ, జగిత్యాల
సెల్:9290093933.

ప్రియతమా



నా ఊహల్లో నీ ఊసులు నింపుకుని
రాగాలు తీస్తున్న
నా ఆలోచనలో నీ ఆశలను నింపుకుని
ఆకలి మరిచిపోతున్న
నా చూపుల్లో నీ రూపు నింపుకుని
మేలిమాపుల నింగి రంగై మురిచిపోతున్న
నీ పలుకుల మధరిమ చెరలో
చూపుల సంకెళ్ళకు
బంధీ అయిన నన్ను
విడిపించి
నీ కౌగిలి సామ్రాజ్యానికి
రాణిగా ప్రకటించేది ఎప్పుడు ప్రియతమా

– అభిరామ్ 9704153642

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, కవితలు, జోకులు ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా సరే మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.
వాట్సాప్: 07660066469
e-mail :
navatelangana.josh@gmail.com


ఫన్.కాం

స్టూడెంట్.. టీచర్



మమ్మి: స్కూల్ నుంచి రావడం లేట్ అయిందేంటి ?
చింటు : స్కూల్ టీచర్ నిద్రపోతున్నాడు మమ్మి. అతను లేవటం లేటయింది
మమ్మి : టీచర్ నిద్రపోతుంటే నీకెందుకు లేట్ అయింది ?
చింటు : మరి మమ్మల్ని నిద్ర లేపాల్సింది టీచరే కదా మమ్మీ..

ఇంగ్లీష్ క్లాస్‌లో



టీచర్ : 'దేశాన్ని అవినీతి రహితంగా మారుస్తా' ఇది ఏ టెన్స్ చెప్పండి పిల్లలూ
స్టూడెంట్ : ఫ్యూచర్ ఇంపాసిబుల్ టెన్స్ టీచర్

భలే అల్లుడు



అత్త : అల్లుడు గారు. మీరు నాన్‌వెజ్ తింటారని పెండ్లికి ముందు ఎందుకు చెప్పలేదు.
అల్లుడు : అబ్బా ! మీ అమ్మాయి బ్రెయిన్ తింటుందని మీరు మాత్రం చెప్పారా ఏంటి ?

బంపర్ ఆఫర్



తండ్రి : చిన్నా నువ్వు పదో తరగతి పాసైతే సైకిల్ కొనిస్తా
చిన్నా: మరి ఫెయిల్ అయితే
తండ్రి : పది సైకిళ్లు కొనిస్తారా చిన్నా
చిన్నా : ఎందుకు నాన్న ?
తండ్రి : సైకిల్ షాప్ పెట్టుకోవడానికి

హేయ్... డ్యూడ్ వన్ మినిట్



ఉద్యోగం రాలేదనో, ప్రేమలో ఓడిపోయామనో, అనుకున్నది సాధించలేమనో ఇలాంటి కారణంతో తనువు చాలిస్తు న్నారు నేటి యువత. ఒక దారి మూసుకుంటే ఇంకోదారి ఉంటుంది. ఒకటి కాకపోతే మరొకటి అనే విధంగా ఉండాలి. ఈ మధ్య కాలంలో సెల్ఫీ వీడియోలు తీస్కుంటూ మరీ చనిపోతున్నారు. సూసైడ్‌కి ప్రధాన కారణం డిప్రెషన్ అనే చెప్పాలి. ఇదో మానసిక వ్యాధి. తీవ్రమైన నిరాశ, నిస్పృహలకులోను చేసి కుంగదీస్తుంది. 'ఇక జీవితం ఇంతే' అనుకునేలా చేస్తుంది. ఇలాంటి డిప్రెషన్ ఒక్కోసారి ఆత్మహత్యలకూ దారితీస్తుంది. దీన్ని అధిగమించాలి. ఒక్క సారి ఆలోచించాలి. జీవితంలో ప్రతి రోజూ ఒకేలా ఉండదు డ్యూడ్. 'దేర్ విల్ బీ ఏ డే ఫర్ యూ... నీపై నీకు నమ్మకం ఉంటే, అనుకున్న లక్ష్యం కోసం నీ ప్రయత్నం బలంగా ఉంటే ఏదో ఒక రోజు ఈ కాలం నీకు సలామ్ చేస్తుంది అంతే.. జీవితం అంటేనే సముద్రం. ఎన్నో ఆటుపోట్లు, సునామీలు, తుఫాన్లు అంతేనా టోర్నడోలు, సుడిగుండాలు ఎన్ని ఉండవు. జీవితమూ అంతే కష్టాలు, సుఖాలు, పడిపోవడాలు, లేవడాలు, విజయాలు, ఓటములు.. ఆట ఆడకుండానే గెలుపోటముల గురించి ఆలోచించలేం. ఓటమి అనుభవం లేనిదే గెలుపు మీద కసి పెంచుకోలేం డ్యూడ్. నువ్వు ఆట ఆడకుండానే వెనక్కి తగ్గుతానంటే ఎలా..?

నేటి కుటుంబాల ఆర్థిక సమస్యలు, బంధాలు, తమను ఆదుకునేవారు లేరనే అభద్రతా భావం, చెప్పేవారు లేకపోవడం, మానసిక వికాసం లేకపోవడం, ఒంటరిగా ఫీలవడం, వంటివి కొన్ని డేంజర్ సిచువేషన్స్. ప్రాబ్లమ్ చెప్పుకోవడానికి నీకో ఫ్రెండ్ లేడా.. కన్నీళ్లు తుడవడానికి అక్కయ్య, చెల్లెమ్మలు లేరా.. ఆదుకోవడానికి అన్నయ్య, భాద్యత నేర్పడానికి నాన్నా. ఇలా ఎంత మంది లేరు చెప్పు నీ సమస్యకు పరిష్కారం చూపడానికి.. స్నేహాలు, బంధాలు బంధుత్వాలు సంతోషాల కోసమే కాదు. బాధలు పంచుకోవడానికి కూడా ఉంటాయి కదా. చచ్చి సాధించేది ఏమీ లేదు. దుర్భర జీవితాలను గడిపి ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తుల చరిత్ర తెలుసుకోవాలి. మన బతుక్కు మనమే బాట వేసుకోవాలి. కష్టాలు, ఓటములు ఎదురవుతూనే ఉంటాయి. కాని ఒక్క సారి భయపడితే అక్కడే ఆగిపోతావు. ఒత్తిడి కల్గినప్పుడు మానసిక ప్రశాంతత కోసం అభిరుచులను పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవాలి. నాకే కష్టాలు, నాకే బాధలు అనుకుంటే బతకలేము.

మరణం గమ్యం కాదు. పుట్టడం, పెంచడం, ఎదగడం ఎంత కష్టమో తెలిస్తే అలాంటి చావు ఊహలు దగ్గరికి రావు. గర్భంలో ఉన్నప్పటి నుంచి తల్లి తన పిల్లల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటుంది, ఈ లోకంలో అడుగు పెట్టిన నాటి నుండి ఎదిగే క్రమంలో ప్రతి అడుగులో ఎంత అపురూపంగా పెంచుతుంది. తమకు ఏమీ లేకపోయినా ఉన్నదాంట్లో పిల్లలకు కావాల్సిన ఆహారం, ఆరోగ్యం అందిస్తుంది. ఇదంతా మరిచి వన్ మినట్ గ్యాప్‌లో నువ్వు తీసుకునే నిర్ణయాలు కంటికి రెప్పలా పెంచుకున్న నీ పేరెంట్స్‌ని ఎంత బాధిస్తాయి. ఇన్నాళ్లు నీతోనే ఉన్న నీ ప్రాణ స్నేహితులను ఎంతలా కలచి వేస్తాయి ? నువ్వేం తప్పు చేశావ్. బతికే అర్హత నీకెందుకు లేదు డ్యూడ్ ? నీ మీద నీవాళ్లు పెంచుకున్న ఆశలను, నీ భవిష్యత్తు గురించి కన్న కలలను నెరవేర్చకుండానే వెళ్లిపోతావా డ్యూడ్. వద్దు. Chase ur challeneg succes will follow you

– పుట్టి గిరిధర్,
9491493170



సాహా 20 బంతుల్లో 102

కోల్‌కత : మరో రెండు వారాల్లో ఐపీఎల్ ఆరంభం కాబోతున్న నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు తీపి కబురు!. ఆ జట్టు ఆటగాడు వృద్ధిమాన్ సాహా కోల్‌కత క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఓ టోర్నీలో కేవలం 20 బంతుల్లోనే శతకబాదాడు. 14 సిక్సర్లు, 4 ఫోర్లతో చెలరేగిన వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ సాహా 102 పరుగులు పిండుకున్నాడు. జె.సి ముఖర్జీ ట్రోఫీలో బి.ఎన్.ఆర్ నిర్దేశించిన 151 పరుగుల ఛేదనలో సాహా (102) విధ్వంసంతో మోహన్ బగన్ జట్టు 7 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది. మరో ఓపెనర్ సుభ్‌మయ్ దాస్ 22 బంతుల్లో 43 పరుగులు చేశాడు. వేలంలో రూ. 5 కోట్లతో సాహాను సన్‌రైజర్స్ దక్కించుకున్న సంగతి తెలిసిందే.



ఆధునిక క్రికెట్ మొనగాడు, అత్యుత్తమ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి. భారత కెప్టెన్ పరుగుల దాహం చూశాక క్రికెట్ దిగ్గజాల అభిప్రాయమిది. కానీ ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే!. మరో వైపు విరాట్‌ను అప్పుడే ఆకాశానికి ఎత్తేయటానికి వీల్లేదనే విమర్శలూ ఉన్నాయి. అందుకు గల ఏకైక కారణం.. ఇంగ్లాండ్‌లో కోహ్లి పేలవ ప్రదర్శన. ఆస్ట్రేలియా గడ్డపై 62 సగటుతో ఐదు సెంచరీలు సహా 992 పరుగులు బాదాడు. కివీస్ గడ్డపై 71.33 సగటుతో దుమ్మురేపాడు. దక్షిణాఫ్రికాలో 55.80 సగటుతో ఏకంగా 558 పరుగులు పిండుకున్నాడు. ఇంటా, బయటా అపూర్వ గణాంకాలు నమోదు చేశాడు.

కానీ ఇంగ్లీష్ నేలపైనే మనోడి రికార్డు అత్యంత పేలవం. ఐదు టెస్టుల్లో 13.40 సగటుతో కేవలం 134 పరుగులే కొట్టాడు. అక్కడ అత్యధిక స్కోరు 39 మాత్రమే.

ఈ ఏడాది జులైలో ఇంగ్లాండ్ పర్యటన నేపథ్యంలో కోహ్లి కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లీష్ గడ్డపై తడాఖా చూపించేందుకు ముందుగా కౌంటీల్లో అనుభవం గడించేందుకు రంగం సిద్ధం చేసుకున్నాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే టీమ్ ఇండియా అఫ్గాన్, ఐర్లాండ్‌లతో పోటీపడనుండగా.. కోహ్లి మాత్రం కౌంటీల్లో అనుభవం గడించనున్నాడు.

కౌంటీల్లో కోహ్లి

- ఇంగ్లాండ్ పర్యటన సన్నద్ధత వ్యూహం
- అఫ్గాన్‌తో చారిత్రక టెస్టుకు దూరం
- అనుమతించిన భారత క్రికెట్ బోర్డు

నవతెలంగాణ-ముంబయి

దక్షిణాఫ్రికా పర్యటన నేర్పిన పాఠాలను టీమ్ ఇండియాను సానుకూలంగా స్వీకరించినట్టే కనిపిస్తోంది. సఫారీ గడ్డపై 1-2తో టెస్టు సిరీస్ కోల్పోయిన భారత్, నిజానికి కాస్త ముందుగానే అక్కడికెళ్లి సాధన చేసి ఉంటే ఫలితం కచ్చితంగా భిన్నంగా ఉండేది. ఇదే విషయాన్ని బహిరంగంగా కాకపోయినా.. ఇంగ్లాండ్ పర్యటన సన్నద్ధత ప్రణాళికల్లో భాగంగా భారత జట్టు అంగీకరిస్తోంది. ఇంగ్లాండ్ నేలపైనా మనకు మంచి రికార్డు లేకపోవటం, అక్కడ నెగ్గితే వరల్డ్ నం.1 ర్యాంక్ గణాంకాల్లోనే కాదు వాస్తవికంగా ప్రపంచ క్రికెట్‌ను శాసించినట్టు క్రికెట్ పండితులు పరిగణించటం వంటి కారణాలు ముందస్తు సన్నద్ధతకు టీమ్ ఇండియాను ప్రేరేపిస్తున్నాయి. అందులో భాగంగానే భారత క్రికెట్ బోర్డు నుంచి అతిపెద్ద నిర్ణయం వెలువడింది. సూపర్‌స్టార్, పరుగుల యంత్రం విరాట్ కోహ్లి ఈ సీజన్‌లో కౌంటీల్లో ఆడేందుకు బీసీసీఐ అనుమతి ఇచ్చేసింది. ఈ మేరకు పాలకుల కమిటీ ఛైర్మెన్ వినోద్ రాయ్ వెల్లడించాడు. ఇప్పటికే ఐపీఎల్‌లో చోటు దక్కని చటేశ్వర్ పుజారా, ఇషాంత్ శర్మలు కౌంటీల్లో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ సైతం గత సీజన్‌లో కౌంటీల్లో అనుభవం గడించినోడే. ఈ కోవలో ప్రధాన ఆటగాడు విరాట్ కోహ్లి చేరబోతున్నాడు. ఐపీఎల్ 11వ సీజన్ ముగిసిన వెంటనే విరాట్ కోహ్లి కౌంటీల్లో ఆడేందుకు వెళ్లనున్నాడు. అయితే ఏ జట్టుకు ఆడతాడనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. కానీ గతంలో సర్రే కౌంటీ క్లబ్ నుంచి విరాట్ కోహ్లికి ఆఫర్లు వచ్చాయి. నిరుడు బీసీసీఐని అనుమతి సైతం అడిగారు. కానీ జాతీయ షెడ్యూల్ దృష్ట్యా బోర్డు నిరుడు అంగీకారం తెలుపలేదు. కానీ ఈ ఏడాది విరాట్ కోహ్లి సైతం కౌంటీల్లో ఆడేందుకు సానుకూలంగా ఉండటం, ఇంగ్లాండ్ పర్యటన నేపథ్యంలో అక్కడ అనుభవం జట్టుకు ఉపకరించనున్న నేపథ్యంలో బీసీసీఐ స్టార్ బ్యాట్స్‌మన్‌కు అనుమతి ఇచ్చింది.



'సన్నద్ధత సమయం ప్రత్యేకమైనది. ఏ జట్టుకైనా అది అత్యంత కీలకం. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు అక్కడ ఆడే అవకాశం నాకు లభిస్తే దాన్ని గొప్ప అవకాశంగా భావిస్తా. నిజానికి నేను కూడా కౌంటీల్లో ఆడే విషయమై ఆలోచన చేస్తున్నా. ఏ విధంగా సాధ్యపడుతుందనే కోణంలో ఆలోచిస్తున్నా. అవకాశం దొరికితే కచ్చితంగా అక్కడికెళతా, ఆడతా'

- ఇంగ్లాండ్‌పై చెన్నై టెస్టు (2016) విజయం అనంతరం విరాట్ కోహ్లి వ్యాఖ్యలు

అందరినీ సంప్రదించాకే!

పాలకుల కమిటీ ఛైర్మెన్ వినోద్ రాయ్ ఈ నిర్ణయాన్ని అంత తేలిగ్గా తీసుకోలేదని అర్థమవుతోంది. ఈ ప్రతిపాదన రాగానే భారత చీఫ్ కోచ్ రవిశాస్త్రితో పాటు భారత్-ఏ, అండర్-23, 19 కోచ్ రాహుల్ ద్రవిడ్‌లను సంప్రదించినట్టు తెలుస్తోంది. అఫ్గాన్‌తో స్వదేశంలో చారిత్రాత్మక టెస్టు, తర్వాత ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ ఉండగా.. కోహ్లికి కౌంటీలకు పంపించటంపై రాయ్ వారి అభిప్రాయాలను తీసుకున్నట్టు సమాచారం. బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రి, బోర్డు జనరల్ మేనేజర్ (క్రికెట్ వ్యవహారాలు) సబా కరీంల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకొని పాలకుల కమిటీ కౌంటీలకు కోహ్లిని అనుమతించింది.

రహానెకు పగ్గాలు?

అఫ్ఘనిస్థాన్‌తో బెంగళూర్‌లో జరిగే చారిత్రాత్మక టెస్టుకు విరాట్ కోహ్లి అందుబాటులో ఉండటం లేదు. దీంతో అజింక్య రహానెకు ఆ టెస్టులో సారథ్య బాధ్యతలు దక్కనున్నాయి. ఇక తర్వాత ఐర్లాండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల ఫార్మాట్ సిరీస్‌కు సైతం కోహ్లి అందుబాటులో ఉండడు. ఈ సిరీస్‌కు రోహిత్ శర్మ నాయకత్వం వహించనున్నాడు!.

భారత పతాకధారి సింధు!

- కామన్‌వెల్త్ భారత బృంద నాయకి
- తెలుగు తేజానికి అరుదైన గౌరవం



న్యూఢిల్లీ : అద్భుత ఆట తీరు, కండ్లుచెదిరే ప్రదర్శనతో బ్యాడ్మింటన్‌లో కొత్త రికార్డులు నెలకొల్పుతున్న తెలుగు తేజం, స్టార్ షట్లర్ పి.వి సింధుకు అరుదైన గౌరవం దక్కింది!. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్‌వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకల్లో పి.వి సింధు భారత బృంద పతాకధారిగా వ్యవహరించనున్నది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీలో సమావేశమైన భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఈ మేరకు నిర్ణయం తీసుకున్నదని సమాచారం. రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన పి.వి సింధు ఇటీవల ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో సెమీఫైనల్స్‌కు చేరుకున్నది. భారత బృందానికి నాయకురాలిగా పి.వి సింధునే ఐఓఏ ఖరారు చేసినట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. 2014 గ్లాస్గో కామన్‌వెల్త్‌లో కాంస్యం సాధించిన సింధు.. గోల్డ్‌కోస్ట్‌లో భారత్‌కు స్వర్ణం సాధించే రేసులో ముందంజలో ఉంది. ఇక కామన్‌వెల్త్ గేమ్స్ భారత పతాకధారిగా ఎంపిక కావటం సింధుకు దక్కని అరుదైన గౌరవం. గత మూడు కామన్‌వెల్త్ గేమ్స్ తర్వాత ఓ బ్యాడ్మింటన్ ప్లేయర్ భారత పతాకధారిగా నిలువబోతున్నది. 2006 మెల్‌బోర్న్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో ప్రస్తుత కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోర్ (ఏథేన్స్ ఒలింపిక్స్ షూటింగ్ సిల్వర్ మెడలిస్ట్), 2010లో స్టార్ షూటర్ అభినవ్ బింద్రా (బీజింగ్ ఒలింపిక్స్‌లో షూటింగ్ స్వర్ణం), 2014లో విజయ్ కుమార్ (లండన్ ఒలింపిక్స్ షూటింగ్ సిల్వర్ మెడల్)లు ఆరంభ వేడుకల్లో భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. వరుసగా మూడుసార్లు షూటర్లకు దక్కిన గౌరవం ఈ సారి ఓ బ్యాడ్మింటన్ క్రీడాకారిణికి దక్కటం విశేషం.

బెంగళూర్‌కు కోరే అండర్సన్



ముంబయి : గాయంతో బాధపడుతున్న దక్షిణాఫ్రికా స్పీడ్‌స్టర్ నాథన్ కౌల్టర్ నైల్ ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ కోరే అండర్సన్‌ను బెంగళూర్ రాయల్ చాలెంజర్స్ ఆడనున్నాడు. బెంగళూర్ ఫ్రాంఛైజీ అభ్యర్థనను ఐపీఎల్ సాంకేతిక కమిటీ శనివారం ధృవీకరించింది. అందుబాటులో ఉన్న ఆటగాళ్ల జాబితా నుంచి కనీస ధర రూ. 2 కోట్లకు అండర్సన్‌ను బెంగళూర్ ఎంచుకున్నది. ' నాథన్ కౌల్టర్ నైల్ స్థానంలో కివీస్ ఆల్‌రౌండర్ అండర్సన్ జట్టులోకి రానున్నాడు. దూకుడుగా ఆడటంలో అండర్సన్ సత్తా ఉన్నోడు. బెంగళూర్ అతడికి స్వాగతం పలుకుతోంది' అని ఆర్‌సీబీ కోచ్ వెటోరీ తెలిపాడు.

పసిడి మను

- వ్యక్తిగత, జట్టు విభాగాల్లో స్వర్ణాలు
- జూనియర్ షూటింగ్ ప్రపంచకప్



న్యూఢిల్లీ : మెక్సికోలో జరిగిన సీనియర్ ప్రపంచకప్‌లోనే సత్తా చాటిన యువ షూటర్ మను భాకర్ (16) జూనియర్ ప్రపంచకప్‌లోనూ విశేషంగా ఆకట్టుకుంటోంది. వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ (గర్ల్స్) విభాగంలో మను భాకర్ పసిడి గురితో సత్తా చాటింది. ఆఖరు రౌండ్ వరకూ హోరాహోరీగా సాగిన పోటీలో థాయ్‌లాండ్ షూటర్ హిరున్ఫోంను వెనక్కి నెట్టి మను భాకర్ స్వర్ణం సాధించింది. బాయ్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ విభాగంలోనూ భారత్ మెరిసింది. గౌరవ్ రానా రజతం అందుకోగా, అన్మోల్ జైన్ కాంస్యం సాధించాడు. అర్జున్ సింగ్ చీమా, అన్వద్, అభిషేక్ ఆర్యలు వరుసగా 6, 7, 8వ స్థానాల్లో నిలిచారు. జట్టు విభాగంలో అర్జున్ సింగ్ చీమా, అన్మోల్ జైన్‌లతో కలిసి గౌరవ్ రానా పసిడి గురి కొట్టాడు. చైనాకు సిల్వర్ దక్కగా.. అన్వద్, అభిషేక్ ఆర్య, ఆదర్శ్ సింగ్‌లతో కూడిన మరో భారత జట్టుకు కాంస్యం లభించింది. బాలికల జట్టు విభాగంలో మను భాకర్, దేవాన్షి రానా, మహిమ తుర్హిలతో కూడిన బృందం గోల్డ్ గురి చూసేసింది.



ఆసియా బిలియర్డ్స్ అద్వానిదే

న్యూఢిల్లీ: దిగ్గజ బిలియర్డ్స్ ఆటగాడు పంకజ్ అద్వాని ఆసియా టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో బి. భాస్కర్‌పై 6-1తో గెలుపొందిన పంకజ్ 11వ ఆసియా టైటిల్‌ను అందుకున్నాడు. అమీ కామని 3-0 విజయంతో మహిళల టైటిల్‌ను సొంతం చేసుకున్నది. ఈ విజయంతో 2017-18లో ప్రపంచ, ఆసియా, భారత చాంపియన్‌గా అన్ని టైటిళ్లు ఖాతాలో వేసుకున్నట్టైంది.

బాన్‌క్రాఫ్ట్ బాల్ టాంపరింగ్?

కేప్‌టౌన్ : ఆసీస్, సఫారీ మూడో టెస్టులో మరో వివాదం. కంగారూ ఆటగాడు బాన్‌క్రాఫ్ట్ బాల్ టాంపరింగ్ వివాదంలో చిక్కుకున్నాడు. పసుపు పచ్చ రంగులోని ఓ దాన్ని బాన్‌క్రాఫ్ట్ లో దుస్తుల్లో దాచుకోవటం కెమెరాల్లో స్పష్టంగా కనిపించింది. దీంతో అంపైర్లు అతడిని మైదానంలోనే పిలిచి మాట్లాడారు. ఇక మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 238/5తో కొనసాగుతోంది. ఆసీస్ 255 పరుగులకు ఆలౌట్ కాగా.. ప్రస్తుతం సఫారీ 294 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. డికాక్ (29), డివిలియర్స్ (51) క్రీజులో ఉన్నారు.



ఇకనైనా రాణిస్తారా?

- ఇంగ్లాండ్‌తో పొట్టి పోరు నేడు
- మహిళల ముక్కోణపు టీ20 టోర్నీ

ముంబయి : వరుస ఓటముల ఒత్తిడిలో టీమ్ ఇండియా అమ్మాయిలు, నేడు పటిష్ట ఇంగ్లాండ్‌ను ఎదుర్కొనున్నారు. ముక్కోణపు టీ20 సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఐదు వికెట్లతో ఓడిన టీమ్ ఇండియా.. ఆసీస్‌ను 8 వికెట్లతో చిత్తు చేసిన ఇంగ్లాండ్ సవాల్‌ను ఏ విధంగా స్వీకరిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, ఆఖర్లో అనుజా పాటిల్ మినహా బ్యాటింగ్ ఆర్డర్ విఫలమవుతోంది. మిథాలీరాజ్, హర్మన్‌ప్రీత్ కౌర్‌లు సత్తా చాటడంపైనే మన విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఇంగ్లాండ్‌ను జయించాలంటే బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ మన అమ్మాయిలు మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. బంతితో జులన్ గోస్వామి, శిఖా పాండే, రుమేలీ దార్‌లు ప్రత్యర్థిని కట్టడి చేయాల్సిన అవసరం ఉన్నది. మన స్పిన్నర్లు దీప్తి శర్మ, పూనమ్ యాదవ్‌లు భిన్నమైన బంతులతో రావాల్సి ఉంటుంది. ఇంగ్లాండ్ తరపున ఆల్‌రౌండర్ నటాలీ సీవర్, బ్యూమోంట్ అద్భుతంగా ఆడుతున్నారు. ప్రపంచకప్ తర్వాత సొంతగడ్డపై ఒక్క విజయమూ సాధించని అమ్మాయిలు నేడైనా గెలుపు రుచి చూపిస్తారని అభిమానులు సైతం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.